

యూనిట్ 1

# 1. పిల్లల్లారా! పాపల్లారా!

## చిత్రం చూడండి - ఆలోచించండి - మాట్లాడండి





★ చిత్రాన్ని చూడండి. చిత్రంలో ఎవరెవరున్నారు? ఏమి చేస్తున్నారు?

★ పిల్లలు ఫోటోలలో ఉన్నవాళ్ళ గురించి ఏమి మాట్లాడుకుంటున్నారు?

★ మీ పాఠశాలలో కూడా ఇలాంటి ఫోటోలు ఉన్నాయా? వారు ఎవరు? వారిని గురించి చెప్పండి.

**పిల్లలకు సూచనలు :**

★ పాఠంలోని చిత్రాలను చూడండి. చిత్రాలను గురించి మాట్లాడండి.

★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.

★ గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడిగి లేదా పదాలు - అర్థాలు అన్న పట్టికలో చూసి తెలుసుకోండి.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



పిల్లల్లారా పాపల్లారా
రేపటి భారత పౌరుల్లారా
పెద్దలకే ఒక దారిని చూపే పిల్లల్లారా ॥ పిల్లల్లారా ॥

మీ కన్నుల్లో పున్నమి జాబిలి ఉన్నాడు
ఉన్నాడు... పొంచున్నాడు
మీ మనసులలో దేవుడు కొలువై ఉన్నాడు
ఉన్నాడు... అతడున్నాడు ...

భారతమాతకు ముద్దుల పాపలు
మీరేలే... మీరేలే...
అమ్మకు మీపై అంతేలేని ప్రేమేలే
ప్రేమేలే... ప్రేమేలే... ॥ పిల్లల్లారా ॥

భారతదేశం ఒకటే ఇల్లు
భారతమాతకు మీరే కళ్ళు
మీరే కళ్ళు... మీరే కళ్ళు...
జాతిపతాకం పైకెగరేసి
జాతిగౌరవం కాపాడండి
బడిలో, బయటా అంతా కలిసి
భారతీయులై మెలగండి
కన్యాకుమాఠికి కాశ్మీరానికి
అన్యోన్యతను పెంచండి
వీడని బంధం వేయండి ॥ పిల్లల్లారా

రచన : దాశరథి కృష్ణమాచార్యులు

©SCERT
to be republished



# ఇవి చేయండి



## I వినండి - ఆలోచించి చెప్పండి



(అ) గేయాన్ని లయబద్ధంగా పాడండి.

(ఆ) పాఠం చిత్రం చూడండి. చిత్రంలో ఎవరెవరు ఉన్నారు?

(ఇ) గేయభావాన్ని మీ సొంతమాటల్లో చెప్పండి.

## II చదవండి - అర్థంచేసుకొని చెప్పండి - రాయండి



(అ) గేయంలో రెండేసిసార్లు వచ్చిన పదాలు ఉన్నాయి. ఆ పదాలున్న వాక్యాలకింద గీత గీయండి. చదవండి.

(ఆ) కింది పదాలను చదవండి. గేయంలో గుర్తించి గీత గీయండి.

భారతదేశం, పౌరులు, అమ్మ, పిల్లల్లారా, జాతిపతాకం, కన్యాకుమారి, కాశ్మీరు, దేవుడు, పున్నమి జాబిలి, అన్యోన్యత.

(ఇ) కింది పేరాను చదవండి. పేరాలోని అక్షరాలను వర్ణమాలలో గుర్తించి వాటికి '◯' చుట్టండి.

మనదేశం భారతదేశం. మనం భారతీయులం. మనదేశంలో ఎన్నో జాతుల వాళ్ళు, మతాలవాళ్ళు కలిసిమెలిసి ఉన్నారు. ఎన్నో భాషలు మాట్లాడతారు. భాషలు, మతాలు ఏవైనా అందరం భారతీయులం అనే భావనతో ఉంటారు.

### వర్ణమాల

అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ

ఎ ఏ ఐ ఒ ఓ ఔ అం అః

క ఖ గ ఘ ఙ

చ ౘ ఛ జ ౙ ఝ ఞ

ట ఠ డ ఢ ణ

త థ ద ధ న

ప ఫ బ భ మ

య ర ఱ ల ళ వ శ ష స హ

© SCERT not to be republished

**(ఈ) కింది గేయపంక్తులు తారుమారై ఉన్నాయి. గేయం చదివి వాటిని సరిచేసి క్రమంగా రాయండి.**

జాతిగౌరవం కాపాడండి
భారతీయులై మెలగండి
బడిలో, బయటా అంతా కలిసి
జాతిపతాకం పైకెగరేసి

**(ఉ) కింది నినాదాలను హావభావాలతో చదవండి.**

1. జై హింద్!
2. వందే మాతరం!
3. భారతమాతాకీ జై!
4. జై జవాన్! జై కిసాన్!

## III రాయండి



**(అ) జాతిగౌరవం కాపాడడమంటే ఏమిటి? ఇందుకోసం మీరు ఏమి చేస్తారు?**

**(ఆ) గేయం సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి.**

## IV పదజాలం

**(అ) కింది వాక్యాలు చదవండి. గీత గీసిన పదాలను గమనించండి.**

1. జాతరలో అమ్మ నాకోసం <u>బొమ్మ</u> కొన్నది.
   జాతరలో అమ్మ నాకోసం <u>బొమ్మలు</u> కొన్నది.
2. బజారునుంచి మామయ్య నాకోసం ఒక <u>పండు</u> తెచ్చాడు.
   బజారునుంచి మామయ్య నాకోసం <u>పండ్లు</u> తెచ్చాడు.
3. పిల్లలు <u>బంతి</u> తెచ్చారు.
   పిల్లలు <u>బంతులు</u> తెచ్చారు.

పై వాక్యాల్లో మొదటి వాక్యంలోని గీత గీసిన పదం ఒక వస్తువును తెలియజేస్తుంది. ఇలాంటి పదాన్ని **"ఏకవచనం"** అంటారు. రెండో వాక్యంలోని గీత గీసిన పదం ఒకటికన్న ఎక్కువ వస్తువులను తెలియజేస్తుంది. ఇలాంటి పదాన్ని **"బహువచనం"** అంటారు.

**(ఆ) కింది పదాలు చదవండి. వాటిలో ఏకవచన, బహువచన పదాలను కింది పట్టికలో రాయండి.**

పుస్తకాలు, ఇల్లు, బండి, గాజులు, టోపీలు, దారి, పాపలు, చొక్కా, కుర్చీలు

© SCERT not to be republished

| | ఏకవచన పదాలు | బహువచన పదాలు |
|---|---|---|
| ఉదా : | దారి | పాపలు |
| | | |

**(ఆ) కింది గళ్ళలోని అక్షరాలను చదవండి. వాటితో ఏర్పడే పదాలు పట్టికలో రాయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| క | అ | ప | ల | ర |
| జ | వ | డ | గ | త |
| ం | న | ద | మ | శ |
| ఉ | ఈ | చ | స | బ |
| ళ | య | హ | ఊ | ఐ |

| | రెండు అక్షరాల పదాలు | మూడు అక్షరాల పదాలు | నాలుగు అక్షరాల పదాలు |
|---|---|---|---|
| ఉదా : | వడ | పలక | తలగడ |
| | | | |

## V సృజనాత్మకత




**(అ) కింది గేయాన్ని పొడిగించండి.**

చేయి చేయి కలుపుదాం
సేవచేయ కదులుదాం
ప్రజలకొరకే సంఘంగా
ప్రతి నిమిషం కదులుదాం
అవయవాలు ఏవయినా
ఆత్మమాత్ర మొక్కటే
ప్రాంతాలు వేరైనా

........................... ఒక్కటే
భాషలు వేరైనా
........................................
మనుషులు వేరైనా
..................................................
..................................................
................................................

© SCERT not to be republished

## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు



**(అ) కింది పదాలు చదవండి, మీకు తెలిసిన ఇతర భాషలలో వాటిని ఏమంటారో రాయండి.**

| | | | |
|---|---|---|---|
| దేశం | : | పిల్లలు | : |
| చందమామ | : | కళ్ళు | : |
| ప్రేమ | : | పతాకం | : |

**(ఆ) గేయ సారాంశాన్ని మీ మాతృభాషలో రాయండి.**

**(ఇ) ఇతర భాషల్లోని దేశభక్తి గేయాలను సేకరించండి. గోడపత్రికలో ప్రదర్శించండి. రాగంతో పాడండి.**

## VII భాషను గురించి తెలుసుకుందాం



**(అ) కింది పేరాను చదవండి.**

గౌతమి హైదరాబాదు వెళ్ళింది. అక్కడ జూపార్కుకు వెళ్ళింది. సింహం, పులులు, ఏనుగులు, జింకలు మొదలైన జంతువులను చూసింది.

పై పేరాలో వాక్యం పూర్తికాగానే ఉంచిన గుర్తును **వాక్యాంత బిందువు** (ఫుల్ స్టాప్) అంటారు. వాక్యం పూర్తికాగానే ( . ) ఈ గుర్తు పెడతాం. వాక్యంలో కొద్దిసేపు ఆగి మళ్ళీ కొనసాగించడానికి **కామా** ( , ) గుర్తు పెడతాం.

**(ఆ) కింది పేరాను చదవండి. సరైనచోట చుక్క ( . ) కామా ( , ) గుర్తులను పెట్టండి.**

రామయ్యకు పెద్ద తోట ఉంది  ఆ తోటలో మామిడి జామ సపోటా చెట్లు ఉన్నాయి  చెట్లమీద కాకులు చిలకలు గోరింకలు మొదలైన పక్షులు ఉంటున్నాయి.

**(ఇ) పై పేరాలో పండ్లపేర్లు, పక్షులపేర్లు చదివారుకదా! ఇలా పేర్లను తెలిపే పదాలను నామవాచకాలంటారుకదా!**

**మీ తరగతిలో ఉన్నవాళ్ళ పేర్లను రాయండి.**



### నేనివి చేయగలనా ?



| | |
|---|---|
| 1. గేయాన్ని రాగంతో పాడగలను. | ఔను / కాదు |
| 2. గేయాన్ని ధారాళంగా చదవగలను. దాని భావాన్ని సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 3. గేయ సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. గేయాన్ని పొడిగించి రాయగలను. | ఔను / కాదు |

©SCERT not to be republished

యూనిట్ 1

# ౨. చుక్కల లెక్కలు

## చిత్రం చూడండి - ఆలోచించండి - మాట్లాడండి


© SCERT not to be republished

★ చిత్రాన్ని చూడండి. చిత్రంలో ఉన్నది ఎవరు?

★ ఆయన ఏం చేస్తున్నారు?

★ చిత్రం ఆధారంగా కథను ఊహించి చెప్పండి.

**పిల్లలకు సూచనలు :**

★ పాఠంలోని చిత్రాలను చూడండి. చిత్రాలను గురించి మాట్లాడండి.

★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.

★ గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడిగి లేదా పదాలు - అర్థాలు అన్న పట్టికలో చూసి తెలుసుకోండి.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

ఒకరోజు రాత్రి అక్బరు పాదుషా, తన అంతఃపురంలో పచార్లుచేస్తూ ఆకాశంవైపు చూశాడు. నక్షత్రాలు మిలమిలా మెరుస్తున్నాయి. వాటిని ఒకటి.... రెండు.... మూడు.... అని లెక్కపెట్టసాగాడు. తరవాత తను చేస్తున్న పనికి తనకే నవ్వు వచ్చింది. “ఒక తమాషా చేద్దాం!” అనుకున్నాడు అక్బరు. మరుసటి రోజున, “ఆకాశంలో నక్షత్రాలు ఎన్ని ఉన్నాయో లెక్కపెట్టి ఎవరైనా చెప్పగలరా?” అని సభలో అడిగాడు.

అంతా ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. పాదుషా తమను ఆటపట్టిస్తున్నాడేమో అని వాళ్ళకు అనుమానం వచ్చింది. ఇంతలోనే మళ్ళీ అక్బరు, “నక్షత్రాలను లెక్కపెట్టినవారికి వెయ్యి బంగారు నాణేలు బహుమతి. దీనికి పదిహేను రోజుల గడువు ఇస్తున్నాను,” అని చెప్పాడు. పదిహేను రోజులు గడిచిపోయాయి. “నక్షత్రాలను ఎవరయినా లెక్కపెట్టారా?” అని సభలో అక్బరు అడిగాడు. “లేదు, ప్రభూ,” అన్నారు అంతా.

అక్బరుకు బీర్బల్ కనిపించలేదు. “బీర్బల్‌గారు ఏరీ?” అని అడిగాడు. ఇంతలో ఒక పెద్ద మూట మోసుకుంటూ బీర్బల్ సభలోకి వచ్చాడు. “ఏమిటా మూట?” అని అడిగాడు అక్బరు. “ఆకాశంలో ఉన్న నక్షత్రాల లెక్క మహాప్రభూ!” అన్నాడు బీర్బల్. “చూపించండి,” అన్నాడు అక్బరు. మూట విప్పాడు బీర్బల్. ఆ మూట నిండా ఆవాలు! అక్బరు ఆశ్చర్యపోయాడు. “ఏమిటివి?” అని అడిగాడు. “ఆకాశంలో చూస్తూ నక్షత్రాలు లెక్కపెట్టడం కష్టం కదా! అందుకే ఒక్కొక్క నక్షత్రానికి ఒక్కొక్క ఆవగింజను పక్కన పెడుతూ వచ్చాను. ఆకాశంలో ఎన్ని నక్షత్రాలు ఉన్నాయో అన్ని ఆవగింజలు ఈ మూటలో ఉన్నాయి ప్రభూ!” అని చెప్పాడు బీర్బల్.

“బాగానే ఉంది. ఆకాశంలో ఎన్ని నక్షత్రాలు ఉన్నాయో అన్ని ఆవాలూ ఇక్కడ ఉన్నాయా?”



© SCERT not to be republished

అంటూ సందేహంగా అడిగాడు అక్బరు. "ఓ, కచ్చితంగా ఉన్నాయి ప్రభూ!" అని చెప్పాడు బీర్బల్. "కావాలంటే ముందుగా మీరు ఆవాలు లెక్కపెట్టుకొని తరవాత నక్షత్రాలు లెక్కపెట్టండి. అప్పుడు లెక్క సరిపోయినదీ, లేనిదీ తెలుస్తుంది," అని మళ్ళీ చెప్పాడు బీర్బల్.


అక్బరు బీర్బల్ తెలివితేటల్ని మెచ్చుకున్నాడు. నవ్వుతూ బీర్బల్‌కు వెయ్యి బంగారు నాణేలు బహూకరించాడు.



## ఇవి చేయండి



## I వినండి - ఆలోచించి చెప్పండి




(అ) ఈ కథను సొంతమాటల్లో చెప్పండి?

(ఆ) చుక్కల్ని లెక్కించగలమా? లెక్కించలేమా? ఎందుకు?

(ఇ) మీకు ఆశ్చర్యం కలిగించిన సంఘటనలు చెప్పండి?

## II చదవండి - అర్థం చేసుకొని చెప్పండి - రాయండి



(అ) పాఠం చదవండి. కింది మాటలు ఎవరు ఎవరితో అన్నారో చెప్పండి.

1. "బీర్బల్‌గారు ఏరీ....?"
2. "ఏమిటా మాట?"
3. "నక్షత్రాల లెక్క మహాప్రభూ!"
4. "ఆకాశంలోకి చూస్తూ నక్షత్రాలను లెక్కపెట్టడం కష్టం కదా!"
5. "చూపించండి"

(ఆ) కింది వాక్యాలు చదవండి. పాఠం చదివి తప్పు (×) ఒప్పు (✓) లను గుర్తించండి.

1. అక్బరు తోటలో పచార్లు చేస్తున్నాడు. (　　)
2. నక్షత్రాలను లెక్కించి చెప్పినవారికి తన రాజ్యాన్ని ఇస్తానని అక్బరు చెప్పాడు. (　　)
3. నక్షత్రాల్ని లెక్కించడానికి పదిహేను రోజులు గడువిచ్చాడు. (　　)
4. బీర్బల్ సభలోకి పెద్ద డబ్బాను మోసుకొచ్చాడు. (　　)
5. బీర్బల్ నక్షత్రాలను బియ్యపు గింజలతో లెక్కించాడు. (　　)

© SCERT not to be republished

(ఇ) పాఠం చదివి, తారుమారైన పదాలను సరైన క్రమంలో ఉంచి వాక్యాలు రాయండి.

1. చూసుకున్నారు, ఒకరి, ఒకరు, ముఖాలు
2. బహుమతి, లెక్కించినవారికి, నాణేలు, బంగారు
3. వచ్చాడు, పెద్దమూటతో, సభకు, బీర్బల్
4. వెయ్యి, బహూకరించాడు, బంగారునాణేలు, బీర్బల్‌కు
5. ఆవాలు, నిండా, ఆ మూట, ఉన్నాయి.

(ఈ) పాఠంలో 'ా', 'ి', 'ీ', 'ు', 'ూ' ఉన్న పదాలను గుర్తించి రాయండి.

| | ా | ి | ీ | ు | ూ |
|---|---|---|---|---|---|
| ఉదా : | పాదుషా | మిలమిల | బీర్బల్ | రెండు | మూట |

## III రాయండి




(అ) అక్బర్‌కు తాను చేసిన పనికి తనకే నవ్వు వచ్చింది. ఏమా పని? ఎందువల్ల?

(ఆ) బీర్బల్ గురించి ఐదు వాక్యాలు రాయండి.

(ఇ) కథను సొంతమాటల్లో రాయండి.

## IV పదజాలం




(అ) గీత గీసిన పదానికి సమానమైన అర్థం వచ్చే పదం పాఠంలో ఉంది. పాఠం చదివి ఆ పదాన్ని గుర్తించి వాక్యం తిరిగి రాయండి.

1. చుక్కలు మిలమిల మెరుస్తున్నాయి.
   నక్షత్రాలు మిలమిల మెరుస్తున్నాయి.
   ...............................................................................................
2. పాదుషా తమను ఆటపట్టిస్తున్నాడేమోనని సందేహం వచ్చింది.
   ...............................................................................................
3. వేయి బంగారునాణేలు కానుక గా ఇస్తామన్నాడు.
   ...............................................................................................
4. ఆయన తెలివితేటల్ని అక్బర్ మెచ్చుకున్నాడు.
   ...............................................................................................
5. అక్బరు నింగి వైపు చూశాడు.
   ...............................................................................................


© SCERT not to be republished

(అ) కింది పదం చదవండి. దానికి సంబంధించిన పదాలు రాయండి. వాటితో వాక్యాలు రాయండి.




ఉదా : ఆకాశంలో పక్షులు ఎగురుతున్నాయి.

## V సృజనాత్మకత



(అ) పెద్ద మూటతో సభకు వచ్చిన బీర్బల్‌కు, అక్బరుకు మధ్య జరిగిన సంభాషణ రాయండి.

అక్బర్ : ఏమిటా మూట ?

బీర్బల్ : నక్షత్రాల లెక్క ప్రభూ!

అక్బర్ : ఏదీ చూపెట్టు.

బీర్బల్ :

అక్బర్ :

బీర్బల్ :

అక్బర్ :

బీర్బల్ :

అక్బర్ :

(ఆ) ఆకాశంలో చంద్రుడు, నక్షత్రాలు ఉన్నట్లు చిత్రం గీయండి. రంగులు వేయండి. దాన్ని గురించి రాయండి.

## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు



(అ) ఏదైనా తెలివైన పని చేస్తే అందరూ మెచ్చుకుంటారు కదా! ఎలా మెచ్చుకుంటారు?

తెలుగులో : బాగుంది! బాగా చేశావు.

ఇంగ్లీషులో :

హిందీలో :

మీకు తెలిసిన ఇతర భాషల్లో :

©SCERT not to be republished

(ఆ) మీ పాఠశాల గ్రంథాలయం నుంచి, దినపత్రికల నుంచి అక్బర్-బీర్బల్ కథలను సేకరించండి. తరగతిగదిలో ప్రదర్శించండి. ఎవరు సేకరించిన కథ బాగుందో చెప్పండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం



(అ) కింది పేరాను చదవండి. '!', '?' గుర్తులు ఎక్కడ ఉన్నాయో చూడండి.

అబ్బో విమానం ఎంత ఎత్తులో ఎగురుతూ ఉందో! ఈ విమానం ఎక్కడికి పోతూంది? విమానం మన ఊరిలో దిగితే బాగుంటుంది కదూ! విమానంలో ఎంతమంది మనుషులు కూర్చోవచ్చు? విమానానికి చక్రాలు ఉంటాయా?

'?' దీన్ని **ప్రశ్న గుర్తు** అంటారు. ఇది ప్రశ్నరూపంలోని వాక్యం చివర ఉంటుంది. "!" దీన్ని **ఆశ్చర్యార్థకపు గుర్తు** అంటారు. ఆశ్చర్యం కలిగించే చోట విశేషమైన చోట గుర్తును ఉంచుతారు.

పాఠం చదవండి.?, ! గుర్తులు ఎక్కడెక్కడ ఉన్నాయో ఆ వాక్యాల కింద గీతలు గీయండి.

(ఆ) సీత పట్నం వెళ్ళింది. ఆమె అక్కడ సినిమా చూసింది.

గీతలు గీసిన పదాలను గమనించండి.

**'సీత', 'పట్నం'** నామవాచక పదాలు. ఈ పదాలకు బదులుగా **'ఆమె', 'అక్కడ'** అనే పదాలను వాడాం. ఇలా నామవాచకాలకు బదులుగా వాడే పదాలను **'సర్వనామాలు'** అంటాం.

(ఇ) కింది వాక్యాలలో నామవాచకాలకు బదులు సర్వనామాలను ఉపయోగించి రాయండి.

1. శివయ్య పొలానికి వెళ్ళాడు. శివయ్య పొలంలో కూరగాయలు కోశాడు.
2. రాజు, శివ మంచి స్నేహితులు. రాజు, శివ ఇద్దరూ కలిసి ఆడుకోడానికి వెళ్ళారు.
3. పావురాలు నేలమీద వాలాయి. పావురాలు వలలో చిక్కుకున్నాయి.
5. మాధవి వరంగల్లు వెళ్ళింది. మాధవి వరంగల్లులో బట్టలు కొన్నది.



### నేనివి చేయగలనా ?



| | |
|---|---|
| 1. కథను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. కథను ధారాళంగా చదవగలను. | ఔను / కాదు |
| 3. కథను సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. అక్బర్‌కు, బీర్బల్‌కు మధ్య జరిగిన సంభాషణను రాయగలను. | ఔను / కాదు |

© SCERT not to be republished

యూనిట్ 1

# 3. పసందైన పాయసం

**చిత్రం చూడండి - ఆలోచించండి - మాట్లాడండి**



★ చిత్రం చూడండి. చిత్రంలో ఏం జరుగుతూ ఉందో చెప్పండి.

★ ఇలాంటివి మీ ఇండ్లలో జరుగుతుంటాయా? ఎప్పుడెప్పుడు?

★ చిత్రంలోనివారు ఏమేమి తినుబండారాలు చేస్తున్నారు? మీకు ఏవేవంటే ఇష్టం?

**పిల్లలకు సూచనలు :**

★ పాఠంలోని చిత్రాలను చూడండి. చిత్రాలను గురించి మాట్లాడండి.

★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.

★ గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడిగి లేదా పదాలు - అర్థాలు అన్న పట్టికలో చూసి తెలుసుకోండి.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

అమ్మా! అమ్మా!" అంటూ పిలిచింది మానస. 'ఏమిటే!" అని వంటింట్లోనుంచి జవాబిచ్చింది అమ్మ. "అమ్మా! నిన్న రజియా, స్కూలుకు పాయసం తెచ్చింది. లంచ్-టైములో మా అందరికీ పెట్టింది. చాలా బాగుంది. మనం కూడా పాయసం చేసుకొందామా!" అంది మానస.



"పాయసం చేయడం తేలికే మానసా! ఇప్పుడే చేస్తాను; సరేనా!" అంది అమ్మ. "పాయసం చెయ్యాలంటే ఏమేమి కావాలమ్మా?" అని అడిగింది మానస. "అదుగో ఆ డబ్బాల్లో సేమియా, పంచదార, జీడిపప్పు, ద్రాక్ష ఉన్నాయి. వాటిని తీసుకురా! సీసాలో నెయ్యి ఉంది, గిన్నెలో పాలు ఉన్నాయి, వాటిని కూడా తీసుకురా!" అంది అమ్మ. చెప్పినవన్నీ తీసుకుని వచ్చింది మానస.

అమ్మ గ్యాస్‌పొయ్యి వెలిగించింది. దానిమీద గిన్నె పెట్టి అందులో నెయ్యి వేసింది. జీడిపప్పు, ద్రాక్ష అందులో వేయించింది. పక్కకు పెట్టింది. సేమియాను కూడా దోరగా వేయిస్తూ ఉంది. "వీటిని ఎందుకు వేయించాలమ్మా?" అని అడిగింది మానస. "వీటిని వేయించకుండా ఉడికిస్తే పాయసం జిగురుగా ఉంటుంది. ముద్ద అయిపోతుంది. రుచి కూడా అంత బాగుండదు. పాయసం రుచిగా ఉండాలంటే వీటన్నింటినీ ముందుగా వేయించుకోవాలి," అని అంది అమ్మ. వేయించిన సేమియాను పక్కకు పెట్టింది.

పాలగిన్నెను స్టౌమీద పెట్టింది. పాలు మరిగాక సేమియాను అందులో వేసింది. అవి ఉడుకుతూ ఉన్నాయి. ఏలకులను ఒలిచి గింజలను పొడిగాచేయమని చెప్పింది. మానస వాటిని పొడిగా చేస్తూ, "ఈ పొడి ఎందుకు వేస్తారమ్మా?" అని అడిగింది. "పాయసం ఘుమఘుమలాడాలంటే ఏలకుల పొడి వెయ్యాలి," అంది అమ్మ. "వేస్తే పాయసం బాగుంటుందా?" అంది మానస. "తినబోతూ రుచి అడగడమెందుకు?" అంది అమ్మ.

సేమియా, పాలలో బాగా ఉడికింది. అందులో పంచదార వేయమని మానసకు చెప్పింది, వాళ్ళ అమ్మ. వేసిన పంచదారను గరిటెతో కలపమంది.

కాసేపయాక వేయించిన జీడిపప్పు, ఎండుద్రాక్షపళ్ళు వేసింది. చివరగా ఏలకుల పొడి, నెయ్యి వేసి కిందికి దించి పెట్టింది. "అబ్బా! పాయసం ఘుమఘుమలాడుతూ ఉంది," అంది మానస. "చూశావా, పాయసం చేయడం ఎంత తేలికో!" చెప్పింది అమ్మ.

“అమ్మ పాయసం చేసిందోచ్... పాయసం చేయడం నాక్కూడా తెలిసిందోచ్!” అంటూ మానస, హాల్లోకి పరుగెత్తుకొని వచ్చింది. విషయం అందరికీ చెప్పి బయటికి వెళ్లింది.

మానసకు ముంతాజ్, జాన్, నళిని, నాగూర్ మంచి స్నేహితులు. మానస వాళ్ళందరినీ ఇంటికి పిలుచుకొని వచ్చింది.

కప్పుల్లో వేడి వేడి పాయసాన్ని తీసుకొని వచ్చింది అమ్మ. అందరికీ తలొక కప్పు ఇచ్చింది. అందరూ పాయసం తింటూ, ‘పాయసం భలే రుచిగా ఉంది’ అన్నారు. “నేనూ, అమ్మా కలిసి చేశాం తెలుసా!” అంది మానస.

పాయసాన్ని తింటున్న ముంతాజ్, “దీన్ని మేము ఖీర్ అంటాం,” అంది. “రంజాన్ పండుగ రోజున మేము ఖీర్ తప్పకుండా చేసుకుంటాం,” మళ్లీ అంది, ముంతాజ్.

“మేము కూడా క్రిస్మస్ పండుగకు తప్పకుండా పాయసం చేసుకొంటాం!” అన్నాడు జాన్.


“ప్రతి పండుగకూ మేము తప్పకుండా పాయసం చేసుకుంటాం,” అంది నళిని. అందరూ పాయసం తింటూ కబుర్లు చెప్పుకొంటూ చాలాసేపు హాయిగా గడిపారు.



## ఇవి చేయండి



### I వినండి - ఆలోచించి చెప్పండి




(అ) పాఠంలో ఉన్న చిత్రంలో ఎవరెవరు ఉన్నారు? ఏం చేస్తున్నారు?

(ఆ) మీ అమ్మ చేసే వంటకాలలో మీకు ఏది బాగా నచ్చుతుంది? ఎందుకు?

(ఇ) మీ ఇంట్లో చేసుకొనే మీకిష్టమైన వంటకం ఏది? దాన్ని ఎలా తయారుచేస్తారో చెప్పండి.

### II చదవండి - అర్థం చేసుకొని చెప్పండి - రాయండి



**(అ) పాఠం చదవండి. కింది ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి. రాయండి.**

1. మానస పాయసం చేసుకుందామని అమ్మను ఎందుకు అడిగింది?
2. పాయసం చేయడానికి అమ్మ మానసను ఏమేమి తీసుకురమ్మంది?
3. అమ్మ పాయసం ఎలా చేసింది?
4. మానస స్నేహితులు పాయసాన్ని ఎప్పుడెప్పుడు చేసుకుంటామని చెప్పారు?

**(ఆ) కింది వాక్యాలను చదవండి. పాఠం చదివి పాయసం చేసే విధానాన్ని వరసక్రమంలో రాయండి.**

1. పంచదార వేసి కలిపింది.
2. అమ్మ జీడిపప్పు, సేమియా వేయించింది.
3. సేమియా పంచదార, నెయ్యి, జీడిపప్పు, ఎండుద్రాక్ష తెచ్చింది మానస.
4. పాయసంగిన్నె దించిపెట్టింది.
5. సేమియాను పాలతోపాటు ఉడికించింది.

© SCERT not to be republished

(ఇ) పాఠం చదవండి. పాఠంలోని ె, ే, ై, ొ, ో, ౌ పదాలను గుర్తించి రాయండి. ఇతర పాఠాలలోంచి కూడా రాయండి.

| ె | ే | ై | ొ | ో | ౌ |
|---|---|---|---|---|---|
| | | | | | |


## III రాయండి



(అ) ఆకుకూరతో పప్పు చేయడానికి కావాల్సిన పదార్థాలేమిటి? తయారుచేసే విధానాన్ని రాయండి.

(ఆ) మీరు జరుపుకొనే పండుగను గురించి రాయండి. ఆ పండుగరోజుల్లో చేసుకొనే వంటకాలను గురించి రాయండి.

## IV పదజాలం



(అ) కింద గీత గీసిన పదాలు ఆధారంగా వ్యతిరేకభావం వచ్చేలా వాక్యాలను తిరిగి రాయండి.

ఉదా: నా దగ్గర **పొడుగు** పెన్సిలు ఉంది.

నా దగ్గర పొట్టి పెన్సిలు ఉంది.

1. మా ఊరు ఇక్కడికి చాలా **దూరం.**

   ........................................................................................

2. మంచం **మీద** పిల్లి ఉంది.

   ........................................................................................

3. ఇడ్లీలు **వేడిగా** ఉన్నాయి.

   ........................................................................................

4. పాయసం చేయడం చాలా **సులభం.**

   ........................................................................................


వాక్యాలలో వ్యతిరేకభావం రావడానికి ఏం మార్పు జరిగిందో చెప్పండి.



© SCERT not to be republished

(అ) కింది వృత్తంలో ఉన్న పదాన్ని చదవండి. ఆ పదానికి సంబంధించిన పదాలు రాయండి.

ఆ పదాలను ఉపయోగించి ఒక పేరా రాయండి.




.................................................................................................

.................................................................................................

.................................................................................................

## V సృజనాత్మకత



(అ) కింది గేయాన్ని పొడిగించండి.

తియ్యతియ్యటి పాయసం

పసందైన పాయసం

.........................................

.........................................



## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు



(అ) కింది ఆహారపదార్థాలను ఉర్దూ/హిందీ/తమిళం/కన్నడ భాషలలో ఏమంటారో తెలుసుకొని రాయండి.

పాయసం : ....................................................

అన్నం : ....................................................

మజ్జిగ : ....................................................

పాలు : ....................................................

బియ్యం : ....................................................

వంకాయ : ....................................................

(ఆ) మీ మిత్రుల ఇళ్లల్లో పండుగలు / శుభకార్యాలు జరిగినప్పుడు ఏ ఏ వంటకాలు చేస్తారో తెలుసుకొని రాయండి. మీ పండుగలలో / మీ ఇంట్లో జరిగే కార్యక్రమాల్లో కూడా వీటినే తయారుచేస్తారా? దీన్ని గురించి మీరు గ్రహించిందేమిటో చెప్పండి.

© SCERT not to be republished

(ఇ) నూనె / నెయ్యి వాడకుండా, వండకుండా తయారుచేసే ఆహార పదార్థాలు ఏవి? వాటిలో ఏదైనా ఒకదాన్ని గురించి ఎలా తయారు చేశారో తెలుసుకొని రాయండి. దీనివల్ల కలిగే ప్రయోజనాలను తెలపండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం



(అ) కింది వాక్యాలను చదవండి. గీత గీసిన పదాలు దేన్ని గురించి చెబుతున్నాయో గమనించండి.

1. పావని పాట పాడుతున్నది.
2. పిల్లి ఎలుకలను తింటుంది.
3. మామయ్య తోరణాలు కట్టాడు.
4. ఉగాదినాడు సిద్ధాంతిగారు పంచాంగపఠనం చేశాడు.
5. వాల్మీకి రామాయణం రచించాడు.
6. నేను కొత్తబట్టలు కట్టుకున్నాను.

గీత గీసిన పదాలు ఎవరెవరు ఏయే పనులు చేశారో చెబుతున్నాయి కదా! ఇలా పనిని తెలిపే పదాలను **"క్రియాపదాలు"** అంటారు.

(ఆ) పాఠంలోఉన్న క్రియాపదాలను గుర్తించి రాయండి.

| | | |
|---|---|---|
| ................................ | ................................ | ................................ |
| ................................ | ................................ | ................................ |
| ................................ | ................................ | ................................ |
| ................................ | ................................ | ................................ |
| ................................ | ................................ | ................................ |
| ................................ | ................................ | ................................ |



### నేనివి చేయగలనా ?



| | |
|---|---|
| 1. పాయసం తయారీని గురించి చెప్పగలను. | ఔను / కాదు |
| 2. పాఠాన్ని ధారాళంగా చదవగలను. | ఔను / కాదు |
| 3. మేము జరుపుకొన్న పండుగను గురించి, వండుకొనే వంటకాలను గురించి రాయగలను. | ఔను / కాదు |
| 4. పాయసం తయారీని గురించి గేయం రాయగలను. | ఔను / కాదు |

© SCERT not to be republished

యూనిట్ 1

# పాపం గోపి !

చదువు - ఆనందించు




గోపి రైలులోని ఒక బోగీలోకి ఎక్కాడు. రద్దీ ఎక్కువగా ఉంది. సీటు దొరకలేదు. ఒక ఉపాయం ఆలోచించాడు.






జనమంతా భయపడి తమ సామానులతో కిందికి దూకేశారు.






ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ


అప్పుడే తెల్లవారిపోయిందే!
"బాబూ! ఇలా రా!
ఓ కప్పు కాఫీ ఇవ్వు!"
రైలు తొందరగానే వచ్చేసిందే!
"రైలేమిటి! రావడమేమిటి!
ఈ బోగీలోకి పాము వచ్చిందట!
దీన్ని ఇలాగే వదిలేసి రైలు రాత్రే
వెళ్లిపోయింది."

పాపం గోపి!

యూనిట్ 2

# 4. అడవి తల్లి

## చిత్రం చూడండి - ఆలోచించండి - మాట్లాడండి



- ★ చిత్రం చూడండి. చిత్రంలో ఏవేవి ఉన్నాయో చెప్పండి.
- ★ మీరు ఏయే జంతువుల్ని చూశారు? అడవిలో ఏయే జంతువులు నివసిస్తాయి?
- ★ ఒక్కొక్కసారి అడవి జంతువులు గ్రామాల్లోకి / ఊళ్ళల్లోకి వస్తున్నాయి కదా? ఇలా ఎందుకు వస్తున్నాయి?
- ★ అడవిలో జంతువులు ఉండడంవల్ల కలిగే మేలు ఏమిటో ఆలోచించి చెప్పండి.

**పిల్లలకు సూచనలు :**

- ★ పాఠంలోని చిత్రాలను చూడండి. చిత్రాలను గురించి మాట్లాడండి.
- ★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.
- ★ గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడిగి లేదా పదాలు - అర్థాలు అన్న పట్టికలో చూసి తెలుసుకోండి.



అడవితల్లి బావురంటోంది
ఆదుకొమ్మని వేడుకుంటోంది
తోడుగుందామా అడవికి ఊపిరౌదామా
తోడుగుందామా అడవికి ఊతమౌదామా

పూలవాసన గాలికిచ్చి
పండ్లుకాయలు మనిషికిచ్చి
వాగువంకల ఏటి నడకతో
కొండకోనల గొంతు తడిపి
మనిషి మనుగడలోన మలుపై
నిలిచినట్టి అడవితల్లికి
తోడుగుందామా అడవికి ఊపిరౌదామా
తోడుగుందామా అడవికి ఊతమౌదామా

॥అడవి॥

గంతులేసే లేళ్ళ గుంపుకు
మనసుదోచే అందమిచ్చి
ఆకసాన ఎగిరే పక్షికి
రంగురంగుల రెక్కలిచ్చి
జగతికి అందం తెచ్చిన అడవి
అంతకంతకు తరుగుతు ఉంటే
తోడుగుందామా అడవికి ఊపిరౌదామా
తోడుగుందామా అడవికి ఊతమౌదామా

॥అడవి॥

నీటిచుక్కకు సాయమిచ్చి
నల్లమబ్బును నింగికిచ్చి
గాలితరగల పైకి పంపి
వానజల్లును నేలకు దింపి
పచ్చదనమే పంచిన అడవి
చినుకు రాలక చిన్నబోతే
తోడుగుందామా అడవికి ఊపిరౌదామా
తోడుగుందామా అడవికి ఊతమౌదామా

॥అడవి॥

అడవిలేక అవని లేదు
చెట్టులేక చెలిమి లేదు
మొక్క మానై ఎదగకుంటే
జీవకోటికి బతుకు లేదు
చెట్టు చేమను రక్షించుకుంటూ
బతుకుదీపం కాపాడుకుంటూ
తోడుగుందామా అడవికి ఊపిరౌదామా
తోడుగుందామా అడవికి ఊతమౌదామా

॥అడవి॥

- తాడికొండ వెంకట నరసింహారావు

SCERT
Republished





## ఇవి చేయండి



### I వినండి - ఆలోచించి చెప్పండి



(అ) గేయాన్ని రాగయుక్తంగా పాడండి. అభినయం చేయండి.

(ఆ) అడవి మనకు ఏమేమి ఇస్తుంది? అయితే అడవికి మనం ఏమి చేస్తున్నాం?

(ఇ) అడవికి మనం ఎందుకు తోడుగా ఉండాలి?

### II చదవండి - అర్థం చేసుకొని చెప్పండి - రాయండి



(అ) కింది పదాలను చదవండి. గేయంలో ఇలా చివర వచ్చే పదాలను గుర్తించి గీత గీయండి.

| | |
|---|---|
| బావురంటోంది | గాలికిచ్చి |
| వేడుకుంటోంది | మనిషికిచ్చి |

(ఆ) గేయంలో మబ్బు ఎలా ఏర్పడుతుందో వాన ఎలా కురుస్తుందో తెలిపే పంక్తులను చదవండి. భావాన్ని సొంత మాటల్లో రాయండి.

..........................................................................................................

..........................................................................................................

(ఇ) గేయం చదవండి. 'అడవి' ఎవరెవరికి ఏమేమి ఇచ్చిందో చెప్పండి.

ఉదా : 1. గాలికి - పూలవాసన

2. మనిషికి - ..........................................................

3. లేళ్ళకు - ..........................................................

4. పక్షికి - ..........................................................

5. నింగికి - ..........................................................

(ఈ) కింది గేయాన్ని చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

అడవిలేక అవని లేదు
చెట్టులేక చెలిమి లేదు
మొక్క మానై ఎదగకుంటె
జీవకోటికి బతుకు లేదు
చెట్టుచేమను రక్షించుకుంటూ
బతుకు దీపం కాపాడుకుంటూ

© SCERT not to be republished

1. అవని అంటే అర్థం ఏమిటి?

2. జీవకోటి బతకాలంటే ఏమేమి కావాలి?

3. అన్ని మొక్కలూ మానులౌతాయా? మానులయ్యే మొక్కలను రెండింటిని గురించి రాయండి.

4. చెట్లను రక్షించడంవల్ల ప్రయోజనాలు ఏవి?

**(ఉ) ముందు పాఠాల ఆధారంగా ్క, ్గ, ్య, ్జ ఒత్తు గల పదాలను గుర్తించి రాయండి.**

| ్క | ్గ | ్య | ్జ |
|---|---|---|---|
| | | | |

© SCERT not to be republished

## III రాయండి



**(అ) 'అడవితల్లి బావురంటోంది. ఆదుకొమ్మని వేడుకుంటోంది' అని కవి ఎందుకన్నాడు? దీని ద్వారా మీరు ఏమి గ్రహించారు?**


**(ఆ) 'జగతికి అందం అడవి' అనే వాక్యంపై మీ అభిప్రాయం తెలపండి?**

**(ఆ) అడవికి అందాన్ని ఇచ్చేవి ఏవేవో రాయండి?**

**(ఇ) గేయంలో "అడవికి తోడుగా ఉందామా" అని ఎందుకన్నారు?**

**(ఈ) గేయం సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.**

## IV పదజాలం



**(అ) కింది పదాలకు సరైన అర్థాన్నిచ్చే పదానికి '◯' చుట్టండి.**

ఉదా : **అవని** : ప్రపంచం, సముద్రం, (భూమి)

**చెలిమి** : ప్రేమ, స్నేహం, ద్వేషం

**జగతి** : నది, ప్రపంచం, ఆకాశం

**వృక్షం** : చెట్టు, పంటలు, పూలు

**అరణ్యం** : లోయ, జలపాతం, అడవి


## V సృజనాత్మకత



**(అ) అడవి బొమ్మ గీయండి. రంగులు వేయండి. దాని ఆత్మకథను రాయండి.**

నా గురించి తెలుసుకున్నారు కదా? నేనే అడవిని. నన్ను అరణ్యం అని కూడా అంటారు. నావల్ల ఎన్నో లాభాలు ఉన్నాయి ..............................

## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు



**అ) రవి గేయం చదివి, చెట్లను కాపాడాలనుకున్నాడు. గ్రామంలో ప్రజలందరికీ చెట్లను పెంచడంవల్ల కలిగే లాభాలను గురించి చెప్పాలనుకున్నాడు. తన మిత్రులందర్నీ పిలిచాడు. ఊరేగింపు నిర్వహించాలనుకున్నాడు. అందుకోసం ఇలా నినాదాలు తయారుచేశాడు.**

1. పచ్చని చెట్లను పెంచుదాం - ప్రాణవాయువును పంచుదాం
2. పచ్చని చెట్లు - ప్రగతికి మెట్లు
3. వృక్షాలను మనం రక్షిస్తే - అవి మనల్ని రక్షిస్తాయి.

ఇలాంటి నినాదాలు మీరు మరికొన్ని తయారుచేయండి లేదా సేకరించండి. వాటిని పాఠశాలలో ప్రదర్శించండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం



**(అ) కింది పదాలు చదవండి. పట్టిక ఆధారంగా పదాలను జతపరచి వీలైనన్ని వాక్యాలు రాయండి.**

| | | |
|---|---|---|
| మంజు | పాట | చూసింది |
| అంజి | ఆట | చూశాడు |
| రహీం | సినిమా | వెళ్ళింది |
| రోసీ | కథ | పాడింది |
| | | ఆడాడు |
| | | రాశాడు |
| | | ఆడాడు |

ఉదా : మంజు పాట పాడింది.

.........................................

.........................................

.........................................

.........................................

.........................................

.........................................





### నేనివి చేయగలనా ?

| | |
|---|---|
| 1. గేయాన్ని రాగయుక్తంగా పాడగలను. | ఔను / కాదు |
| 2. గేయాన్ని ధారాళంగా చదవగలను. | ఔను / కాదు |
| 3. గేయం సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. అడవిబొమ్మ గీసి దాని ఆత్మకథను రాయగలను. | ఔను / కాదు |

© SCERT not to be republished

యూనిట్ 2

# 5. గుర్రం గుడ్డు

## చిత్రం చూడండి - ఆలోచించండి - మాట్లాడండి



★ పై చిత్రాన్ని చూడండి. ఏం జరుగుతూందో చెప్పండి.

★ చిత్రంలోని మనిషి గడ్డిమోపును తలపై పెట్టుకొని పోవటానికి కారణమేమై ఉంటుందో చెప్పండి.

**పిల్లలకు సూచనలు :**

★ పాఠంలోని చిత్రాలను చూడండి. చిత్రాలను గురించి మాట్లాడండి.

★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.

★ గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడిగి లేదా పదాలు - అర్థాలు అన్న పట్టికలో చూసి తెలుసుకోండి.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



పరమానందయ్యగారికి పన్నెండు మంది శిష్యులు ఉన్నారు. వీళ్ళు చాలా అమాయికులు. ఒకరోజున పరమానందయ్యగారి భార్య లక్ష్మీదేవమ్మగారు పూజకోసం పువ్వులు తెమ్మని శిష్యులను పంపారు. పూలకోసం శిష్యులంతా తోటకు వెళ్ళారు.


ఆ తోటదగ్గర ఉన్న పచ్చికలో కొన్ని గుర్రాలు మేస్తూ కనిపించాయి. గుర్రాల యజమాని గుమ్మడికాయల తోట ముందర కూర్చొని ఉన్నాడు. 'గురువుగారికి గుర్రం లేదు కదా! గుర్రం కొందామా?' అని శిష్యులు అనుకొన్నారు. ఆ యజమాని దగ్గరకుపోయి "గుర్రం అమ్ముతావా?" అనడిగారు. 'అమ్ముతాను' అన్నాడు యజమాని. 'ఎంత?' అని అడిగారు శిష్యులు. 'అయిదువందల వరహాలు,' అని చెప్పాడు యజమాని. "మాకు నాలుగు కాళ్ళు ఉన్న గుర్రం కావాలి," అన్నారు శిష్యులు. వీళ్ళ వాలకం చూసిన ఆ గుర్రాల యజమానికి, వీళ్ళంతా వెర్రిబాగులవాళ్ళని అర్థమయింది. "నాలుగు కాళ్ళున్న గుర్రం కావాలంటే నూరు వరహాలు ఎక్కువ అవుతాయి," అన్నాడు యజమాని. శిష్యులంతా ఆలోచించుకున్నారు. ఎలాగైనా గుర్రం కొనాలనుకున్నారు.

శిష్యులదగ్గర అంత డబ్బులేదు. ఇక్కడ కొందరు ఉండి మరికొందరు ఇంటికి పోయి డబ్బు తేవాలని నిర్ణయించుకున్నారు. ఇంటికి పరుగున పోయి లక్ష్మీదేవమ్మగారికి గుర్రం సంగతి చెప్పారు. చాలా మంచి గుర్రం. గురువుగారు స్వారీ చేయడానికి బాగుంటుందని లక్ష్మీదేవమ్మగార్ని ఒప్పించారు. ఆమెకు కూడా పరమానందయ్యగారు గుర్రంమీద దర్జాగా పక్కగ్రామాలకు వెళ్ళివస్తే ఎంతో గౌరవంగా ఉంటుందని మనసులో ఉంది. ఆరువందల వరహాలు ఇచ్చింది.

© SCERT not to be republished

వరహాల మూటను పట్టుకొని శిష్యులంతా ఆదరబాదరగా గుర్రాలు మేస్తున్నచోటికి వెళ్ళారు. వరహాల మూటను గుర్రాల యజమానికిచ్చారు. ఇచ్చి మా గురువుగారికి మంచిగుర్రం కావాలి. దానికి ఒక తల, తలకు రెండు కళ్ళు, చెవులు, నోరు, మెడ, పొట్ట, తోక, నాలుగు కాళ్ళు ఉండాలన్నారు.

వీరి వెర్రితనం చూసిన గుర్రాల యజమానికి ఆశ పుట్టింది. మోసంచేసి ఆ ఆరువందల వరహాలూ కాజెయ్యాలనుకున్నాడు. "బాబులూ! మీరు పన్నెండుమంది ఉన్నారు. అందరికీ ఒకే గుర్రం ఎలా సరిపోతుంది?" అని అడిగాడు.



"గుర్రం మాకు కాదు, మా గురువుగారికి!" అన్నారు వాళ్ళు. "మీగురువుగారు గుర్రంమీద పోతుంటే మీరెలా వెళ్తారు?" అన్నాడు యజమాని. "నడిచి," అన్నాడు ఒక శిష్యుడు. "బాగుంది బాబులూ! పరుగెత్తే గుర్రాన్ని మీరెలా అందుకుంటారు?" శిష్యులంతా ఆ ప్రశ్నకి ఆలోచనలో పడ్డారు. కొంతసేపు ఆలోచించి మెరుపులాంటి ఆలోచనతో, "పరుగెడితే దాని కాళ్ళు విరగ్గొడతాం," అన్నాడు ఒక శిష్యుడు. అలా అయితే ఒక కుంటిగుర్రాన్ని తీసుకుపోతే అది ఎప్పటికీ పరుగెత్తదు. మీరు దానివెనక నడిచి వెళ్ళవచ్చు," అన్నాడు గుర్రాల యజమాని. శిష్యులు మళ్ళీ ఆలోచనలో పడ్డారు.

శిష్యులమధ్య వాదోపవాదాలు జరిగాయి. కుంటిగుర్రం అని కొందరు, నాలుగు కాళ్ళ గుర్రం అని కొందరు. గొడవ ఎంతకీ ఆగడంలేదు. మళ్ళీ గుర్రాల యజమాని కల్పించుకొని, "బాబులూ! గొడవపడకండి. నేను మీకు చక్కని పరిష్కారం చెబుతాను," అంటూ వాళ్ళ పోట్లాట ఆపాడు. ఈ సమస్యకు పరిష్కారం కావాలంటే, మీ గురువుగారితోపాటు మీకు తలకో గుర్రం ఉంటే సరిపోతుంది. కానీ అన్ని గుర్రాలు కొనాలంటే బోలెడంత ధనం కావాలి. ఇదుగో చూడండి. ఇవన్నీ 'గుర్రంపెట్టిన గుడ్లు' అంటూ గుమ్మడికాయలను చూపించాడు. ఈ గుడ్డు ఒక్కొక్కటి ఏభై వరహాలు. మీరు తెచ్చిన ఆరువందల వరహాలకు పన్నెండు గుడ్లు వస్తాయి. మీ గురువుగారి గుర్రానికి బదులు నేనొక గుడ్డు బహుమతిగా ఇస్తాను. కనుక మీకు కావలసిన పదమూడు గుర్రాలు సరిపోతాయి," అన్నాడు.


"ఈ గుడ్లు తీసుకొనిపోయి పచ్చని పొదలలో పన్నెండు మాసాలు దాచారంటే చాలు, మీకు కావలసిన గుర్రాలు వస్తాయి," అంటూ చెప్పాడు. పన్నెండుమందీ ఆలోచించారు. ఒక గుర్రాన్ని తీసుకొనిపోవడంకంటే పదమూడు గుర్రంగుడ్లు తీసుకుపోవడమే లాభసాటి బేరం అనుకున్నారు. ఆరువందల వరహాలు ఆ గుర్రం యజమానికి ఇచ్చేసి పదమూడు గుమ్మడికాయలను తీసుకువచ్చారు. (తరువాత ఏమైందో ఊహించి చెప్పండి).



# ఇవి చేయండి



## I వినండి - ఆలోచించి చెప్పండి



(అ) కథను సొంతమాటల్లో చెప్పండి.

(ఆ) కథలో మీకు నవ్వు తెప్పించిన సంఘటన ఏదో చెప్పండి.

(ఇ) మీరు ఏవైనా కొనడానికి వెళితే అమ్మేవాళ్ళను ఎలా అడుగుతారు? వాళ్ళతో ఏం మాట్లాడతారు?

(ఈ) మీకు తెలిసిన ఇతర హాస్యకథలను చెప్పండి.

## II చదవండి - అర్థం చేసుకొని చెప్పండి - రాయండి



(అ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. శిష్యులు గుర్రాన్ని ఎందుకు కొనాలనుకున్నారు? ఏం చేశారు?
2. గుర్రాల యజమాని, ఆ శిష్యులు వెర్రిబాగులవాళ్ళని ఎలా గ్రహించాడు?
3. శిష్యులు గుర్రం కొనడానికి ఎందుకు ఆలోచనలో పడ్డారు?
4. శిష్యులమధ్య గొడవెందుకు జరిగింది?

(ఆ) కింది కథ చదవండి. గీత గీసిన పదాల స్థానాలు తారుమారయ్యాయి. వాటిని సరిచేసి తిరిగి రాయండి.

"శ్రీకృష్ణదేవరాయలవారి అనుమానం బూడిదగుమ్మడికాయలు కాశాయి. వాటన్నిటినీ ఎవరో దొంగలిస్తున్నారు. ఈ సంగతి రాయలదాకా వెళ్ళింది. తోటలో ముగ్గురికి కాస్తున్న వీరయ్య, మల్లయ్య, లింగయ్యలమీద కాపలా వచ్చింది. వాళ్ళను రాయలవారి తోటలో తీసుకొని వెళ్ళారు భటులు. రాయలవారు ఈ సమస్యను వికటకవి తెనాలి రామకృష్ణుడికి అప్పచెప్పారు. రామకృష్ణుడు ఆ భయపడి ఒక్కొక్కరికి ఒక్కొక్క పుల్లనిచ్చి, ఇవి మంత్రించినవి అని చెప్పాడు. తెల్లవారేసరికి దొంగతనం చేసినవారి పుల్ల ఒక అంగుళం పెరుగుతుందని చెప్పాడు. మల్లయ్య తనకిచ్చిన పుల్ల ఎక్కడ పెరుగుతుందోనని ఆస్థానానికి ఒక అంగుళం తుంచాడు. మరుసటిరోజు మల్లయ్య పుల్ల విరిగి ఉండడం రామకృష్ణుడు గమనించాడు. దొంగ దొరికిపోయాడు.

(ఇ) ఇప్పటి వరకు చదివిన పాఠాలలోని ్త ్క ్ల ్న ్ట ్మ ఒత్తులతో అక్షరాలున్న పదాలను రాయండి.

| ్త | ్క | ్ల | ్న | ్ట | ్మ |
|---|---|---|---|---|---|
| | | | | | |

## III రాయండి




(అ) ఈ కథను మీ సొంతమాటల్లో రాయండి.

(ఆ) పరమానందయ్య శిష్యులు ఎలాంటివాళ్ళో మీ అభిప్రాయాలు రాయండి.

(ఇ) ఈ కథకు మరొక పేరు పెట్టండి. ఆ పేరు పెట్టడానికి గల కారణాలు రాయండి.

## IV పదజాలం



(అ) కింది పదాలను గమనించండి. ఇలాంటి పదాలను మరికొన్ని తయారుచేయండి.

| | | | |
|---|---|---|---|
| కనుక | వికటకవి | కలక | జలజ |
| పులుపు | నచ్చిన | ...................... | ...................... |
| ...................... | ...................... | ...................... | ...................... |
| ...................... | ...................... | ...................... | ...................... |

(ఆ) కింది వాక్యాలు చదవండి. గీత గీసిన పదాలకు వచనం మార్చి వాక్యాలు తిరిగి రాయండి.

ఉదా:- చెట్టుమీద కోకిల ఉంది.
చెట్టుమీద కోకిలలు ఉన్నాయి.

1. మా ఇంట్లో ఎర్రగులాబి పూసింది.

..........................................................................................................

2. జాతరలో బొమ్మల దుకాణం ఉంది.

..........................................................................................................

3. మేజాపైన పుస్తకం ఉంది.

..........................................................................................................

4. మా ఇంట్లో కోడి ఉంది.

..........................................................................................................

5. రామయ్యకు మామిడితోట ఉంది.

..........................................................................................................

©SCERT not to be republished

## V సృజనాత్మకత



**(అ) పాఠం కథను పొడిగించండి. పరమానందయ్యకు, శిష్యులకు జరిగిన సంభాషణను రాయండి.**

శిష్యులు : గురువుగారూ! గురువుగారూ! గుర్రం గుడ్లు తెచ్చామండీ!


పరమానందయ్య : గుర్రంగుడ్లు ఏమిట్రా?

శిష్యులు :

పరమానందయ్య :

శిష్యులు :

## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు



**(అ) నవ్వు తెప్పించే కథలు / సంఘటనలను సేకరించండి. గోడపత్రికలో ప్రదర్శించండి.**

## VII భాషను గురించి తెలుసుకుందాం



**(అ) పనిని గురించి తెలిపే పదాలను క్రియలు అంటారుకదా! కింది వాక్యాలు చదవండి. గీత గీసిన పదాలను గమనించండి.**

ఉదా : ప్రసాద్ బడికి పోతున్నాడు.
వాణి బడికి పోతున్నది.
చందన బొమ్మ వేసింది.
శ్రీరామ్ బొమ్మ వేశాడు.

**పై వాక్యాలలో క్రియాపదాలు స్త్రీ, పురుష వాచకాలనుబట్టి మారాయి.**

కింది వాక్యాలను సరైన క్రియాపదంతో పూరించండి.

1. రహీం ఆటలు ........................ 2. రజని పాట ........................
3. అమ్మ లడ్డూలు ........................ 4. నాన్న పళ్ళు ........................
5. తాత కథలు ........................




### నేనివి చేయగలనా ?














| | |
|---|---|
| 1. గుర్రంగుడ్డు కథను సొంతంగా చెప్పగలను. | ఔను / కాదు |
| 2. కథను ధారాళంగా చదవగలను. | ఔను / కాదు |
| 3. కథను సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. కథ ఆధారంగా ఊహించి సంభాషణలు రాయగలను. | ఔను / కాదు |

© SCERT not to be republished


# యూనిట్ 2   మాటంటే మాటే !   చదువు - ఆనందించు







ఒక నగరంలో ఒక వ్యాపారి ఉండేవాడు. సరుకులను  లపైన వేసుకెళ్ళి వ్యాపారం చేసేవాడు. ఒకరోజు వ్యాపారంకోసం బయలుదేరాడు. అందులో ఒక  కాలికి గాయమైంది. అది నడవలేకపోతున్నది.  ఇక ఈ  తనకు ఉపయోగపడదనుకున్నాడు. అడవిలోనే వదిలి వెళ్ళిపోయాడు.  అడవిలో  తింటూ జీవిస్తూ ఉంది.

ఆ అడవికి రాజు . దానికి , ,  సేవకులుగా ఉన్నాయి. ఒకరోజు ,  కంట పడింది.   ను చంపబోయింది.  కాపాడమని వేడుకుంది.  జాలితో అభయమిచ్చింది.  కు    లను పరిచయం చేసింది. అప్పటినుండి అవి స్నేహంగా ఉన్నాయి.

ఒకరోజు ,  మీద దాడిచేసింది. ,  ను అడ్డుకొంది.  కి  కు మధ్య పోట్లాట జరిగింది. ఆ యుద్ధంలో  కి కూడా చిన్న చిన్న దెబ్బలు తగిలాయి. కొన్ని రోజులు గడిచిన తరవాత  కి జ్వరం వచ్చింది. వేటకు వెళ్ళలేకపోయింది. , , ,  వేటకు వెళ్ళేవి. అవి పట్టుకొచ్చే ఆహారం తినేది .  కు బద్ధకం ఎక్కువ. వేటకు వెళ్ళడం కష్టమనిపించింది. 'ఏమి

© SCERT not to be republished

చెయ్యాలా?' అని ఆలోచించింది. తనకు వచ్చిన ఆలోచన  కి,  కి చెప్పింది.  అందుకు అంగీకరించదు అని  చెప్పింది.

, "నేను ఒప్పిస్తాను," అంది. ఒకరోజున పథకం ప్రకారం    వేటకు బయలుదేరాయి.  దగ్గర  ను ఉండమని చెప్పాయి. సాయంత్రానికి  దగ్గరకు వచ్చాయి. ఎంత వెదకినా జంతువులు దొరకలేదని చెప్పాయి. మరునాడు వేటకు వెళ్ళాయి. వట్టి చేతులతో వచ్చాయి.  ఆకలితో ఉంది. ,  చెవిలో ఏదో చెప్పింది. ,  పై కోప పడింది.  మన్నించమని వేడింది. ఈరోజున ఎలాగైనా ఆహారం సంపాదిస్తామని , ,  బయలుదేరాయి. ఎంత వేటాడినా జంతువులు దొరకలేదని వచ్చాయి.  కి ఆకలి ఎక్కువైంది. "బాగా ఆకలిగా ఉంది", అంది . "రాజా! నన్ను తినండి", అంది . దాని మాంసం సరిపోదు. "నన్ను తినండి," అని  ముందుకు వచ్చింది.  కూడా చిన్న జంతువే. "నన్ను తిని మీ ఆకలి తీర్చుకోండి," అంది .  ఆలోచించింది. "నేను వాటిలా అనకపోతే బాగుండదు," అని ఆలోచించి, "రాజా! నన్ను తినండి; మీ ఆకలి తీర్చుకోండి," అంది. వెంటనే ,  ను చంపబోయింది. , "ఆగండి! నేను  కు మాట ఇచ్చాను. మాట నిలబెట్టుకోవడం ధర్మం. మిత్రులుగా నటిస్తూ, నమ్మకద్రోహం తగదు. మీ ఆలోచన మంచిది కాదు," అని వాటిని మందలించింది.

© SCERT not to be republished

యూనిట్ 2

# 6. లేఖ

**చిత్రం చూడండి - ఆలోచించండి - మాట్లాడండి**



★ చిత్రం చూడండి? చిత్రంలోని వ్యక్తి ఏమి చేస్తున్నాడు? ఆయన ఎవరు? ఏం చేస్తాడు?

★ మీ గ్రామంలో కూడా పోస్టుడబ్బా ఉన్నదా? ఉత్తరాలు తీసుకొనివెళ్లే వ్యక్తి ఉన్నాడా?

★ మీరెప్పుడైనా ఎవరికైనా లేఖలు రాశారా? ఎవరికి? ఎందుకోసం రాశారు?

**పిల్లలకు సూచనలు :**

★ పాఠంలోని చిత్రాలను చూడండి. చిత్రాలను గురించి మాట్లాడండి.

★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.

★ గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడిగి లేదా పదాలు - అర్థాలు అన్న పట్టికలో చూసి తెలుసుకోండి.

పోచెంపల్లి,
తేది : 01-02-2012



ప్రియమైన మౌనికకు,

ఎలా ఉన్నావు? నేను క్షేమం. మా పిన్నికూతురు పెళ్ళికి కొండపల్లికి వచ్చినప్పుడు నీతో పరిచయం కావడం నాకు సంతోషాన్ని కలిగించింది.

మనం కలిసినప్పుడు నువ్వు, మా ఊరు పోచెంపల్లిని గురించి అడిగావు కదా!

ప్రపంచంలోనే చేనేతపనికి ప్రసిద్ధిచెందిన మా ఊరు నల్లగొండ జిల్లాలో ఉంది. హైదరాబాదునుంచి 35 కిలోమీటర్ల దూరం. వ్యవసాయం చేయడంతో పాటు మగ్గాలమీద పట్టుచీరలు నేయడం మా ఊరి ప్రత్యేకత. ఇక్కడ తయారైన పట్టుచీరలు **"పోచెంపల్లి పట్టుచీరలు"**గా ప్రపంచ ప్రసిద్ధి పొందాయి.

ఈ పట్టుచీరలు ఎలా నేస్తారో నీకు తెలుసుకోవాలని ఉంది కదూ! ముడిసరుకుగా వచ్చిన పట్టుదారాన్ని నీటిలో ఉడకబెడతారు. దీనివల్ల అందులోని మాలిన్యాలు తొలగిపోతాయి. ఈ దారాల డిజైన్లను అనుసరించి రబ్బర్లుచుట్టి రకరకాల రంగులు అద్దుతారు. దారాన్ని రాట్నంమీద కండెలుగా చుడతారు. మగ్గానికి అమర్చి చీరలు నేస్తారు. ఇక్కడ పట్టుచీరలేకాక నూలువస్త్రాలు, దుప్పట్లు, చేతిరుమాళ్లు, రకరకాల సంచులు తయారుచేస్తారు. ఈమధ్యే పోచెంపల్లి పట్టుచీరకు పేటెంట్‌హక్కు రావడం విశేషం.

చేనేతపనివారి ప్రదర్శన, వినోబాభావే ఆశ్రమం, నాటి నిర్మాణాలు ఇక్కడ మనం చూడదగినవి. ఔను! వినోబాభావే అనగానే నీకేమైనా గుర్తుకు వచ్చిందా? భూమిలేని పేదవాళ్ళకు భూమిని ఇవ్వాలనే లక్ష్యంతో వినోబా భావే **"భూదానోద్యమం"** ప్రారంభించారు. దీనికి స్పందించి మొట్టమొదట వంద ఎకరాల భూమిని దానం చేసిన పెద్దలు, శ్రీ వెదిరె రామచంద్రారెడ్డి కుటుంబంవారు మా ఊరివారే! వినోబా భావే పేరుమీద ఇప్పటికీ ఇక్కడ ఆశ్రమం ఉంది. అలాగే మా ఊరి సమీపంలోనే **"శ్రీరామానంద తీర్థ గ్రామీణసంస్థ"** ఉంది.

చాలా విషయాలు చెప్పాను కదా! నువ్వు మా ఊరికి వస్తే ఇంకెన్నో చూపిస్తాను.

నాకూ నా స్నేహితులకూ కొండపల్లి బొమ్మలను గురించి ఇంకా తెలుసుకోవాలని ఉంది. ఆ విషయాలన్నీ తెలుపుతూ నువ్వు కూడా లేఖ రాయాలి మరి. రాస్తావు కదూ! నీ ఉత్తరంకోసం ఎదురుచూస్తూ ఉంటాను.

నీ స్నేహితురాలు,
పి. చందన.

చిరునామా
బి. మౌనిక,
తండ్రి - శ్రీ బి. నరసింగరావుగారు,
ఇ.నెం. 7-3-2, కొండపల్లి గ్రామం,
కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్.

©SCERT not to be republished



కొండపల్లి,

తేది : 08-02-2012

ప్రియమైన చందనకు,

నేను క్షేమం. మీరంతా క్షేమమని భావిస్తున్నాను. నువ్వు రాసిన ఉత్తరం అందింది. నీ ఉత్తరం చదివి చాలా ఆనందించాను. చేనేత కార్మికుల శ్రమ, పనిలో నేర్పు అద్భుతమైనవని మా నాన్నగారు కూడా అన్నారు. సెలవుల్లో మీ ఊరికి తప్పక వెళదామన్నారు.

ఇక, మా ఊరు **"కొండపల్లి"** గురించి అడిగావు కదా! కొన్ని విషయాలు రాస్తున్నాను. మా ఊరు కొండపల్లి దుర్గంగా చరిత్రలో పేరుపొందింది. కొండపల్లి కొయ్యబొమ్మలు ప్రపంచ ప్రసిద్ధిపొందాయి. కొండపల్లి విజయవాడకు సమీపంలో ఉంది. స్థానికంగా దొరికే **'పొనికి'** కలపతో ఈ కొండపల్లి బొమ్మలను తయారుచేస్తారు. ఈ కర్ర తేలికగా, తెల్లగా ఉండి బొమ్మల్ని చెక్కడానికి, రంగులు అద్దడానికి అనువుగా ఉంటుంది. పొనికి కలపను **'పాలచెట్టు కలప'** అనికూడా అంటారు. కర్రను చెక్కి అనేక రూపాలుగా మారుస్తూ రంగులువేయడం ఒక అద్భుతమైన కళ. ఈ బొమ్మల్లో అంబారీ ఏనుగు, దశావతారాలు, రాజు, రాణి, పల్లకి బొమ్మలు, తలలూపే బొమ్మలు చాలా పేరుపొందాయి. ఇక్కడికి దగ్గర్లోనే ఇంద్రకీలాద్రి కొండల సమూహం ఉంది. కొండపల్లిని ఆనుకొని ఉన్న కొండమీద ఒక దుర్గం ఉంది. అలాగే అక్కచెరువు, అమ్మచెరువు అనే పేర్లతో రెండు నీటిగుండాలున్నాయి. ఊరిపక్కన కొండ ఉండడంవల్లే మా ఊరికి కొండపల్లి అనే పేరు వచ్చిందంటారు.

ఇవీ మా ఊరికి సంబంధించిన విశేషాలు. కొండపల్లి బొమ్మలకు, దుర్గానికి సంబంధించిన చరిత్రను, ఫొటోలను త్వరలోనే నీకు మెయిల్‌లో పంపుతాను. మీ అమ్మానాన్నలకు నా నమస్కారాలు తెలియజెయ్యి.

నీ ప్రియనేస్తం,

బి. మౌనిక.

చిరునామా

పి. చందన,

తండ్రి - శ్రీ పి. జగ్గయ్య

ఇ.నెం. 1-2-17, మార్కండేయ గుడివీధి,

పోచెంపల్లి గ్రామం,

నల్లగొండ జిల్లా - 508 284

ఆంధ్రప్రదేశ్.







ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



# ఇవి చేయండి



## I వినండి - ఆలోచించి చెప్పండి



(అ) లేఖలు రాయడంవల్ల కలిగే ప్రయోజనం ఏమిటి? మీరు లేఖలు రాస్తే ఎవరికి రాస్తారు? ఏమని రాస్తారు?

(ఆ) ఇతరులకు సమాచారం పంపడానికి లేఖలకు బదులు ఇంకా వేటిని ఉపయోగిస్తున్నారో చెప్పండి.

## II చదవండి - అర్థం చేసుకుని చెప్పండి - రాయండి



(అ) పోచంపల్లిలో పట్టుచీరలు ఎలా నేస్తారో చెప్పిన పేరా ఎక్కడ ఉంది? ఆ వాక్యం కింద గీత గీయండి.

(ఆ) ఇప్పటివరకు చదివిన పాఠాలలోని ్ట, ్డ, ్త, ్ద, ్ప, ్వ, ్బ ఒత్తులున్న పదాలను గుర్తించి రాయండి.

| ్ట | ్డ | ్త | ్ద | ్ప | ్వ | ్బ |
|---|---|---|---|---|---|---|
| | | | | | | |

(ఇ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. మౌనిక, చందనలు ఎవరు? వాళ్ళు ఎక్కడ ఉంటారు? వాళ్ళ చిరునామాలు ఏమిటి?
2. భూదానోద్యమాన్ని గురించి మీరేం అర్థం చేసుకున్నారు?
3. పట్టుచీరలు ఎలా నేస్తారో మీ మాటల్లో రాయండి.
4. కొండపల్లి బొమ్మలు ఎలా తయారవుతాయి?

© SCERT not to be republished

## III రాయండి




(అ) మీ పుట్టినరోజుకు ఆహ్వానిస్తూ మీ మిత్రుడికి ఒక లేఖ రాయండి.

(ఆ) కొండపల్లి బొమ్మలను గురించి మీ సొంతమాటల్లో రాయండి.

(ఇ) పోచంపల్లి ప్రత్యేకతలను మీ సొంతమాటల్లో రాయండి.

## IV పదజాలం



(అ) కింది వాక్యాలు చదవండి. గీత గీసిన పదాల అర్థాలను, "పదాలు - అర్థాలు" పట్టికలో చూడండి. వాటిని ఉపయోగించి వాక్యాలు రాయండి.

ఉదా: నా మిత్రురాలు పద్మకు ఈరోజే నేనొక లేఖ రాశాను.

నా మిత్రురాలు పద్మజకు ఈరోజే నేనొక జాబు రాశాను.

1. పోచంపల్లి విశిష్టత నలుమూలలకూ పాకింది.

........................................................................................................

2. కొండపల్లి దుర్గం చూపరులను ఆకట్టుకుంటుంది.

........................................................................................................

3. కొండపల్లి బొమ్మలు చాలా ప్రసిద్ధి చెందాయి.

........................................................................................................

(ఆ) కింది పదాలను ఒకే వాక్యంలో ఉపయోగిస్తూ సొంతవాక్యాలు రాయండి.

1. పెళ్లి - పట్టుచీర

........................................................................................................

2. అక్క - బహుమతి

........................................................................................................

3. ఆదివారం - బస్సు

........................................................................................................

4. ఉత్తరం - సెలవులు

........................................................................................................

© SCERT not to be republished



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

## V సృజనాత్మకత



(అ) పాఠం ఆధారంగా పోచంపల్లి పట్టుచీరను గురించి వ్యాసం రాయండి.

(ఆ) మీ ఊరి గొప్పతనాన్ని వివరిస్తూ మిత్రునికి లేఖ రాయండి.

## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు



(అ) మీకు తెలిసిన బొమ్మలపేర్లు రాయండి. అవి వేటితో తయారుచేస్తారో పట్టికలో రాయండి.

| బొమ్మల పేర్లు | దేనితో తయారుచేస్తారు |
|---|---|
| | |

(ఆ) ఉత్తరం రాసేటప్పుడు ప్రారంభంలో, ముగింపులో ఎవరెవరిని ఏమని సంబోధిస్తామో కింది పట్టికలో చూడండి.

| తెలుగు | మిత్రులకు | పెద్దలకు | ఉపాధ్యాయులకు |
|---|---|---|---|
| ప్రారంభంలో | ప్రియమయిన | మాన్యులయిన | పూజనీయులయిన |
| ముగింపులో | నీ ప్రియమయిన | మీ విశ్వసనీయుడు (విశ్వసనీయురాలు) | మీ ప్రియశిష్యుడు (శిష్యురాలు) |

పై విధంగానే హిందీ, ఆంగ్ల భాషలలో కూడా తయారు చేయండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం



(అ) కింది వాక్యాలు చదవండి. గీత గీసిన పదాలు గమనించండి.

1. జయ, దీపిక కూరగాయలు కొన్నారు.
2. అరుంధతి అన్నం తింటున్నది.
3. రాధ పుస్తకం చదువుతున్నది.
4. రహీం, కరీం రేపు విజయవాడ వెళ్తారు.
5. పిల్లలందరూ మధ్యాహ్నభోజనం తిన్నారు.

పై వాక్యాలతో గీత గీసిన పదాలు ఏమి తెలుపుతున్నాయో తెలుసా!

★ కొన్నారు, తిన్నారు, ఆడారు, పాడారు.... ఈ క్రియాపదాలు, గడిచిన కాలంలో జరిగిన పనిని తెలుపుతున్నాయి. జరిగిపోయిన కాలాన్నే **'భూతకాలం'** అంటారు. కాబట్టి ఇవి భూతకాలిక క్రియలు.

★ తింటున్నది, చదువుతున్నది.... ఈ క్రియాపదాలు ఇప్పుడు నడుస్తున్న కాలంలో జరుగుతున్న పనిని తెలుపుతున్నాయి. ఇప్పుడు నడుస్తున్న కాలం **వర్తమానకాలం**. కాబట్టి ఇవి వర్తమానకాలిక క్రియలు.

© SCERT not to be republished

★ ఇలా వస్తాడు, చూస్తాడు, వెళ్తాడు.... అనే క్రియాపదాలు రాబోయే కాలంలో జరిగే పనిని తెలుపుతున్నాయి. రాబోయే కాలాన్ని **భవిష్యత్‌కాలం** అంటారు. కాబట్టి ఇవి భవిష్యత్‌కాలిక క్రియలు.

**(ఆ) కింది పట్టికలోని వాక్యాలు చదవండి. అవి ఏ కాలానికి సంబంధించినవో రాయండి.**

| సం | వాక్యం | కాలం |
|---|---|---|
| 1. | జాన్ రేపు హైదరాబాద్ వెళ్తాడు. | |
| 2. | సలీమా నిన్న సినిమా చూసింది. | |
| 3. | పవన్ పాఠం చదువుతున్నాడు. | |
| 4. | మేరీ పాట పాడింది. | |
| 5. | అతను బడికి పోతున్నాడు. | |

**(ఇ) కింది క్రియాపదాలను చదవండి. వాటిని ఉపయోగించి వివిధ కాలాలకు అనుగుణంగా వాక్యాలు రాయండి.**

**చూచు (చూసు), వెళ్లు, పాడు, చదువు, రాయు**

| భూతకాలం | వర్తమానకాలం | భవిష్యత్‌కాలం |
|---|---|---|
| | | |
| | | |
| | | |

**(ఈ) కింది పేరా చదవండి. '. , ! ?' గుర్తులను సరైన చోట ఉంచండి.**

చాలా విషయాలు చెప్పాను కదా నువ్వు మా ఊరికి వస్తే ఇంకెన్నో చూపిస్తాను మా పోచంపల్లి డ్రెస్ నీకు బహుమతిగా ఇస్తాను పోచంపల్లి చీరల తయారీకి సంబంధించిన ఫోటోలను చీరల డిజైన్లను నీ ఈ-మెయిల్ ఐడీకి ఈరోజే పంపాను చూసుకో వెంటనే ఉత్తరం రాస్తావు కదా



**నేనివి చేయగలనా ?**



| | | |
|---|---|---|
| 1. | పాఠం సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | పాఠాన్ని ధారాళంగా చదవగలను. | ఔను / కాదు |
| 3. | పుట్టిన రోజుకు ఆహ్వానిస్తూ మిత్రునికి లేఖ రాయగలను. | ఔను / కాదు |
| 4. | పోచంపల్లి పట్టణం గురించి వ్యాసం రాయగలను. | ఔను / కాదు |

© SCERT not to be republished

యూనిట్ 2


# తెలివైన పావురాలు

చదువు - ఆనందించు


చిత్రాలను చూడండి - కథను ఊహించండి. చెప్పండి. రాయండి.




1



2




3



4



5



6

యూనిట్ 2

# 7. చీమల బారు

చిత్రం చూడండి - ఆలోచించండి - మాట్లాడండి



© SCERT not to be republished

★ చిత్రంలో ఎవరెవరున్నారు? ఏం చేస్తున్నారు?

★ పిల్లలందరూ వరుసలో ఎందుకు వెళుతున్నారు?

★ ఎవరైనా బస్సు ఇలాగే ఎక్కుతారా?

★ ఇలా ఇంకా ఎక్కడెక్కడ వరుసగా వెళతారు?


**పిల్లలకు సూచనలు :**

★ పాఠంలోని చిత్రాలను చూడండి. చిత్రాలను గురించి మాట్లాడండి.

★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.

★ గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడిగి లేదా పదాలు - అర్థాలు అన్న పట్టికలో చూసి తెలుసుకోండి.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



ఓహో! మీరెక్కడికి
ఓ చిన్న చీమల్లారా?
ఏ సీమకు మీరేగెదరు
ఈ తీరున బారుకట్టి!
ఎక్కడికి, ఎక్కడికి?
ఈ సమూహ మెక్కడికి?
కయ్యానికా, వియ్యానికా?
అయ్యారే, మీరేగుట?
ఒకరి వెనుక ఒకరు
మిగుల ఓరిమితో పోయెదరు
ఎవరోయి మిము నడిపెడి

ఇంగితజ్ఞు లింత ఘనులు?
ఎవరో ఒక నేత లేక
ఇంత కట్టుదిట్టముగా
మనుషులమే నడువలేము
మరి మీ పోకడ చిత్రము
పనిపాటలు లేక మీరు
పాలుమాలి తిరగరహో!
ఎక్కడకు ఈ ధాన్యము
ఎవరిళ్ళకు ఈ ఎగుమతి?
మడి మాన్యము లేదు మీకు
మరి ధాన్యము సమకూర్తురు

© SCERT not to be republished



© SCERT not to be republished

కళ్ళము కొక గింజయైన
కావే కొల్లలు కొల్లలు
ఏయే పొలములు తిరిగి
ఈ ధాన్యము గూర్చితిరి?
ఎవడు చూపె కడు దుర్గమ-
మైన బ్రతుకు చాల మీకు?
ఈ వివేక మీ పొదుపును
ఎచట నేర్చితిరో గానీ!
ఈ శిక్షణ మనిషికున్న
ఇక లేములు ఎక్కడివి!

ఎవరివద్ద చదువకయే
ఈ విద్దెలు నేర్చితిరి.
కోటివిద్యలైన తుదకు
కూటికె కద మాకైనను.
ఏమేమో నేర్వదలచి
ఎటకెటకో పోయెదము
కండ్లముందు ఎపుడు తిరుగు
ఘనుల కానలేము కదా!

- **పొట్లపల్లి రామారావు**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



## ఇవి చేయండి



### I వినండి - ఆలోచించి చెప్పండి



**(అ) గేయాన్ని లయబద్ధంగా పాడండి. అభినయం చేయండి.**

**(ఆ) చీమలు ఏమేమి ఆహారంగా తీసుకుంటాయి?**

**(ఇ) చీమలబారును చూసి మీరేం గ్రహించారు? ఎందుకు అలా వెళతాయి?**

**(ఈ) చీమలబారు గేయంలో మీకిష్టమైన వాక్యాలు ఏవి? అవి ఎందుకు ఇష్టమైనవో చెప్పండి.**

### II చదవండి - అర్థంచేసుకొని చెప్పండి - రాయండి



**(అ) కింది పదాలు చదవండి. గేయంలో ఎక్కడున్నాయో గుర్తించండి. వాటికి 'O' చుట్టండి.**

బారుకట్టి, చీమల్లార, కయ్యానికా, ఎవరోయి, పనిపాటలు, ధాన్యము, విద్దెలు, ఘనులు.

**(ఆ) కింది వాక్యాలు చదవండి. భావం చెప్పండి.**

"ఈ వివేక మీ పొదుపును
ఎచట నేర్చితిరోగానీ
ఈ శిక్షణ మనిషికున్న
ఇక లేములు ఎక్కడివి?"

**(ఇ) పాఠం చదవండి. కింది వాక్యాలలో తారుమారైన పదాలను సరిచేసి చెప్పండి.**

లేక పాటలు మీరు పని
తిరగరహో పాలుమాలి
ఈ ఎక్కడకు ధాన్యము
ఎగుమతి ఎవరిళ్ళకు ఈ

**(ఈ) గేయం ఆధారంగా కింది వాక్యాలలో ఒప్పు (✓), తప్పు (✗) లు గుర్తించండి.**

1. చీమలు చాలా సోమరులు. ( )
2. చీమలకు క్రమశిక్షణ ఎక్కువ. ( )
3. పొదుపు చేయడం చీమలనుంచి నేర్చుకోవాలి. ( )
4. చీమలకు ముందుచూపు ఉండదు. ( )
5. చీమల నేత చీమలన్నిటినీ నడిపిస్తాడు. ( )

© SCERT not to be republished

(ఉ) ఒక హల్లుకు వేరొక హల్లు ఒత్తు చేరితే సంయుక్తాక్షరం అవుతుంది కదా! ఇలాంటి సంయుక్తాక్షర పదాలను ఈ పాఠంలోను, వెనకటి పాఠాలలోను కూడా వెతికి రాయండి.

ఉదా :

| | | |
|---|---|---|
| విద్య | క్రమశిక్షణ | ఆశ్చర్యం |
| | | |

## III రాయండి




(అ) చీమల గొప్పతనాన్ని కవి గేయంలో ఏమని చెప్పాడు?

(ఆ) మనచుట్టూ ఉన్న జంతువులనుంచి మనం చాలా నేర్చుకోవచ్చు. దేనినుంచి ఏమి నేర్చుకోవచ్చో ఆలోచించి రాయండి.

(ఇ) కోటివిద్యలు కూటికొరకే అంటే అర్థమేమిటి?

(ఈ) గేయభావాన్ని సొంతమాటల్లో రాయండి.

## IV పదజాలం



(అ) కింది పదాలు చదవండి. ఒక వరసలో సంబంధంలేని పదానికి 'O' చుట్టండి.

ఉదా : పులి, ఏనుగు, (చీమ), సింహం

1. కాకి, ఎలుక, పావురం, నెమలి
2. మేఘాలు, భూమి, ఆకాశం, సూర్యుడు
3. ఎరుపు, నలుపు, తెలుపు, పులుపు
4. ఈగలు, దోమలు, తేనెటీగలు, చీమలు
5. బావి, పొలం, చెరువు, నది

(ఆ) కింది పదాలను చదవండి. సరైన అర్థాలతో జతపరచండి.

| | |
|---|---|
| కయ్యం | గుంపు |
| కలిమి | మంచి, చెడు తెలిసినవాడు |
| సహనం | పోట్లాట |
| ఘనులు | వరస |
| బారులు | సోమరితనం |
| సమూహం | సంపద |
| ఇంగితజ్ఞానం | ఓర్పు |
| పాలుమాలి | గొప్పవారు |

© SCERT not to be republished

## V సృజనాత్మకత




**(అ) చీమ ఆత్మకథ రాయండి.**

నేను చీమను. నేను చాలా చిన్నగా ఉంటాను కానీ .......................................

**(ఆ) చీమ గొప్పతనాన్ని తెలుపుతూ కవిత/గేయం/అభినందన లేఖ రాయండి.**

## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు



**(అ) చీమలకు సంబంధించిన వివిధ కథలను, సమాచారాన్ని సేకరించి, గోడపత్రికలో పెట్టండి.**

**(ఆ) చీమలను గురించి గేయం చదివారు కదా! ఇదే గేయాన్ని మీ మాతృభాషలో రాయండి.**

## VII భాషను గురించి తెలుసుకుందాం



**(అ) కింది వాక్యాలు ఏ కాలంలో ఉన్నాయో తెలపండి :**

| సం | వాక్యం | కాలం |
|---|---|---|
| 1. | కరీం రేపు కడపకు వెళ్తున్నాడు. | |
| 2. | షరీఫ్ నిన్న సినిమా చూశాడు. | |
| 3. | హారిక పాట పాడుతున్నది. | |
| 4. | కనకమ్మ ఈరోజు వస్తున్నది. | |
| 5. | రుత్విక్ చదరంగం ఆడుతున్నాడు. | |

**(ఆ) కింది పదాలలో సరైన పదంతో ఖాళీలు పూరించండి.**

(నిన్న, నేడు, రేపు, వెళ్తున్నాడు, తెచ్చింది)

1. రాజు ............................ సర్కస్ చూశాడు.
2. రవి రేపు ఢిల్లీ .............................
3. లలిత కూరగాయలు ...................................
4. కుమార్ ................................ హైదరాబాద్‌నుంచి రావచ్చు.
5. నేను ............................ బడికి వెళ్లాను.





### నేనివి చేయగలనా ?


| | |
|---|---|
| 1. గేయాన్ని లయబద్ధంగా పాడగలను. | ఔను / కాదు |
| 2. గేయ సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 3. గేయ భావాన్ని సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. చీమ ఆత్మకథ రాయగలను. | ఔను / కాదు |

© SCERT not to be republished

యూనిట్ 2

# 8. ఉపకారం

## చిత్రం చూడండి - ఆలోచించండి - మాట్లాడండి



★ చిత్రం చూడండి. ఏమేమి కనిపిస్తున్నాయి? వాళ్ళు ఏమి చేస్తున్నారు?
★ మీరు ఎప్పుడైనా ఇలాంటి ప్రదేశం చూశారా? మీరు అక్కడికి వెళితే ఏం చేస్తారు?
★ సముద్రం మీద ఎలా వెళతారు? ఎందుకు వెళతారు?

© SCERT not to be republished

**పిల్లలకు సూచనలు :**

★ పాఠంలోని చిత్రాలను చూడండి. చిత్రాలను గురించి మాట్లాడండి.
★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.
★ గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడిగి లేదా పదాలు - అర్థాలు అన్న పట్టికలో చూసి తెలుసుకోండి.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



పల్లయ్య ఒక జాలరి. అతడు చేపలు పట్టి, అమ్మి, వచ్చిన డబ్బుతో సుఖంగా జీవించేవాడు. ఒకనాడు సాయంత్రంవరకు వేటాడినా వలలో చేపలు పడలేదు. నిరుత్సాహంగా పడవను ఇంటివైపు మళ్ళించాడు. తన దురదృష్టానికి చింతిస్తూ కడలి కెరటాలను చూస్తూ ఉన్నాడు. ఇంతలో ఎప్పుడూలేని కాంతులు నీటిలో కనిపించాయి. సన్నని శబ్దాలు వినిపించాయి. పల్లయ్య అటు చూశాడు. ఆ వైపు ఒక పెద్ద చేప బంగారు రంగులో ఉన్న ఒక చిన్న చేపను వెంటాడుతూ ఉంది. జాలరి అది గమనించాడు. "ఆహా! ఏమి నా అదృష్టం" అనుకుంటూ అతను వలవేశాడు. బంగారుచేప అందులో చిక్కింది. వలలాగి చేపను బయటకు తీశాడు.

చుట్టూ అద్భుతమయిన కాంతితో నిండిపోయింది. పల్లయ్య ఆశ్చర్యంగా చూశాడు. "నన్ను కాపాడు, నన్ను కాపాడు" అన్న మాటలు కూడా వినిపించాయి. అవి చేప పలుకుతున్న మాటలే! మనిషి పలికే మాటలే. పల్లయ్య ఇంకా ఆశ్చర్యపడ్డాడు. "ఎవరు నువ్వు?" అని ప్రశ్నించాడు. "అన్నా, నన్ను కాపాడు. ఈ గండం తప్పించు," అని దీనంగా ప్రార్థించింది. పల్లయ్య మనసు కరిగింది. "నువ్వెవరివి? నీ కథేమిటి?" అని అడిగాడు పల్లయ్య.

"మాది ఈ కడలిలో పైడిమీనుల దీవి. నాపేరు 'ముద్దుమీను'. మీ లోకాలలో దేవతలూ రాక్షసులూ మనుషులూ ఉన్నట్లే ఈ సముద్రంలో రాకాసి చేపలు, దేవతాంశ చేపలు ఉన్నాయి. మీరు వేటాడుతున్నవి రాకాసి చేపలు. మా దీవిలో ఉండేవి దేవతాంశ చేపలు. మేము మామూలుగా బయటికి రాము. ఒక్క కార్తిక పూర్ణిమ నాడే బయటికి వచ్చి చంద్రదర్శనం చేసుకుంటాం. నేను తోవ తప్పిపోయాను. రాకాసిచేప కంటపడ్డాను. ఇప్పుడు నువ్వే నాకు దిక్కు. నన్ను మా లోకంలో దిగబెట్టు!" అన్నది. తనను తన తల్లిదండ్రుల దగ్గరికి చేర్చమని ప్రాధేయపడింది. సరే పొమ్మని పల్లయ్య దాన్ని తీసి సముద్రంలో విడవబోయాడు. అంతలో చేప, "ఆగు! ఆగు! మా దీవికి నేను ఒక్కదాన్నే వెళ్ళలేను. మళ్ళీ ఆ రాకాసి చేపలు నావెంట పడతాయి. అందుచేత నీ పడవలో నన్ను మా దీవికి చేర్చు!" అని వేడుకొంది ముద్దుమీను.

© SCERT not to be republished

పల్లయ్య పడవ కడలికెరటాలమీద ఉయ్యాలలూగుతూ పోతూండగా ఒక మొసలి అడ్డగించింది. పల్లయ్య తన ఈటె తీసి మొసలి కంటిలో గుచ్చాడు. తన తెడ్డుతో బలంగా దెబ్బలు కొట్టాడు. ఆ దెబ్బల ధాటికి తాళలేక ఆ మొసలి ప్రాణాలు విడిచింది. మరుక్షణంలో బంగారురంగు మానవాకారం ఒకటి పల్లయ్య ఎదురుగా నిలిచి, నమస్కరించింది. 'అన్నా, నీవల్ల నాకిప్పుడు నిజరూపం వచ్చింది, ధన్యవాదాలు. నీ మేలు మరచిపోలేను," అన్నాడు అతను. "నువ్వెవరివి? నువ్విక్కడికి ఎలా వచ్చావు?" అని అడిగాడు పల్లయ్య.

"నా పేరు వైడూర్యరాజు - మాది రత్నాలదీవి. నేను ఎక్కువగా అబద్ధాలు ఆడేవాణ్ణి. ఒకనాడు నేనాడిన అబద్ధాలకు, పుష్యరాగమునికి కోపం వచ్చింది. మొసలివికమ్మని నాకు శాపం ఇచ్చాడు. నేను నా తప్పు తెలుసుకున్నాను. నన్ను క్షమించమని ప్రాధేయపడ్డాను. ఆయన మన్నించి, నాకు శాపవిముక్తి కలుగుతుందని చెప్పాడు. నీవల్ల నాకు శాపవిముక్తి కలిగింది. నువ్వు మా లోకానికి వచ్చి మా ఆతిథ్యాన్ని స్వీకరించు," అని ఆహ్వానించాడు.

పల్లయ్య సంతోషపడ్డాడు. తన పడవలోనే రత్నాలదీవికి వెళ్ళాడు. అక్కడ గొప్ప ఓషధులు ఉన్నాయి. ఆ దీవి నీలపు కాంతులతోను, కెంపుకాంతులతోను మిలమిలా మెరుస్తూ ఉంది. పల్లయ్యకు వజ్రాలు, వైడూర్యాలు, నీలాలు, కెంపులు, మరకతమాణిక్యాలు, గోమేదికం, ముత్యాలు బహుమతిగా ఇచ్చాడు వైడూర్యరాజు.

ఆ తరవాత ముద్దుమీనును తీసుకొని పైడిమీనుల దీవికి వెళ్ళాడు. అక్కడ ముద్దుమీను, పల్లయ్య తన ప్రాణాన్ని కాపాడాడని తల్లిదండ్రులకు చెప్పింది. తమ బిడ్డ క్షేమంగా తిరిగివచ్చినందుకు అక్కడివాళ్ళందరూ ఆనందించారు. పల్లయ్యకు ఇదంతా ఆశ్చర్యం కలిగించింది. దివ్యమయిన ఔషధాలతో, వింతవింత కాంతులనీనే ఈ లోకం చాలా బాగుందనుకున్నాడు. పైడిమీనుల రాజు పల్లయ్యకు బంగారు శంఖాలు, గవ్వలు వంటివి విలువైనవెన్నో ఇచ్చాడు. ఆనందంతో పల్లయ్య తిరుగు ప్రయాణమయాడు.

పల్లయ్య తిరిగి రాగానే ఇంటిల్లిపాదీ అతనిచుట్టూ చేరారు. అతను తెచ్చిన రత్నరాశులను చూసి ఆశ్చర్యపోయారు. ఆనందంగా అందరికీ చెప్పుకున్నారు. పల్లయ్యకు పొరుగున ఉండే ఎల్లయ్య అతన్ని చూసి అసూయపడ్డాడు. పల్లయ్య లాగే తానూ రత్నాలు సంపాదించాలనుకున్నాడు. సముద్రతీరానికి వెళ్ళాడు. వల విసిరాడు .... తరవాత ఏం జరిగి ఉంటుందో ఆ కథ మీరు చెప్పండి.






## ఇవి చేయండి



### I వినండి - ఆలోచించి చెప్పండి



(అ) జాలరి పల్లయ్య కథను సొంతమాటల్లో చెప్పండి.

(ఆ) మీరెప్పుడైనా సముద్రాన్ని చూశారా? సముద్రంలో ఏయే జీవరాశులుంటాయి?

(ఇ) నువ్వే పల్లయ్య స్థానంలో ఉంటే ముద్దుమీనుకు ఏ విధంగా సాయం చేస్తావు?

(ఈ) దురాశాపరుడైన ఎల్లయ్యకు ఏం జరిగి ఉంటుందో చెప్పండి.

### II చదవండి - అర్థం చేసుకొని చెప్పండి - రాయండి



(అ) పాఠంలోని మొదటి చిత్రం చూడండి. దీనికి సంబంధించిన వాక్యాలు పాఠంలో వెతకండి. వాటికింద గీత గీయండి.

(ఆ) పాఠంలో 6, 7 పేరాలు చదవండి. ఆ పేరాలలో వేటిని గురించి ఉందో చెప్పండి. ఆ పేరాలకు పేరు పెట్టండి.

(ఈ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. చేపను చూసి పల్లయ్య ఎందుకు ఆశ్చర్యపోయాడు?
2. ముద్దుమీను జాలరి పల్లయ్యను ఎందుకు ప్రాధేయపడింది?
3. పల్లయ్య రత్నాలదీవిలో ఏమేమి చూశాడు?
4. జాలరి పల్లయ్యకు వైడూర్యరాజు ఏమేమి బహుమతులిచ్చారు?

### III రాయండి



(అ) పల్లయ్య ముద్దుమీనును, పైడిమీనుల దీవికి తీసుకువెళ్ళేటప్పుడు దారిలో ఏమి జరిగింది?

(ఆ) మీకు కథలో ఎవరు నచ్చారు? ఎందుకు నచ్చారో రాయండి.


(ఇ) జాలరి పల్లయ్య, ముద్దుమీనుకు సహాయం చేశాడు కదా! నువ్వు ఎవరికైనా సహాయం చేశావా? ఎప్పుడు?

(ఈ) మీకు ఆశ్చర్యం కలిగించిన సంఘటనలను గురించి రాయండి.

(ఉ) కథను సొంతమాటల్లో రాయండి.

© SCERT not to be republished

## IV పదజాలం



(అ) వైడూర్యరాజు పల్లయ్యకు వజ్రాలు, వైడూర్యాలు, నీలం, కెంపు, మరకతం, గోమేదికం, ముత్యాలు బహుమతిగా ఇచ్చాడు కదా! ఇవన్నీ చాలా విలువైనవి. ఇలా మీకు తెలిసిన విలువైనవాటిని మరికొన్నింటి పేర్లు రాయండి.

.................................... .................................... ....................................

.................................... .................................... ....................................

.................................... .................................... ....................................

.................................... .................................... ....................................


(ఆ) చేపలు నీటిలో నివసించే ప్రాణులు కదా! ఇలా నీటిలో ఉండే ఇతర ప్రాణుల పేర్లు రాయండి.

.................................... .................................... ....................................

.................................... .................................... ....................................


.................................... .................................... ....................................

(ఇ) కథ చదివారు కదా! కథలో పల్లయ్యకు సంబంధించిన పదాలను వెతికి రాయండి.




© SCERT not to be republished

(ఈ) మీకు సంబంధించిన పదాలు రాయండి. వాటితో వాక్యాలు రాయండి.




..........................................................................................................................

..........................................................................................................................


## V సృజనాత్మకత



**(అ) పాఠంలోని కథను పొడిగించి రాయండి.**

**(ఆ) "పైడిమీనులదీవి" ఎలా ఉంటుందో ఊహించి చిత్రం గీయండి. రంగులు వేయండి. దాని గురించి రాయండి.**

## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు



**(అ) కొన్ని అద్భుత కథలను సేకరించండి.**

**(ఆ) మీ తరగతిలో ఉపకారం చేసే గుణం ఎవరెవరికి ఉందో చెప్పండి. వాళ్ళను మీరు ఏమని అభినందిస్తారో తెలపండి.**

## VII భాషను గురించి తెలుసుకుందాం



**(అ) కింది వాక్యాలలో గీత గీసిన పదాలను గమనించండి.**

1. అవి <u>ఎర్ర</u> గులాబీలు.
2. ఇవి <u>వేడి</u> పాలు.
3. ఇది <u>పెద్ద</u> సూట్‌కేసు.
4. రహీం చాలా <u>మంచి</u> పిల్లవాడు.
5. ఈ ద్రాక్ష పళ్లు చాలా <u>తియ్యగా</u> ఉన్నాయి.

పై వాక్యాలలో గీతగీసిన పదాలు గులాబీలు, పాలు, సూట్‌కేసు, రహీం, ద్రాక్షపళ్లు ఎలా ఉన్నాయో తెలియజేస్తున్నాయి కదా! ఇలా **'గుణాన్ని'** తెలిపే పదాన్ని **'విశేషణం'** అంటారు.

**(ఆ) పాఠాలు చదవండి. విశేషణపదాలున్న వాక్యాలకింద గీత గీయండి. ఆ పదాలను రాయండి.**

....................................................................................................

....................................................................................................

....................................................................................................



### నేనివి చేయగలనా ?



| | |
|---|---|
| 1. కథను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. కథలోని పేరాలను ధారాళంగా చదవగలను. | ఔను / కాదు |
| 3. కథను సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. పాఠంలోని కథను పొడిగించి రాయగలను. ఊహించి చిత్రం గీయగలను. | ఔను / కాదు |

© SCERT not to be republished

యూనిట్ 2

# ఉష్! ఉష్!

చదువు - ఆనందించు


© SCERT not to be republished

రంగన్న పత్తిబుట్ట మోసుకుంటూ వెళుతున్నాడు. హఠాత్తుగా సుడిగాలి వచ్చి ఆ పత్తి అంతా ఎగిరిపోయింది. పత్తి లేకుండా ఇంటికి వెళితే అతని భార్య గొడవపెడుతుంది. అతడు ఆందోళనతో, ఏమీ తోచక, "ఉష్! ఉష్!" అన్నాడు. అదే సమయంలో అక్కడికి సమీపంలో ఒక వేటగాడు పక్షుల కోసం వలను పరిచాడు. ఉష్! ఉష్! శబ్దం వినగానే ఆ చుట్టుపక్కల ఉన్న పక్షులన్నీ దూరంగా ఎగిరిపోయాయి. వేటగాడికి కోపం వచ్చింది. వేటగాడు రంగన్నతో "నీవల్ల నాకు చాలా నష్టం వచ్చింది. ఇకనుంచి నువ్వు, "పట్టుకోండి! పట్టుకోండి! అను!" అని చెప్పాడు.

"పట్టుకోండి! పట్టుకోండి!" అని వల్లెవేసుకుంటూ రంగన్న ముందుకు సాగాడు. ఆ దారిలో ఒకచోట కొందరు దొంగలు తాము దోచుకొని వచ్చిన ధనాన్ని వాటాలు వేసుకుంటున్నారు. వాళ్ళు రంగన్న మాటలు విని, "మమ్మల్ని పట్టుకొని రాజుగారికి అప్పగించాలనుకుంటున్నావా?" ఇకనుంచి "వీటిని, ఇలాగే ఉంచండి, ఇంకా చాలా తీసుకురండి, అనాలి. తెలుసా?" అన్నారు.

రంగన్న అలాగే అనుకుంటూ బయలుదేరాడు. శ్మశానాన్ని సమీపించాడు. అక్కడ కలరా వ్యాధితో చనిపోయినవాళ్ళ శవాలను కాల్చివేస్తున్నారు. రంగన్న అక్కడికి వచ్చి "వీటిని ఇలాగే ఉంచండి. ఇంకా


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

చాలా తీసుకురండి'' అన్నాడు. గ్రామస్థులు రంగన్న మాటలు విని, ''నీకు బుద్ధి లేదా! అందరూ దుఃఖంలో ఉంటే ఇలాంటి మాటలేమిటి? నువ్వు, ''ఇది విచారకరమైన విషయం అనాలి,'' అన్నారు.

''ఇది విచారకరమైన విషయం'' అని మనసులో అనుకుంటూ ఒక ఊరేగింపు దగ్గరకు చేరుకున్నాడు. అక్కడికి చేరిన రంగన్న ''ఇది విచారకరమైన విషయం'' అన్నాడు. జనం అతని మాటలు విని, ''మేము సంతోషంగా ఊరేగింపు జరుపుతూ ఉంటే ఇలా మాట్లాడతావేమిటి? 'అదృష్టం ఉంటే ఇలాంటి సుఖం దొరకాలి' అనాలి,'' అన్నారు. రంగన్న అలాగే అనుకుంటూ బయలుదేరాడు.

అలా వెళ్తుండగా చీకటి పడింది. అప్పుడు అతనికి, 'ఎక్కడ చీకటి పడితే అక్కడే పడుకోవాలి', అని భార్య చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. వెంటనే అక్కడ ఓ ఇంటిపక్కన గుర్రుపెట్టి నిద్రపోయాడు. తెల్లవారింది. వేడివేడి గంజి అతని ముఖంమీద పడడంతో కెవ్వుమని అరుస్తూ నిద్రలేచాడు. అది తన ఇల్లేనని తెలుసుకున్నాడు. అతణ్ణి గుర్తించక అతడి భార్య వేడివేడి గంజిని అతనిమీద గుమ్మరించింది. ఆ బాధలో కూడా అతడు, ''అదృష్టం ఉంటే ఇలాంటి సుఖం దొరకాలి!'' అన్నాడు బిగ్గరగా.

**చిత్రం చూడండి. చిత్రంలో ఆమె ఏమి మాట్లాడుతూ ఉందో ఊహించి రాయండి.**



# 9. అల్లరి సోముడు

## చిత్రం చూడండి - ఆలోచించండి - మాట్లాడండి



- ★ చిత్రంలో ఎవరెవరు ఉన్నారు? ఏం చేస్తున్నారు?
- ★ పిల్లవాడు బడిలో ఉండకుండా బయట ఎందుకు ఉన్నాడు?
- ★ బడికి వెళ్లకుండా ఉండే పిల్లలు మీకు కనిపిస్తే మీరేం చేస్తారు?

**పిల్లలకు సూచనలు :**

- ★ పాఠంలోని చిత్రాలను చూడండి. చిత్రాలను గురించి మాట్లాడండి.
- ★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.
- ★ గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడిగి లేదా పదాలు - అర్థాలు అనే పట్టికలో చూసి తెలుసుకోండి.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

1. బాలుడొక్కడు గలడొక పట్టణమున
వాని నిజనామ మేదొ ఎవ్వరు నెరుంగ-
రతడు సోమరి బాలకుండగుట జేసి
సోముడని బాలురెల్లరు నామమిడిరి.




2. ఆతడొకనాడు బడిలోని కరుగ మాని
ఆటలాడగ జనె నొక్క తోటలోకి
కడమ ఆ బాలురెల్లరు బడికి బోవ
వానితో ఆడలే దొక్క బాలకుండు.

3. ఏగి నా దారి జనుచున్న జాగిలమును
పిలిచె సోముడు, భైరవా! నిలువుమయ్య
వేడుకల మీర నాతోడ నాడుకొనగ
వత్తువే యన అనెనది వానితోడ.

4. త్వరగ పోవలె నిపుడు నాస్వామి కడకు
వేటకై వాడు నాకయి వేచియుండు
అదను కాదిది నీతోడ ఆటలాడ
అనుచు నా కుక్క తన దారి జనియె నంత.




5. గడ్డిపోచల ముక్కున గరచికొనుచు
వడిగ ఎగురుచునున్నట్టి వాయసమును
కాంచి ఇట్లనె బాలుండు; 'కాకి! రమ్ము
వేడుకలరగ నాతోడ ఆడుకొనగ.'



6. ఆటలాడగ నాకింత వ్యవధి లేదు
వానకాలము రానుండె, గాన నిపుడు
గూడుకట్టంగ వలయు నో కుఱ్ఱవాడ
అనుచు వచియించి కాకంబు చనియె నెటకొ.

© SCERT not to be republished



7. సోము డంతట నొక గండుచీమ జూచి
ఎచటి కేగెదు చీమ! యొక్కింత నిలుము
ఆడుకొన నీవు వత్తువె వేడుకలర
అనగ, నా చీమ అతనితో అనియె నిట్లు.

8. నూక లొక్కటి యొకటిగ నోట గరచి
కూర్చుకొనుచుంటి బాలుడా! గూటిలోకి
మాటలాడిన గింజలు నోటజారు
ఆటలాడగ నా కెట్టు లనువుపడును?

9. సోముడిట్లని తలపోసె చీమ మొదలు
జగములోపల గల జంతుజాల మెల్ల
పాటుపడుచుండ, అక్కటా! వ్యర్థముగను
గడిపి పుచ్చితి నిన్నాళ్ళు కాలమెల్ల.


10. బాలు డంతట నిత్యంబు బడికి పోయి
శ్రద్ధగా పాఠముల నెల్ల చదువుచుండె
అతని బుద్ధికి మది మెచ్చి అంతనుండి
బుద్ధుడని పేరుపెట్టిరి బుడతలెల్ల.

– నాళం కృష్ణారావు

## ఇవి చేయండి



## I వినండి - ఆలోచించి చెప్పండి



(అ) పాఠంలోని గేయకథను రాగంతో చదవండి.


(ఆ) ఆడుకోడానికి సోముడు ఎవరెవరిని పిలిచాడు? ఎవరూ ఎందుకు రాలేదు?

(ఇ) మీరైతే ఆడుకోడానికి ఎవరెవరిని పిలుస్తారు? ఎలా పిలుస్తారు?

(ఈ) బడికి పోకుండా సోముడిలాంటి పిల్లలు కనిపిస్తే మీరేం చేస్తారు?

(ఉ) పాఠం సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పండి.

## II చదవండి - అర్థంచేసుకొని చెప్పండి - రాయండి



(అ) కిందివాక్యాలు చదవండి. ఆ భావమున్న పద్యాలను చదవండి.

1. ఆటలాడటానికి నాకు వ్యవధి లేదు.
2. వేటాడటానికి త్వరగా వెళ్ళాలి.
3. చీమా, ఎక్కడికి వెళుతున్నావు, ఒక్కసారి ఆగు.
4. అరే! నేనింత కాలాన్ని ఎంత వ్యర్థంగా గడిపాను.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

**(ఆ) కింది పద్యపాదాలు తారుమారుగా ఉన్నాయి. వాటిని సరైన వరసలో రాయండి.**

రతడు సోమరి బాలకుండగుట జేసి
బాలుడొక్కడు గలడొక పట్టణమున
సోముడని బాలురెల్లరు నామమిడిరి
వాని నిజనామ మేదొ ఎవ్వరు నెరుంగ

..........................................................................................

..........................................................................................

..........................................................................................

..........................................................................................

**(ఇ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. కుక్క సోముడితో ఏమన్నది?
2. కాకి సోముడితో ఎందుకు ఆడలేనని చెప్పింది?
3. గండుచీమ సోముడితో ఏమన్నది?
4. పాఠంలో సోముడి గురించి తెలిపే వాక్యాలేవి? వాటి భావం ఏమిటి?

## III రాయండి




**(అ) సోముణ్ణి గురించి మీ సొంతమాటల్లో రాయండి.**

**(ఆ) సోముడికి కింది జంతువులు ఎదురైతే అవి ఏమని చెప్పి ఉండేవి?**

పిల్లి రామచిలక ఉడత

**(ఇ) గేయకథను సొంతమాటల్లో రాయండి.**

## IV పదజాలం



**(అ) కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు అర్థాలు రాయండి.**

1. రవి తప్ప కడమ పిల్లలందరూ బడికి వచ్చారు.

   కడమ = ..............................................................

2. పోలీసులు దొంగలను పట్టుకోవడానికి జాగిలాలను ఉపయోగిస్తారు.

   జాగిలం = ..............................................................

3. వాయసం నీళ్లకోసం కావ్! కావ్! అని అరుస్తోంది.

   వాయసం = ..............................................................

4. ఈ జగం లో కష్టపడి పనిచేసేవారు ఎందరో ఉన్నారు.


   జగం = ..............................................................

© SCERT Not to be republished

(ఆ) కింది పట్టికలో ఈ పాఠంలోని కొన్ని పదాలు దాగిఉన్నాయి. వాటిని పాఠంలో గుర్తించి గీత గీయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| భై | చీ | గిం | జ | లు | ప |
| ర | మ | య | డ | వ్య | ట్ట |
| వా | సో | మ | రి | వ | ణ |
| నూ | క | కు | బా | ధి | ము |
| ల | ట | క్క | లు | క | న |
| క | డ | మ | డా | ర | ము |

## V సృజనాత్మకత



(అ) పాఠం ఆధారంగా సోముడు, కాకి, చీమ, కుక్క పాత్రలకు మాస్కులు తయారు చేయండి. నాటకీకరణ చేయండి.

## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు



(అ) పద్యకథలను కొన్నింటిని సేకరించండి. వాటిని చదివి వినిపించండి.

(ఆ) చీమ, కాకి, కుక్క మొదలయిన వాటి గొప్పతనం తెలుసుకొని సోముడు మారాడు కదా! ఇలాంటివాళ్ళు అలాగే మారడానికి వేటిని ఆదర్శంగా తీసుకోవచ్చో చెప్పండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం



(అ) కింది వాక్యాలను పరిశీలించండి. గీత గీసిన పదాలను చదవండి.

1. సరళ ఇంటికి వచ్చింది.
2. రవి పుస్తకం చదువుతున్నాడు.
3. గీత బజారుకు వెళ్లింది.

పై వాక్యాలలో వచ్చింది, చదువుతున్నాడు, వెళ్లింది అనే క్రియాపదాలు పూర్తి అయిన పనిని గురించి తెలుపుతున్నాయి కదా. వాటిని **సమాపక క్రియలు** అంటారు.

అలాగే కింది వాక్యాలలో గీత గీసిన పదాలను చదవండి.

1. సరళ ఇంటికి వచ్చి, పేపరు చదివింది.
2. రవి పుస్తకం చదివి, పడుకొన్నాడు.
3. గీత బజారుకు వెళ్లి, కూరగాయలు కొన్నది.

వచ్చి, చదివి, వెళ్లి అనే క్రియాపదాలు పూర్తికాని పనిని గురించి తెలుపుతున్నాయి. వీటిని **అసమాపక క్రియలు** అంటారు.

© SCERT not to be republished



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

**(ఆ) కింది వాక్యాలు చదవండి. వాక్యాల్లోని సమాపక క్రియలకు '◯' చుట్టండి. అసమాపక క్రియలకింద గీత గీయండి.**

(1) అస్మద్ అన్నం తిని, బడికి వెళ్లాడు.

(2) పద్మ పుస్తకం కొనుక్కొని, సుల్తానా ఇంటికి వెళ్లింది.

(3) జయ పిండి తెచ్చి, రొట్టెలు చేసి, అందరికీ వడ్డించింది.

**(ఇ) కింది వాక్యాలు చదవండి. మొదటి వాక్యానికి, రెండో వాక్యానికి గల తేడాను చెప్పండి.**

(1) పద్మ అన్నం తిన్నది.

(2) పద్మ అన్నం తిని, బడికి వెళ్లింది.

మొదటి వాక్యంలో తిన్నది అని ఒకే సమాపక క్రియ ఉంది. ఇలా వాక్యంలో సమాపక క్రియ ఒకటే ఉంటే అలాంటి వాక్యాన్ని **సరళ వాక్యం** అంటారు.

రెండో వాక్యంలో 'వెళ్లింది' అని ఒక **సమాపక క్రియ** ఉంది. 'తిని' అని ఒక **అసమాపక క్రియ** కూడా ఉంది. ఇలా ఒకే వాక్యంలో అసమాపక క్రియ, సమాపక క్రియ ఉన్న వాక్యాన్ని **సంశ్లిష్ట వాక్యం** అంటారు.

**(ఈ) కింది పేరా చదవండి. పేరాలోని సరళ వాక్యాలను, సంశ్లిష్ట వాక్యాలను గుర్తించండి.**

శీను రోజూ ఆఫీసుకు వెళతాడు. ఆదివారం సంతకు వెళ్లి కూరగాయలు తెస్తాడు. రోజూ రాత్రి చదరంగం పుస్తకాలు చదివి పిల్లలతో చదరంగం ఆడతాడు. పిల్లలకు కథలు కూడా చెబుతాడు.

| సరళ వాక్యాలు | సంశ్లిష్ట వాక్యాలు |
|---|---|
| ...................................................... | ...................................................... |
| ...................................................... | ...................................................... |
| ...................................................... | ...................................................... |

© SCERT not to be republished



## నేనివి చేయగలనా ?




| | |
|---|---|
| 1. 'అల్లరి సోముడు' కథను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. గేయకథను ధారాళంగా చదవగలను. | ఔను / కాదు |
| 3. అల్లరి సోముణ్ణి గురించి రాయగలను. కథను సొంత మాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. పాఠంలోని పాత్రలకు మాస్కులు తయారుచేసి నాటకీకరణం చేయగలను. | ఔను / కాదు |

యూనిట్ 3

# 10. పండుగలు

## చిత్రం చూడండి - ఆలోచించండి - మాట్లాడండి



★ చిత్రంలో ఎవరెవరున్నారు? ఏమి చేస్తున్నారు?

★ చిత్రంలో ఏ ఏ పండుగల గురించి ఉంది?

★ మీరు జరుపుకొనే పండుగలు ఏవి? మీ మిత్రులు జరుపుకొనే పండుగలు ఏవి?

**పిల్లలకు సూచనలు :**

★ పాఠంలోని చిత్రాలను చూడండి. చిత్రాలను గురించి మాట్లాడండి.

★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.

★ గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడిగి లేదా పదాలు - అర్థాలు అన్న పట్టికలో చూసి తెలుసుకోండి.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ





**కవిత** : శిరీషా! ఈమధ్య రెండురోజులుగా నువ్వు బడికి రావడం లేదు. ఏమైంది?

**శిరీష** : నాకు జ్వరం వచ్చింది. ఈరోజే తగ్గింది. రేపు బడికి వద్దామని అనుకుంటున్నాను.

**కవిత** : మన తెలుగు మాస్టరుగారు పండుగలను గురించి ఒక వ్యాసం రాసుకొని రమ్మన్నారు. అందులో అన్ని మతాలవాళ్ళ పండుగలను గురించి రాయమన్నారు.

**శిరీష** : మనకు దీపావళిని గురించి తెలుసు. అబిదా, మేరీ వాళ్లనడిగి వాళ్ళ పండుగలను గురించి కూడా రాద్దాం.

**కవిత** : దీపావళిని గురించి మీ అమ్మగారిని అడుగుదాం.

**శిరీష** : నువ్విప్పటి వరకు మా అమ్మను చూడలేదు కదూ! మా అమ్మపేరు లక్ష్మి. "అమ్మా!... అమ్మా!"

**లక్ష్మి** : ఏమిటమ్మా?


**శిరీష** : నువ్విలా కూర్చో కవితా! అమ్మా! మాకు దీపావళిని గురించి చెప్పు! ఒక వ్యాసం రాయాలి.

**లక్ష్మి** : మన పండుగల్లో చాలా ప్రాధాన్యం ఉన్న పండుగ దీపావళి. మనం ఈ పండుగ ఆశ్వయుజ మాసం చివరిరోజున జరుపుకొంటాం. ఇంగ్లీషునెలలో ఇది అక్టోబరు నెలలో గాని, నవంబరులో గాని వస్తుంది.

**శిరీష** : ఓహో! అలాగా! మరి దీపావళి గురించి వివరంగా చెప్పమ్మా!

**లక్ష్మి** : పూర్వకాలంలో నరకాసురుడనే రాక్షసుడు ఉండేవాడట. వాడు జనాన్ని బాధలు పెట్టేవాడట. అందుచేత శ్రీకృష్ణుడు, తన భార్య సత్యభామతో కలిసి నరకాసురుడిమీద యుద్ధానికి వెళ్ళాడు. ఆ యుద్ధంలో నరకాసుర వధ జరిగింది. చెడుమీద మంచి విజయం సాధించింది. స్త్రీలు కూడా పురుషులలాగ యుద్ధం చేయగలరని సత్యభామ నిరూపించింది. నరక చతుర్దశినాడు నరకాసుర వధ జరిగింది. అందుకు అందరూ అమావాస్యనాడు ఆనందంతో దీపాలు వెలిగించి పండుగ చేసుకున్నారు. అదే దీపావళి పండుగ అయింది.

**కవిత** : అయితే ఆ గెలుపునే మనం పండుగగా జరుపుకొంటున్నా మన్నమాట. మన ఇళ్ళల్లో మట్టి ప్రమిదలలో నూనెపోసి వత్తులు వెలిగించి ఎన్ని దీపాలు వెలిగిస్తామో!



©SCERT not to be republished

**లక్ష్మి** : దీపావళి అంటే దీపాల వరస. దీపపు వెలుగు జ్ఞానానికి గుర్తు. అజ్ఞానాంధకారాన్ని పారదోలమని మనకు సందేశమిస్తున్న పండుగ దీపావళి.

**శిరీష** : మనం కాకరపువ్వువత్తులు, మతాబాలు, టపాకాయలు, భూచక్రాలు, బాంబులు లాంటివి ఎన్నో కాల్చి ఎంతో సంబరంగా పండుగ చేసుకొంటాం.

**లక్ష్మి** : నిజం చెప్పాలంటే, మనం మితిమీరి బాణసంచా కాలుస్తున్నాం, చాలా డబ్బు తగలేస్తున్నాం.

**శిరీష** : పోమ్మా, నువ్వు మరీనూ —

**కవిత** : మీ అమ్మగారు టపాకాయలు అసలే కాల్చవద్దని అనడంలేదు. మితిమీరి కాలుస్తున్నామనే చెప్తున్నారు. సరే, మనం అబిదా వాళ్ళ ఇంటికి వెళ్దామా?

**లక్ష్మి** : శిరీషా! అబిదా ఇల్లు దగ్గరేగా! త్వరగా వచ్చేయ్!

(అబిదా ఇంట్లో)

**కవిత** : అబిదా, అబిదా!

**అబిదా** : ఎవరూ? ఓహ్... కవితా, శిరీషా ఇద్దరూ వచ్చారా! మా పండుగ గురించి చెప్పమని మా అబ్బాజాన్‌ని అడిగాను. మా అబ్బాజాన్ పేరు మతీన్ అహమ్మద్. అబ్బాజాన్ - అబ్బాజాన్!!

**మతీన్** : క్యా బేటీ? - ఓహ్! మీ దోస్తులు వచ్చారా! కూర్చోండమ్మా.

**అబిదా** : మన పండుగల గురించి చెప్పండి అబ్బాజాన్!



**మతీన్** : ముస్లిముల పండుగల్లో ముఖ్యమైనది 'ఈద్-ఉల్-ఫితర్'. మా కేలండర్ హిబ్రూ సంవత్సరాలలో ఉంటుంది. మొదటినెల మొహర్రం అయితే చివరి నెల జల్‌హేద్. రంజాన్ ఆ నెలల్లో తొమ్మిదోది. ఆ నెల చివర్లో చంద్రోదయం రోజున మేము 'ఈద్-ఉల్-ఫితర్' జరుపుతాం.

**శిరీష** : మే మేమో, మీ నెల పేరుమీద 'రంజాన్ పండుగ' అని అనుకుంటూ ఉంటాం. అయితే పండుగపేరు 'ఈద్-ఉల్-ఫితర్' అన్నమాట.

**మతీన్** : ఈద్-ఉల్-ఫితర్ దానధర్మాల పండుగ. ఈ నెలంతా ముసల్మానులు ఉపవాసం ఉంటారు. దీన్నే 'రోజా' అంటాం. తప్పకుండా రోజుకు ఐదు సార్లు నమాజు చేస్తాం—అంటే ప్రార్థనచేస్తాం.

**కవిత** : ఈ పండుగ ప్రాధాన్యం ఏమిటి?

**మతీన్** : ఇది దానధర్మాల పండుగ అని చెప్పాను కదా! పగలంతా ఉపవాసమున్న ముస్లిములు పేదల ఆకలి బాధను అర్థంచేసుకుంటారు. దానధర్మాలు చేస్తారు. అల్లాను మనసులో నిలుపుకొని తోటి మనుషుల కష్టాల్లో పాలు పంచుకుంటారు. ఈ స్ఫూర్తిని జీవితకాలం కొనసాగిస్తారు.

**శిరీష** : మంచిదండి; మేమిక వెళ్ళివస్తాం!

**అబిదా** : మీరు మేరీ ఇంటికేగా, నేనూ వస్తాను. అబ్బాజాన్! మేము ముగ్గురం మేరీ ఇంటికి వెళ్ళివస్తాం.

(మేరీ ఇంట్లో)

**మేరీ** : రండి రండి! మా అమ్మను పిలుస్తాను. మా అమ్మపేరు కెరోలిన్. అమ్మా! అమ్మా! మా స్నేహితురాళ్ళు వచ్చారు. వాళ్ళకు మన పండుగల గురించి చెప్పు.

© SCERT not to be republished

కెరోలిన్ : సరే, 'ఈస్టర్' పండుగను గురించి చెప్తాను.

కవిత : 'ఈస్టర్' పండుగ గురించి ఎన్నడూ వినలేదు!



కెరోలిన్ : 'పవిత్ర శుక్రవారం' అంటే 'గుడ్ ఫ్రైడే' రోజున యేసు క్రీస్తు శిలువ మీద మరణించాడు. తరవాత వచ్చే ఆదివారమే ఈస్టర్, దాన్ని 'క్రీస్తు పునరుత్థాన దినం' అంటాం. యేసు ప్రభువు ప్రేమకు, అహింసకు ప్రతీక. తనను బాధించినవాళ్ళను కూడా క్షమించిన కరుణామయుడు. ఆయన తిరిగి లేవడం అంటే ప్రేమ పునరుజ్జీవనం పొందడమే. ఆ పండుగ సందేశం అదే.

శిరీష : ఈ పండుగ ఎప్పుడు చేసుకుంటారు?

కెరోలిన్ : వసంత ఋతువులో మొదటి పున్నమి తరవాత వచ్చే మొదటి ఆదివారం 'ఈస్టర్' అవుతుంది.

అబిదా : ఈ పండుగ ఎలా జరుపుకొంటారు?

కెరోలిన్ : ఈ పండుగకు ముందు 40 రోజులు ఉపవాసం ఉండాలి. ఈ ఉపవాసదినాల్లో ప్రార్థన, నమ్రతగా జీవించడం, ఆత్మపరిశీలన ముఖ్యం. ఈ విషయాలు రాస్తే చాలు.

శిరీష : మంచిదండి. మేమింక వెళ్ళి ఈ పండుగల గురించి రాసుకుంటామండి. మేరీ! నువ్వూ రా! అందరం మా ఇంట్లో కూర్చుని వ్యాసం రాసుకుందాం.

(శిరీష ఇంట్లో)

లక్ష్మి : ఏం రాసుకుంటున్నారు?

శిరీష : మన పండుగలమీద వ్యాసమమ్మా!

లక్ష్మి : అమ్మాయిలూ! ఒక్కటి గుర్తుంచుకోండి. వ్యాసం ముగింపులో అన్ని మతాల్లో సారం ఒక్కటే అని రాయండి. మనలో ఉండే చెడును తొలగించుకోవాలి. అలాగే సంఘంలో చెడు లేకుండా చూడాలి. తోటి మనుషుల్ని ప్రేమించాలి. పేదలకు సాయం చెయ్యాలి. అందర్నీ సమానంగా చూడాలి. హిందూమతం 'మానవసేవే మాధవసేవ' అంటుంది. ఇస్లాంమతం 'పేదవాడికి సాయం చేయ' మంటుంది. క్రైస్తవమతం 'నీ పొరుగువాణ్ణి ప్రేమించ'మని చెబుతుంది. వాటన్నింటిలో అర్థం ఒక్కటే. మనిషి రక్తం ఏ దేశంలోనైనా, ఏ మతంవారిలోనైనా ఎర్రగానే ఉంటుంది. అన్ని మతాలూ మనిషిని మంచిమార్గంవైపు నడవమని ఉపదేశిస్తున్నాయి; సమాజంలో శాంతి, కరుణ, దయ ఎప్పుడూ ఉండాలని కోరుతున్నాయి. ఔనా, కాదా?

అందరూ : ఔను! ఔను!

లక్ష్మి : అందుకే మనమందరం మత సామరస్యంతో అన్నదమ్ముల్లాగ, అక్కచెల్లెళ్ళలాగ జీవించాలి. కుల మత ద్వేషాలు లేని భారతదేశాన్ని మనం తయారుచేసుకోవాలి. ఇలా చెప్పి మీ వ్యాసం తయారుచేసుకోండి. మిమ్మల్ని మీ టీచరు చాలా మెచ్చుకుంటారు.

అందరూ : అలాగే!

© SCERT not to be republished



## ఇవి చేయండి



### I వినండి - ఆలోచించి చెప్పండి



(అ) పండుగలు ఎందుకు జరుపుకొంటారు?

(ఆ) అందరూ పండుగలు ఒకే విధంగా జరుపుకొంటారా? తేడాలు ఏమిటి?

(ఇ) పండుగనాడు మీరేం చేస్తారు?

### II చదవండి - అర్థంచేసుకొని చెప్పండి - రాయండి



(అ) పాఠం చదవండి. పాఠంలో అన్ని పండుగలను గురించి చెప్పిన పేరా ఏది? దానికి తగిన శీర్షికను రాయండి.

(ఆ) పాఠంలో ఏ ఏ పండుగలను గురించి ఉంది? వాటిని వివరించే వాక్యాలు ఏవి? వాటికింద గీత గీయండి.

(ఇ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. 'దీపావళి' పండుగను ఎందుకు జరుపుకొంటారు?
2. 'ఈద్-ఉల్-ఫితర్'ను దానధర్మాల పండుగ అని ఎందుకు అంటారు?
3. 'పవిత్ర శుక్రవారం' ప్రత్యేకత ఏంటి?
4. అన్ని మతాలలోని పండుగలనుంచి మనం ఏం గ్రహించాలి?

(ఈ) పాఠాన్ని చదవండి. పాఠంలో పండుగల గురించి చెప్పిన పదాలకింద గీత గీయండి.

### III రాయండి




(అ) అన్ని పండుగలలో నీకిష్టమైన పండుగ ఏది? ఎందువల్ల? దాన్ని ఎలా జరుపుతారో రాయండి.

(ఆ) పండుగరోజు మీఇంట్లోవాళ్ళు ఎవరెవరు ఏయే పనులు చేస్తారో రాయండి.

(ఇ) పాఠంలో చెప్పే పండుగలు కాకుండా, అందరూ చేసుకొనే ఇతర పండుగలు ఏవి?

© SCERT not to be republished

## IV పదజాలం



**(అ) కింది పండుగల పేర్లు చదవండి. వాటిలో మీరు జరుపుకొనే పండుగలకు '⬭' చుట్టండి. వాటితో ఒక వాక్యం రాయండి.**

| | | |
|---|---|---|
| వినాయక చవితి | బక్రీద్ | మొహర్రం |
| దీపావళి | క్రిస్‌మస్ | గుడ్ ఫ్రైడే |
| దసరా | సంక్రాంతి | హోళీ |
| శ్రీరామ నవమి | రాఖీ | బతుకమ్మ |
| ఉగాది | కృష్ణాష్టమి | బాలల దినోత్సవం |

**(ఆ) కింది గళ్ళలో కొన్ని పండుగలు దాగి ఉన్నాయి. వాటిని వెతికి గుర్తించండి, రాయండి.**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| వి | క | ఉ | గా | ది | న | ఈ |
| నా | ద | స | ర | హో | ళీ | ద్ |
| య | సం | క్రాం | తి | రం | జా | న్ |
| క | ను | మ | దీ | పా | వ | ళి |
| చ | క్రి | స్ | మ | స్ | రా | ఖీ |
| వి | మొ | హ | రం | ఈ | ష్ట | ర్ |
| తి | బ | క్రీ | ద్ | బో | నా | లు |

**(ఇ) కింది వాక్యాలను జతపరచండి. వాక్యాలుగా రాయండి. ఇలాగే మీకు తెలిసిన ఇతర పండుగల గురించి రాయండి.**

| | |
|---|---|
| రంజాన్ | పవిత్ర శుక్రవారం |
| కిస్మస్ | నరకాసురుడు |
| గుడ్ ఫ్రైడే | మొదటి నెల |
| దీపావళి | తొమ్మిదో నెల |
| మొహర్రం | డిసెంబరు 25 |

.........................................................................................................

.........................................................................................................

.........................................................................................................

.........................................................................................................

.........................................................................................................

© SCERT not to be republished


## V సృజనాత్మకత



(అ) మీరు జరుపుకొన్న ఒక పండుగను గురించి మీ స్నేహితుడికి లేదా స్నేహితురాలికి ఒక లేఖ రాయండి.

(ఆ) "మతాలు వేరైనా, కులాలు వేరైనా మానవులంతా ఒక్కటే!" అనే భావం వచ్చేలా చిత్రం గీయండి. కవిత లేదా వ్యాసం రాయండి.

## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు



(అ) ఏ ఏ పండుగలు ఎలా జరుపుకొంటారో తెలిపే చిత్రాలను సేకరించండి.

(ఆ) పండుగలకు సంబంధించిన కథలను సేకరించండి. చదివి వినిపించండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం



(అ) కింది వాక్యాలు చదవండి. గీత గీసిన పదాలను గమనించండి.

ఉదా : (1) సంచిలో <u>పుస్తకం</u> ఉంది (2) సంచిలో <u>పుస్తకాలు</u> ఉన్నాయి.

(3) అరుగుమీద <u>పిల్లి</u> ఉంది. (4) అరుగుమీద <u>పిల్లులు</u> ఉన్నాయి.

(5) పిల్లవాడు <u>పాట</u> పాడాడు. (6) పిల్లలు <u>పాటలు</u> పాడారు.

పై వాక్యాలలో **'పుస్తకం'** ఏకవచనంతో వచ్చినప్పుడు క్రియ **'ఉంది'** అని వచ్చింది. **'పుస్తకాలు'** అని బహువచనంలో వచ్చినప్పుడు **'ఉన్నాయి'** అని క్రియ మారింది. ఇలా వచనం మారినప్పుడు క్రియల రూపాలు మారుతున్నాయి కదా. ఇలాంటి వాక్యాలు మరికొన్ని రాయండి.

.................................................................................................................

.................................................................................................................



### నేనివి చేయగలనా ?



| | |
|---|---|
| 1. మేము చేసుకొనే పండుగను గురించి సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. పాఠాన్ని ధారాళంగా చదవగలను. పండుగలను గురించి చెప్పగలను. | ఔను / కాదు |
| 3. పండుగల గురించి సొంతవాక్యాల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. సంభాషణను వ్యాసరూపంలోకి మార్చి రాయగలను. లేఖారూపంలో రాయగలను. | ఔను / కాదు |

© SCERT not to be republished


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

## యూనిట్ 3 ఇంకా అనుమానం ఎందుకు? చదువు - ఆనందించు



పిట్టలు పట్టేవాడు ఒకడున్నాడు. అతనికి ఒకనాడు ఒక రామచిలక చిక్కింది. 'బలే, బలే! ఈ రామచిలకకు మాటలెన్నో నేర్పుతాను. 'రాజుగారికి ఇస్తాను. విలువైన బహుమతులెన్నో పొందుతాను', అనుకున్నాడు, పిట్టలు పట్టేవాడు. దానికి మాటలు నేర్పడం మొదలెట్టాడు.

అదొక మొండిచిలక. అతని మాటలు ఏవీ వినేది కాదు. ఏవీ నేర్చుకునేది కాదు. చివరకు దానికి ఒక్కటే వాక్యం పట్టుబడింది. అదేమిటంటే "ఇంకా అనుమానం ఎందుకు?" చిలకకు కొత్తమాటలు నేర్పించడానికి పిట్టలుపట్టేవాడు ఎంతో ప్రయాసపడ్డాడు. చివరకు విసిగిపోయాడు. దాన్ని అలాగే రాజుగారి దగ్గరకు తీసుకెళ్ళాడు.

రాజుగారికి చిలకను చూపించి, 'మహారాజా! ఈ చిలక మనుషులు మాట్లాడినట్లే మాట్లాడుతుంది. ఇటువంటి చిలక మీదగ్గరే ఉండాలి' అన్నాడు, వినయంగా.

మహారాజు చిలకవైపు తిరిగి, 'నిజమేనా?' అని అడిగాడు.

'ఇంకా అనుమానం ఎందుకు?' అన్నది చిలక.

రాజుగారికి ఎంతో సంతోషం కలిగింది. పిట్టలుపట్టేవాడికి విలువైన బహుమతులు విరివిగా ఇచ్చాడు.



పిట్టలుపట్టేవాడు ఎంతో ఆనందంగా వెళ్ళిపోయాడు.

రాజుగారు చిలకతో మనిషితో మాట్లాడినట్లు మాట్లాడటం మొదలుపెట్టాడు. కాని, కొద్దిసేపట్లోనే చిలకకు 'ఇంకా అనుమానం ఎందుకు?' అనే వాక్యంతప్ప మరొకటి రాదని రాజుగారికి అర్థం అయింది.

"నేను నిన్ను కొని ఎంత తప్పు చేశాను! నిజంగా నేనొక వెర్రివాణ్ణి!" అన్నాడు రాజు, కోపంగా.

'ఇంకా అనుమానం ఎందుకు?' అన్నది చిలక.

ఆ చిలకను రాజు బయటికి వదిలేశాడు.

అది ఆకాశంలోకి ఎగిరిపోయింది.

**యూనిట్ 3**

# 11. బాల్యమిత్రులు

## చిత్రం చూడండి - ఆలోచించండి - మాట్లాడండి



★ చిత్రంలో ఎవరెవరున్నారు? ఏమి చేస్తున్నారు?

★ పిల్లలంతా ఎక్కడికి వెళుతున్నారు? ఎందుకు?

★ చిత్రంలో ప్రత్యేకంగా ఉన్నది ఎవరు? అతన్ని గురించి చెప్పండి.

**పిల్లలకు సూచనలు :**

★ పాఠంలోని చిత్రాలను చూడండి. చిత్రాలను గురించి మాట్లాడండి.

★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.

★ గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడిగి లేదా పదాలు - అర్థాలు అన్న పట్టికలో చూసి తెలుసుకోండి.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

"బియ్యం నిండుకున్నాయి. అన్నం లేక పిల్లలు ఆకలని ఏడుస్తున్నారు." అంది భార్య.

"ఏం చేయాలో నాకూ తోచడంలేదు," అని నిట్టూర్చాడు భర్త.

"ఎంతకాలం ఇలా పస్తులుంటాం? ఏదైనా ఆలోచించండి," అని మళ్ళీ అంది భార్య.

"ఉన్నంతలోనే సంతృప్తిగా జీవించడంలో సంతోషం ఉంది," అని తులసి నీళ్ళు తాగుతూ అన్నాడు సుదాముడు.

"మన ద్వారకానగర మహారాజు శ్రీకృష్ణుడు మీ బాల్యస్నేహితుడని చెప్పేవారు కదా!" అని గుర్తుచేసింది భార్య.



"ఔను! నేను, కృష్ణుడు అవంతీనగరంలో సాందీపమహర్షి ఆశ్రమంలో కలిసి చదువుకున్నాం. నాకు మంచి ప్రాణమిత్రుడు."

"మరైతే వారిని కలిస్తే మన కష్టాలు తొలగిపోతాయేమో కదా!" అంది.

"కృష్ణుడు నాకు బాల్యస్నేహితుడైనా ఇప్పుడు మహారాజు. నన్ను గుర్తుపడతాడో లేదో!" అని అనుమానంగా అన్నాడు సుదాముడు.

"కృష్ణుడు ఎందరికో సహాయం చేస్తున్నాడట కదా! ఒక్కసారి వెళ్ళి కలిసి రండి," అని ప్రాధేయపడింది భార్య.

భార్య మాటలు విన్నాడు. ఇలాగైనా బాల్యమిత్రుణ్ణి కలుసుకోవచ్చు కదా! అని ఆలోచన వచ్చింది.

"కానీ వట్టి చేతులతో మిత్రుణ్ణి కలవడం బాగుంటుందా! ఇవ్వడానికి మనదగ్గర ఏముంది?" అంటూ వాపోయాడు భర్త.

అది విన్న భార్య వెంటనే ముంతలో అడుగున ఉన్న గుప్పెడు అటుకులు తీసి భర్త కొంగున మూటకట్టింది. వాటితో భర్త ప్రయాణమై ద్వారకకు చేరుకున్నాడు.

ద్వారకానగరంలో కృష్ణుడి రాజమందిరం దగ్గరికి చేరాడు. కృష్ణుణ్ణి కలవాలని రాజద్వారం దగ్గరున్న భటులకు చెప్పాడు. చిరిగిపోయిన బట్టలతో, బక్కచిక్కి ఉన్న ఇతని మాటలను భటులు నమ్మలేదు. లోపలికి పంపలేదు. "నన్ను సుదాముడు అంటారు. నేను కృష్ణుని బాల్యమిత్రుణ్ణి. ఒక్కసారి కలవడానికి వచ్చాను," అని పలికాడు. భటులు ఆశ్చర్యపోయారు. వెంటనే కృష్ణునికి సమాచారం అందించారు.

సుదాముడు వచ్చాడని భటులు చెప్పగానే కృష్ణుడు ఎంతో ఆనందపడ్డాడు. ఆశ్రమంలో సుదాముడితో కలిసి చదువుకున్న జ్ఞాపకాలు ఒక్కసారిగా గుర్తొచ్చాయి. వెంటనే తన సింహాసనం వదిలి

పాదరక్షలు కూడా లేకుండా ప్రవేశద్వారం దగ్గరికి చేరుకున్నాడు. అక్కడున్న మిత్రుణ్ణి అమాంతం గుండెకు హత్తుకున్నాడు. రాజమందిరంలోకి సాదరంగా తీసుకువెళ్ళాడు. ఆసనంమీద కూర్చోబెట్టాడు. క్షేమసమాచారాలు తెలుసుకున్నాడు. బంగారు కలశంతో నీళ్ళు తెప్పించాడు. భార్య రుక్మిణీదేవితో కలిసి సుదాముడి పాదాలు కడిగాడు. ఆ నీటిని దంపతులు ఇద్దరూ తలమీద చల్లుకున్నారు. కృష్ణుడు చందనం పూశాడు. సుదాముడి ప్రయాణపు అలసట తీరేందుకు వింజామరతో విసిరాడు. చిన్ననాటి ముచ్చట్లు గుర్తుచేసుకుంటూ ఆనందంతో మురిసిపోయాడు. "మిత్రమా నాకోసం ఏమి తెచ్చావ్?" అని ప్రేమగా అడిగాడు.

తాను తెచ్చిన అటుకులను కృష్ణునికి ఇవ్వడానికి సందేహించాడు సుదాముడు. కృష్ణుడు చిరునవ్వుతో, "మిత్రమా! నువ్వు నాదగ్గర ఏదో దాచిపెడుతున్నావు," అంటూ చొరవచేసి కుచేలుడి కొంగునున్న మూటను లాగాడు. అందులో అటుకులు ఉన్నాయి. "ప్రేమతో ఒక్క మెతుకు పెట్టినా నేను పరమాన్నంగా భావిస్తాను," అంటూ ఎంతో ప్రియంగా ఆ అటుకులు తిన్నాడు.

కృష్ణుడు సుదాముడికి మంచి విందుభోజనం పెట్టాడు. సుదాముడు మనసునిండా ఆనందాన్ని నింపుకొని నిద్రించాడు. వేకువనే శ్రీకృష్ణుని దగ్గర సెలవు తీసుకొని తన ఊరికి బయలుదేరాడు. ఇంటికి చేరాడు. తన పూరింటి స్థానంలో పెద్ద భవనం కనిపించింది. సకల ఆభరణాలతోను అతని భార్య కామాక్షి, పిల్లలూ అతనికి స్వాగతం పలికారు. సుదాముడు ఇదంతా చూసి ఆశ్చర్యపోయాడు. కృష్ణుడి అనుగ్రహంతోనే అన్ని సిరి సంపదలు తనకు వచ్చాయని గ్రహించాడు.



చిన్ననాటి స్నేహానికి విలువనిచ్చి ఆదరించిన కృష్ణుడి ఔదార్యానికి మనసులో కృతజ్ఞతలు చెప్పుకొన్నాడు. ఆతరవాత వాళ్ళ ఇంటిల్లిపాదీ ఆనందంగా జీవితం గడిపారు.

[సుదాముడంటే చాలా మందికి తెలియదు. 'కుచేలుడు' అంటే తెలుసు. పేదవాడి బట్టలు త్వరగా మాయడం, చినగడం సహజం. కాబట్టి సుదాముడికి కుచేలుడన్న పేరు వచ్చింది.]


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ
© SCERT not to be republished



# ఇవి చేయండి



## I వినండి - ఆలోచించి చెప్పండి




(అ) సుదాముడు అటుకులు తీసుకొని బాల్యమిత్రుడైన కృష్ణుడికి ఇచ్చాడు కదా. ఇలా మీరెప్పుడైనా మీ స్నేహితుడి ఇంటికి వెళ్ళినప్పుడు ఏమి తీసుకొని వెళ్ళారు?

(ఆ) మీ ఇంటికి ఎవరైనా వచ్చినప్పుడు వారిని ఎలా మర్యాద చేస్తారు? వారితో మీరు ఏం మాట్లాడతారో, ఎలా మాట్లాడతారో చెప్పండి.

(ఇ) శ్రీకృష్ణుడు, సుదాముడు మంచి మిత్రులు అని ఎలా చెప్పగలరు?

## II చదవండి - అర్థంచేసుకొని చెప్పండి - రాయండి



(అ) పాఠం మొదటి పేజీలోని చివరి పేరాను చదవండి. దాన్ని గురించి సొంతమాటల్లో చెప్పండి.

(ఆ) పాఠంలోని రెండో బొమ్మను చూడండి. దానికి సంబంధించిన వాక్యాలు పాఠంలో ఎక్కడ ఉన్నాయో చూడండి. వాటికింద గీత గీయండి.

(ఇ) కృష్ణుడి స్నేహాన్ని తెలిపే వాక్యాలు పాఠంలో ఉన్నాయి. అవి ఏవి?

(ఈ) పాఠం చదివి కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. సుదాముడు ఎవరు? అతని కుటుంబ పరిస్థితి ఏమిటి?
2. కృష్ణుడు సుదాముణ్ణి ఎలా ఆదరించాడు?
3. భటులు సుదాముణ్ణి ద్వారందగ్గర ఎందుకు నిలిపేశారు?
4. తాను తెచ్చిన అటుకులను ఇవ్వడానికి సుదాముడు ఎందుకు సందేహించాడు?
5. 'ప్రేమతో ఒక్క మెతుకుపెట్టినా నేను పరమాన్నంగా భావిస్తాను,' అంటే అర్థం ఏమిటి?

## III రాయండి



(అ) బాల్యమిత్రుల కథను సొంతమాటల్లో రాయండి.

(ఆ) మీ ఇంటికి వచ్చిన బంధువులకు మీరు ఎలా మర్యాదలు చేస్తారో రాయండి.


(ఇ) అటుకులతో ఏమేమి చేస్తారో రాయండి.

(ఈ) ఈ పాఠంద్వారా స్నేహితులు ఎలా ఉండాలని తెలుసుకున్నారు? మీరైతే మీ స్నేహితునితో ఎలా ఉంటారో రాయండి.

(ఉ) కృష్ణుడు చేసిన విందువల్ల కుచేలుడికి మనస్సు ఆనందంతో నిండింది కదా! ఇలా ఏ ఏ సందర్భాలలో మనస్సుకు ఆనందం కలుగుతుంది?

© SCERT not to be republished

## IV పదజాలం



**(అ) పాఠంలో మూడు అక్షరాల, నాలుగు అక్షరాల పదాలను గుర్తించండి. వాటిని ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.**

| | మూడు అక్షరాల పదాలు | నాలుగు అక్షరాల పదాలు |
|---|---|---|
| ఉదా :- | కృష్ణుడు | సుదాముడు |
| | ................................ | ................................ |
| | ................................ | ................................ |
| | ................................ | ................................ |
| | ................................ | ................................ |

కృష్ణుడు నగర ప్రజలకు మేలుచేశాడు.

..............................................................................................................

..............................................................................................................

..............................................................................................................

**(ఆ) మీకు తెలిసిన తినుబండారాల పేర్లు రాయండి.**

| | | | |
|---|---|---|---|
| ఉదా :- | అటుకులు | ................................ | ................................ |
| | లడ్డూలు | ................................ | ................................ |
| | ........................ | ................................ | ................................ |
| | ........................ | ................................ | ................................ |
| | ........................ | ................................ | ................................ |
| | ........................ | ................................ | ................................ |

## V సృజనాత్మకత



**(అ) శ్రీకృష్ణుడు సుదాముడికి సాదరంగా స్వాగతంపలికి అతనికి చేసిన సేవలకు సంబంధించిన సన్నివేశానికి సంభాషణ రాయండి. నాటకీకరణ చేయండి.**


**(ఆ) "మంచి పుస్తకాలు చదవడం, మంచి మిత్రులను సంపాదించుకోడం" జీవితంలో అతి ముఖ్యమైనవి. ఈ భావం వచ్చేలా కవిత / గేయం / పాట / వ్యాసం / లేఖ ఏదైనా మీ సొంతమాటలలో రాయండి.**

© SCERT not to be republished



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు




**(అ) కింది పదాలను చదవండి. వీటిని పట్టికలో సూచించిన భాషల్లో ఏమంటారో రాయండి.**

ఉదా :

| పదాలు | ఇంగ్లీషులో | హిందీలో | మీ మాతృభాషలో | ఇతరభాషల్లో |
|---|---|---|---|---|
| స్నేహితుడు | friend | దోస్త్ | | |
| తమ్ముడు | | | | |
| చెల్లెలు | | | | |
| అక్క | | | | |
| అత్త | | | | |
| మామ | | | | |
| తాత | | | | |
| అవ్వ | | | | |

**(ఆ) 'స్నేహబంధం, స్నేహంవిలువ' లాంటి స్నేహానికి సంబంధించిన కథలు సేకరించండి, చదవండి.**

## VII భాషను గురించి తెలుసుకుందాం



**(అ) కింది వాక్యాలను చదవండి. గీత గీసిన పదాలను, అక్షరాలను గమనించండి.**


1) మహమ్మద్ బడికి వెళ్లాడు.
2) రంగా రాముకు పెన్ను ఇచ్చాడు.
3) తస్లీం కూరగాయలకోసం బజారుకు వెళ్లింది.
4) పాండవులలో ధర్మరాజు పెద్దవాడు.
5) రవి సుద్దముక్కతో బొమ్మ గీశాడు.

పై వాక్యాలలో గీత గీసిన అక్షరాలు, పదాలు లేకపోతే వాక్యాలు సరైన అర్థాన్ని ఇవ్వవు. ఇవి పదాల మధ్య సంబంధాన్ని ఏర్పరుస్తున్నాయి. ఇలాంటివాటిని 'విభక్తి ప్రత్యయాలు' అంటారు.

**(ఆ) పాఠంలో మీకిష్టమైన ఐదు వాక్యాలు రాయండి. వాటిలో ఉన్న విభక్తుల కింద గీత గీయండి.**



### నేనివి చేయగలనా ?



| | | |
|---|---|---|
| 1. | బాల్యమిత్రుల కథను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | కథను ధారాళంగా, తప్పుల్లేకుండా చదవగలను. ప్రశ్నలకు సమాధానాలు రాయగలను. | ఔను / కాదు |
| 3. | బాల్యమిత్రుల కథను సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. | కథలో సూచించిన సన్నివేశానికి సంభాషణ రాసుకొని, నాటకీకరణ చేయగలను. | ఔను / కాదు |

© SCERT not to be republished

యూనిట్ 3

# 12. విహారయాత్ర

**చిత్రం చూడండి - ఆలోచించండి - మాట్లాడండి**




★ చిత్రంలో ఎవరెవరు ఏం చేస్తున్నారు?

★ పిల్లలు బస్సు ఎక్కి ఎక్కడకు వెళుతున్నారు? మీరు ఎప్పుడైనా ఇలా వెళ్ళారా? ఎక్కడికి?

★ మిమ్మల్ని విహారయాత్రకు తీసుకెళతామంటే ఏ ఏ ప్రదేశాలు చూడాలని కోరుకుంటారు?

**పిల్లలకు సూచనలు :**

★ పాఠంలోని చిత్రాలను చూడండి. చిత్రాలను గురించి మాట్లాడండి.

★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.

★ గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడిగి లేదా పదాలు - అర్థాలు అన్న పట్టికలో చూసి తెలుసుకోండి.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

శనివారం, 12 నవంబరు 2011

### ఉదయం 6 గంటలయింది.

నాకెంతో ఆనందంగా ఉంది. నేనేకాక, నా మిత్రులు శ్రీను, రఘు, సోము అందరం ఎంతో ఉత్సాహంగా ఉన్నాం. అందరం రెండు రోజుల విహారయాత్రకు వెళ్తున్నాం. మా సామాన్లు, సంచులు సర్దుకొని బడిదగ్గరికి వచ్చేసరికి రంగురంగుల బస్సు మాకోసం సిద్ధంగా ఉంది.

అందరి అమ్మానాన్నలూ వచ్చి మాకందరికీ జాగ్రత్తలు చెప్తూ ఉన్నారు. సత్యంగారు, సంగీతా టీచర్ హడావిడి పడుతున్నారు. పిల్లలకు బస్సులో సీట్లు కేటాయిస్తున్నారు. బలే బలే!.... నాకు కిటికీ దగ్గరే సీటు దొరికింది. ఎంతో గొడవ గొడవగా ఉంది. ఇక బస్సు బయలుదేరుతుందనగా మా నాన్నమ్మ ఆయాసపడుతూ పరుగెత్తుకువచ్చింది. 'ఒరే చందూ!' అంటూ కేకలుపెడుతూ నాకోసం వెదుకుతూ ఉంది. "నాన్నమ్మా!" అని నేను పిలిచేసరికి వచ్చి పెద్దపొట్లం నా చేతిలో పెట్టి "లడ్డూలూ, చక్కిలాలూరా — మరిచిపోయావు. నలుగురూ కలిసి తినండి," అన్నది. ఆమె ఆయాసపడుతూ మాట్లాడుతూ ఉంటే నాకు ఎంత బాధ కలిగిందో! మా నాన్నమ్మకు నేనంటే ఎంతో ఇష్టం. "చందూ! ఎక్కడా నీళ్ళలో దిగకు నాన్నా!" అంది నాన్నమ్మ. సరేనని తలూపాను.

మా మానుకోటనుంచి బస్సు కదిలేముందు రవి పరుగెత్తుకొని వచ్చి బస్సు ఎక్కాడు. వాడి బ్యాగును శ్రీధర్‌గారు అందుకొని పైన సర్దారు. బస్సులో పాటలు వచ్చినవాళ్ళు పాడుతూ ఉంటే తక్కినవాళ్ళు చప్పట్లు కొడుతూ గొంతు కలిపారు.

### ఉదయం 8 గంటలు అమరావతి


అమరావతిలోని బౌద్ధస్తూపం

దిగండి! దిగండి! అంటూ విజిల్ వేశారు రామంగారు. అమరావతి బౌద్ధస్తూపం ఎంత బాగుందో! ఈ స్తూపంలో బుద్ధుడి అస్థికలు ఉన్నాయట. అక్కడున్న గైడ్ మాకన్నీ చెబుతున్నాడు. గైడ్‌ని తెలుగులో మార్గదర్శి అంటారని సారు చెప్పారు. కొంతమంది చారిత్రక విషయాలను ఆసక్తితో రాసుకున్నారు. దగ్గరలో ఉన్న ధ్యానబుద్ధుడి ఎత్తైన విగ్రహాన్ని చూశాం. ఎంత పెద్దదో! ఇక్కడి మ్యూజియంకంటే నాగార్జునసాగర్‌లో ఉన్న బౌద్ధమ్యూజియం పెద్దదని గైడ్ చెప్పాడు. వెంటనే అమరేశ్వరుడి ఆలయానికి వెళ్ళాం. ఇది పంచారామాలలో ప్రసిద్ధమైన శైవక్షేత్రం. కృష్ణానది ఒడ్డున అందమైన శిల్పాలతో ఎంత విశాలంగా ఉందో! అందరం దేవుణ్ణి దర్శించుకున్నాం.


బస్సు ఎక్కేముందు నాన్నమ్మ పెట్టిన లడ్డూలు, చక్కిలాలు నేనూ సోమూ రఘూ తిన్నాం. "అందరూ వచ్చారా?" అని రామంసార్ లెక్కపెట్టుకుంటున్నారు. తరవాత ఈల వేశారు. బస్సు కదిలింది. ఉండవల్లి గుహలదగ్గరికి చేరుకున్నాం. మా ఉపాధ్యాయులు రామంగారు, శ్రీధర్‌గారు, సంగీత టీచరుగారు, సత్యంగారు అందరూ దారి చూపిస్తూంటే ఉండవల్లి గుహలన్నీ చుట్టివచ్చాం. రాతిలో తొలిచిన ఈ గుహల్లో అనంతపద్మనాభస్వామి విగ్రహం ఉంది.

బస్సు బయల్దేరింది. దారిలో మంగళగిరిలో పానకాల లక్ష్మీనరసింహస్వామి గుడి చూశాం. మంగళగిరి చేనేత చీరలకు ప్రసిద్ధి అని శ్రీధర్ గారు చెప్పారు. నేను సారును అడిగి అమ్మకు, నాన్నమ్మకు ఇక్కడి చీరలు రెండు కొనిపించుకొని సంచిలో పెట్టుకున్నాను.

## మధ్యాహ్నం 2 గంటలకు విజయవాడ

ఇక్కడే మేము భోజనాలు చేశాం. మంగళగిరినుంచి విజయవాడ రావాలంటే ప్రకాశం బ్యారేజి దాటాలి. నేనున్న కిటికీలోనుంచి చూస్తే మన్నుతిన్న పాము పడుకొని ఉన్నట్లుంది. మమ్మల్ని బస్సు దిగి బ్యారేజి చూడమని 15 నిమిషాల్లో తిరిగి రమ్మని అన్నారు. నాకైతే చాలాసేపు నిలబడాలనిపించింది కానీ ఎండ మండిపోతున్నది.

విజయవాడలోని కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజి





విజయవాడలో కనక దుర్గమ్మ గుడి

ఆ ఎండలోనే మెట్లెక్కి కనకదుర్గమ్మ ఆలయాన్ని చేరి అమ్మవారిని దర్శించుకొని త్వరత్వరగా కిందికి వచ్చాం. రాత్రి విజయవాడలోనే పడుకొన్నాం.

## ఆదివారం 13, నవంబర్ 2011



కొత్తగూడెంలోని సింగరేణి బొగ్గు గనులు

విజయవాడలో ఉదయం అల్పాహారం తిని, పది గంటలకు కొత్తగూడెం చేరుకున్నాం. కొత్తగూడెంలో మేము బొగ్గుగనులు చూశాం. నిజానికి స్కూలు పిల్లలకు అనుమతి లేదట. మా ప్రధానోపాధ్యాయులు అక్కడి ఏరియా మేనేజరుగారికి లేఖ రాసి ప్రత్యేక అనుమతి తీసుకున్నారు. బొగ్గుగని లోపలకూ వెళ్ళివచ్చాం. రెండు వైపులా బొగ్గుగోడలు కనపడుతున్నాయి. తవ్విన బొగ్గును ట్రాలీలలో నింపి బయటకు తీసుకొని వస్తారు. లోపల కార్మికులందరూ లైట్లున్న ఇనుపటోపీలు (హెల్మెట్లు) ధరించిఉన్నారు. తవ్విన ఈ బొగ్గు థర్మల్ విద్యుత్ కేంద్రాలకు పంపుతారనీ దానితో విద్యుత్తు ఉత్పత్తిచేస్తారనీ మా ఉపాధ్యాయులు చెప్పారు. అక్కడినుంచి భద్రాచలం వెళ్ళాం.

## సాయంకాలం 4.45 గంటలకు భద్రాచలం

కొత్తగూడెంనుంచి భద్రాచలం వెళ్ళాలంటే గోదావరిమీద ఉన్న రోడ్డువంతెనను దాటాలి. భద్రాచలం పట్టణంలో ప్రవేశించేటప్పుడు పెద్ద హనుమంతుడి విగ్రహం మనల్ని రమ్మని పిలుస్తున్నట్లుగా ఉంటుంది.

భద్రాచలం రాములవారి గుడి



''రామాలయం మూసేస్తారు; త్వరగా నడవండని ఉపాధ్యాయులు మమ్మల్ని తొందరపెట్టారు. సీతారాములను దర్శించుకున్నాం. ఈ దేవాలయాన్ని తానీషాకాలంలో తహసీల్దారుగా పనిచేసిన కంచర్ల గోపన్న కట్టించాడని సంగీత టీచరు చెప్పారు.

© SCERT not to be republished

అందుకే అతనికి 'భక్త రామదాసు' అని పేరు వచ్చిందట. "ఈ పేరున్న సినిమా మీరు చూడలేదా?" అని శ్రీధర్ గారు అడిగారు. "చూడలేదు" అని చెప్పాను.

గుడినుంచి బయటికి వచ్చి గోదావరి ఒడ్డుకు బయల్దేరాం. గోదావరి నదిని చూశాం. గోదావరి కట్ట మీద అందమైన విగ్రహాలు ఏర్పాటు చేశారు. రాత్రి లైట్ల వెలుతురులో కట్ట మీద నడుస్తుంటే ఎంత బాగుందో! రాత్రి భద్రాచలంలోని రామసదనంలో భోజనాలు చేశాం. ఆ రాత్రికి భద్రాచలంలో బసచేశాం.

### సోమవారం, 14 నవంబర్ 2011

నర్సంపేట దగ్గర పాకాల చెరువు



ఉదయం 5 గంటలకే లేచి 6 గంటలలోపున అందరం తయారయాం. బస్సెక్కి ముందుగా 'పర్ణశాల'కు చేరుకున్నాం. ఇక్కడే సీత బంగారులేడిని చూసిందని చెప్తారు. ఆ కథను వివరించే బొమ్మలు అక్కడఉన్నాయి. అక్కడినుంచి బయలుదేరి పాల్వంచమీదుగా ప్రయాణం చేసేటప్పుడు అక్కడున్న పెద్ద థర్మల్ విద్యుత్‌కేంద్రం కనపడింది. ఇక్కడినుంచి విద్యుత్తు సరఫరా చేస్తారని ఉపాధ్యాయులు చెప్పారు. అక్కడినుంచి ఇల్లెందుమీదుగా 'పాకాల' చెరువుకు చేరుకున్నాం. పాకాలచెరువు పెద్దగా సముద్రంలా కనపడింది. మరో పక్క అభయారణ్యం ఉంది. ఇది వన్యమృగ సంరక్షణ కేంద్రం. వన్యమృగాలు అంతరించిపోతున్నాయి కాబట్టి వాటిని రక్షించుకోవాలని ఇటువంటి కేంద్రాలు పెడతారని సత్యంగారు చెప్పారు. పాకాల చెరువు దగ్గరే మధ్యాహ్నం భోజనం చేశాం. భోజనం తరవాత వరంగల్లు బయలుదేరాం.

### సాయంత్రం 5.00 గంటలు

హనుమకొండలో వెయ్యి స్తంభాల గుడి



హనుమకొండలో వెయ్యిస్తంభాల గుడి చూశాం. ఒకప్పటి ప్రసిద్ధమైన శివాలయం ఇది. పక్కనే ఒక కోనేరు ఉంది. అందులో నీళ్ళు పెద్దగా ఏమీ లేవు. దేవాలయం ఎదుట ఒక పెద్ద మండపం ఉంది. రెండింటి మధ్యా ఒక నల్లని ఎత్తైన నంది విగ్రహం ఉంది. మొదట నేను, నిజంగానే అక్కడ శివుడి నంది కూర్చుని ఉంది అనుకున్నాను. చీకటి పడేవరకు వెయ్యి స్తంభాల గుడిలోనే తిరిగాం. హనుమకొండలో భోజనం చేశాం. తరవాత ప్రతాపరుద్ర హిందుజా నక్షత్రశాలలో మాకోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ప్రదర్శన చూశాం. తరవాత పక్కనే ఉన్న భద్రకాళి గుడికి కూడా వెళ్లాం. అమ్మవారిని దర్శించుకున్నాం. గుడిపక్కనే పెద్ద చెరువు ఉంది. గుడిలో కూర్చుని చెరువును చూస్తుంటే అలాగే కూర్చోవాలని అనిపించింది. రాత్రి వరంగల్లులోనే భోజనాలుచేసి పడుకున్నాం.

**మంగళవారం, 15 నవంబర్ 2011**


కాకతీయ ద్వారం (ఓరుగల్లు కోట)

ఉదయం అల్పాహారంతిని వరంగల్లు కోటకు బయలుదేరాం. కాకతీయుల కోటముందు కందకాలు తవ్వి తరవాత ఒక మట్టికోట నిర్మించారని, మట్టికోట దాటినతరవాత రాతికోట వస్తుందని మేస్టరుగారు చెప్పారు. మట్టికోట దాటినతరవాత 'కాకతీయ ద్వారం' కనపడింది. ఈ ద్వారం బొమ్మని మనం చాలా పుస్తకాల్లో చూశాం. లోపలదీన్ని దాటి వెళ్తే ఒకచోట శిల్పాలన్నీ అమర్చిఉన్నాయి. చాలావరకు విరిగిపోయి ఉన్నాయి. మనం మన చారిత్రక అవశేషాలను సరిగా కాపాడుకోకపోతే మనకు చరిత్ర తెలియదు. దీన్ని ఓరుగల్లు అని, ఏకశిలానగరం అని పిలిచేవారు పూర్వం. ఆ పెద్దరాయి మీదకెక్కి చూస్తే వరంగల్లు నగరం ఎంత అందంగా కనపడిందో!


మధ్యాహ్నం భోజనాలయిన తరవాత మా ఊరికి తిరుగుప్రయాణం మొదలయింది. బస్సులోనే నిద్రపోయాం. ఖమ్మంమీదుగా రాత్రికి మా ఊరు చేరుకున్నాం. ఇది మాకు మరపురాని విహారయాత్ర!



## ఇవి చేయండి



## I వినండి - ఆలోచించి చెప్పండి




(అ) పాఠంలోని చిత్రాలు చూడండి. వాటి గురించి మాట్లాడండి.

(ఆ) మీరెప్పుడైనా విహారయాత్రకు వెళ్ళారా? మీరేమి చూశారో చెప్పండి.

(ఇ) విహారయాత్రకు వెళ్లేటప్పుడు వెంట ఏమేమి తీసుకొని వెళ్లాలి? ఏం జాగ్రత్తలు తీసుకోవాలి?

(ఈ) విహారయాత్ర విశేషాలను రాసుకున్నవారు ఎవరు? ఇలా రాయటాన్ని ఏమంటారు? మీరు కూడా ఇలా ఎప్పుడైనా రాశారా? వేటి గురించి రాశారు?

## II చదవండి - అర్థంచేసుకొని చెప్పండి - రాయండి



(అ) పాఠం చదవండి. కింది పట్టికను పూరించండి.

| | వారం | నెల | తేది | సమయం | సందర్శించిన ప్రాంతం |
|---|---|---|---|---|---|
| ఉదా: | శనివారం | నవంబర్ | 12 | ఉదయం 8 గంటలు | అమరావతి |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |

© SCERT not to be republished

**(ఆ) పాఠంలోని చివరి పేరాను చదవండి. దాని ఆధారంగా నాలుగు ప్రశ్నలు రాయండి.**

**(ఇ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. విహారయాత్రకు ఏ పాఠశాల నుండి వెళ్లారు? పిల్లలతో పాటు ఉపాధ్యాయులు ఎవరెవరు వెళ్లారు?
2. విహారయాత్రలో అమరావతికి వెళ్ళి అక్కడ ఏమేమి చూశారు?
3. కొత్తగూడెం థర్మల్ విద్యుత్‌కేంద్రం విశేషాలు రాయండి.
4. వరంగల్‌లో పిల్లలు ఏ ఏ ప్రాంతాలు సందర్శించారు?
5. ఏ ఏ నదులు, చెరువులు చూశారు? వాటిని ఎక్కడెక్కడ చూశారు?

## III రాయండి




**(అ) మీరు ఏ ఏ ఊళ్ళు, ప్రదేశాలు చూశారు? మీ ప్రయాణ విశేషాలను, దారిలో జరిగిన ప్రత్యేక సంఘటనలు రాయండి.**


**(ఆ) "విహారయాత్ర" అంటే ఏమిటి? దానివల్ల కలిగే ప్రయోజనాల గురించి పది వాక్యాలు రాయండి.**

**(ఇ) మన రాష్ట్రంలో చూడదగిన ప్రదేశాలు ఏవి? అవి ఎక్కడెక్కడ ఉన్నాయో రాయండి.**

## IV పదజాలం



**(అ) కింది పదాలను చదవండి. భద్రాచలాన్ని గురించి మిగతా పదాలు ఆధారంగా ఒక పేరా రాయండి.**





**(ఆ) అర్థాల ఆట :**

1. చిన్నచిన్న కార్డులు 20 తీసుకోవాలి. ఒక్కొక్క కార్డుపై ఒక్కొక్క పదం చొప్పున 10 కార్డులమీద పాఠంలోని పదాలు రాయాలి. మిగిలిన పదికార్డులమీద ఆ పదాల అర్థాలను ఒక్కొక్క కార్డుమీద ఒక్కొక్కటి చొప్పున రాయాలి.
2. గుండ్రంగా కూర్చుని మధ్యలో కార్డులను ఒకదాని పక్కన ఒకటి బోర్లించిపెట్టాలి.

© SCERT not to be republished

3. ఒకరు వచ్చి రెండు కార్డులు తీసుకోవాలి. అవి పదం - దాని అర్థం ఉన్న కార్డులైతే తీసుకోండి. లేకపోతే మళ్ళీ బోర్లించిపెట్టండి.
4. ఇలా వరసగా కార్డులు అయిపోయేవరకు ఆటను కొనసాగించండి.
5. ఎక్కువ కార్డులు వచ్చినవారిని విజేతగా ప్రకటించాలి.

## V సృజనాత్మకత



**(అ) ఉదయం లేచినప్పటినుంచి పడుకోబోయేవరకు మీరు ఏమేమి చేశారో దినచర్య రాయండి.**

**(ఆ) పాఠశాలలోని కథలపుస్తకాలలో మీరు చదివిన కథల గురించి డైరీలో రాయండి.**

## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు



**(అ) మీకిష్టమైన ప్రదేశాన్ని చూడటానికి ముందుగా ప్రణాళికను సిద్ధం చేయండి.**

**(ఆ) ముఖ్యమైన దర్శనీయ ప్రదేశాల ఫోటోలు సేకరించి, గోడపత్రికలో పెట్టండి. (ఆల్బమ్ తయారీ)**

## VII భాషను గురించి తెలుసుకుందాం



**(అ) కింది వాక్యాలను చదవండి. గీత గీసిన అక్షరాలను గమనించండి.**

పరుగు పందెంలో రాణికి మొదటి బహుమతి వచ్చింది, అంజుకు రెండవ బహుమతి వచ్చింది.

పై వాక్యాలలో రాణి అనే పదంలో చివరి అక్షరానికి ( ి ) ఉంది. కాబట్టి **కి** అనే విభక్తి ప్రత్యయం వస్తుంది. అంజు అనే పదంలో చివరి అక్షరానికి (ు) ఉంది. కాబట్టి **కు** అనే విభక్తి ప్రత్యయం వస్తుంది.

**(ఆ) కింది వాక్యాలలోని పదాలకు కి, కు లను సరైన చోట ఉంచండి.**

1) రహీం, మనీషా .... పుస్తకం ఇచ్చాడు.
2) హసీనా ఇంటి .... వెళ్లింది.
3) గీత .... లడ్డూలంటే ఇష్టం.
4) నళిని .... , మస్తాన్ .... అందరికంటే ఎక్కువ మార్కులు వచ్చాయి.



## నేనివి చేయగలనా ?



| | |
|---|---|
| 1. నేను చూసిన ప్రదేశాల గురించి మాట్లాడగలను. | ఔను / కాదు |
| 2. విహారయాత్ర విశేషాలను ధారాళంగా చదవగలను. | ఔను / కాదు |
| 3. ఆధారాలతో ఒక పేరా రాయగలను. | ఔను / కాదు |
| 4. దినచర్య రాయగలను. | ఔను / కాదు |

© SCERT not to be republished


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

యూనిట్ 3

# అమ్మ ఎవరు?

చదువు - ఆనందించు

కోడిపిల్ల తన తల్లికోసం చూసింది. తల్లి కనిపించలేదు. దానికి దుఃఖం వచ్చింది. ఏడుస్తూ కూర్చుంటే ఏం లాభం? అనుకుంది. అమ్మకోసం వెదకడం ప్రారంభించింది.






బుడిబుడి నడకలతో నడుస్తూండగా దారిలో ఒక ఆవు కనిపించింది. తనవైపే పట్టిపట్టి చూస్తున్న కోడిపిల్లను, "ఏం కావాలమ్మా నీకు?" అని అడిగింది ఆవు. కోడిపిల్ల ముద్దు ముద్దు మాటలతో "నాకు అమ్మ కావాలి!" అంది. ఆవు జాలిపడింది. "మీ అమ్మ నాకంటె చాలా చిన్నగా ఉంటుంది. నేను ఆవును" అని చెప్పింది. "ఓహో, మా అమ్మ నీకంటె చిన్నగా ఉంటుందా?" అని కోడిపిల్ల, ముందుకు వెళ్ళింది. దానికి దారిలో ఒక మేక కనిపించింది. దాని దగ్గరికిపోయి, "నువ్వు ఆవుకంటె చిన్నగా ఉన్నావు. మా అమ్మవు నువ్వేనా?" అని అడిగింది. ఆవుకంటే చిన్నగా ఉన్నాను నిజమేగాని నాకు నాలుగు కాళ్ళు ఉన్నాయి. మీ అమ్మకు నీలాగ రెండే కాళ్ళు ఉంటాయి, రెక్కలు ఉంటాయి," అని చెప్పింది.



కోడిపిల్ల ఆలోచిస్తూ ముందుకు వెళ్ళింది. కొంత దూరంలో 'కావ్ కావ్' అంటూ ఓ కాకి కనపడింది. మేక మాటలు గుర్తుకు తెచ్చుకొని దగ్గరికెళ్ళి నీకు రెండు కాళ్ళు, రెక్కలు ఉన్నాయి. మా అమ్మవు నువ్వేనా?" అని అడిగింది. ఆ కాకి, "నువ్వన్నది నిజమే కానీ నేను చాలా ఎత్తుకు ఎగరగలను. మీఅమ్మ నాకంటే పెద్దగా ఉంటుంది. కాళ్ళు కూడా పొడుగ్గా ఉంటాయి. మీ అమ్మ నాలాగ అరవదు," అంది. ఆ మాటకు కోడిపిల్ల, "అయ్యో!" అనుకుంది. అది గమనించిన కాకి "నువ్వు నిరాశ పడకు. ముందుకు వెళ్ళి చూడు. తప్పకుండా కనిపిస్తుంది, మీ అమ్మ," అని చెప్పి ఎగిరిపోయింది.



కాకి మాటలతో కోడిపిల్లకు ఉత్సాహం వచ్చింది. చెరువు గట్టుమీద నడుస్తూ వెళ్ళింది. 'క్వాక్ క్వాక్' అంటూ బాతు కనపడింది. కాకి చెప్పిన పోలికలు బాతులో కనిపించేసరికి కోడిపిల్ల ఎంతో సంబరపడి, "అమ్మా" అంటూ బాతు దగ్గరికి పరుగెత్తింది. "అయ్యో, తల్లీ! నేను మీ అమ్మను కానమ్మా!" అంది. ఆ మాటలకు కంగుతిన్న కోడిపిల్ల వెక్కి వెక్కి ఏడ్చింది. అది చూసిన బాతు గుండె కరిగింది. లాలనగా, "ఎందుకమ్మా ఏడుస్తున్నావు! చెప్పు!" అని అడిగింది. కోడిపిల్ల జరిగిందంతా చెప్పింది. ఆ మాటలు విన్న బాతు, "మీ అమ్మ నాలాగ అరవదు కొ...క్కొ...కొ...క్కో" అంటుంది అని చెప్పింది.

చెట్టు పైనుంచి సంభాషణ అంతా వింటున్న పావురం, కోడిపిల్లకు సహాయం చేయాలనుకుంది. ఈ చెరువు గట్టు చివరికి వెళ్ళు! అక్కడ మీ అమ్మ కనిపించవచ్చు!" అని చెప్పి వెళ్ళిపోయింది. పావురం చూపించిన దిశగా కోడిపిల్ల వెళ్ళింది. కాస్తంత దూరం వెళ్ళేసరికి 'కొ...క్కొ....కొ...క్కో' అన్న శబ్దం వినిపించేసరికి కోడిపిల్ల ఆనందంగా అటువైపు చూసింది. "రెండు కాళ్ళు, రెండు రెక్కలతో కాకి కంటే పెద్దగా ఉండి 'కొ....క్కొ....కొ....క్కో' అంటున్నది కాబట్టి తప్పకుండా మా అమ్మే అయి ఉంటుంది," అని నిశ్చయించుకొంది.



"అమ్మా! అమ్మా! చిక్...చిక్...చిక్..." అంటూ పిలిచింది. ఆ పిలుపుకు వెనుదిరిగి చూసిన కోడి, కోడిపిల్లను చూసి ఆగింది. తన పిల్లను గుర్తించింది. దగ్గరికి రమ్మంది. కోడిపిల్ల ఆనందానికి అవధులు లేవు. సంతోషంగా చిట్టి చిట్టి రెక్కలతో ఎగురుతూ తన తల్లిని చేరుకుంది.

తనపిల్ల తననే వెదుకుతూ ఎలా చేరుకుందో తెలుసుకోవాలని తల్లికోడి కుతూహలంగా ప్రశ్నించింది పిల్లను. కోడిపిల్ల జరిగిందంతా తల్లికి వివరించింది. ఆ మాటలు విన్న తల్లికోడి, తన పిల్ల తెలివికి, పట్టుదలకు అబ్బురపడింది.

© SCERT not to be republished

# యూనిట్ 4 13. ఒక నది ఆత్మకథ

**చిత్రం చూడండి - ఆలోచించండి - మాట్లాడండి**



★ చిత్రం చూడండి. చిత్రంలో ఏమేమి కనిపిస్తున్నాయి?

★ నదినీరు కలుషితమైతే వచ్చే నష్టాలేవి?

★ నదులు కలుషితం కాకుండా ఉండడానికి మనం ఏం చెయ్యాలి?

**పిల్లలకు సూచనలు :**

★ పాఠంలోని చిత్రాలను చూడండి. చిత్రాలను గురించి మాట్లాడండి.

★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.

★ గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడిగి లేదా పదాలు - అర్థాలు అన్న పట్టికలో చూసి తెలుసుకోండి.

చూస్తే కనిపిస్తాను
దారి ఇస్తే పరుగులు తీస్తాను
పట్టుకుంటే జారిపోతాను
పట్టుపడితే కట్టుబడతాను.
ఉన్నప్పుడు నేనంటే అందరికీ అలుసే,
కాని లేనప్పుడు అందరూ



నాకోసం అల్లాడిపోతారు. నాపేరు
గోడలో ఉంది; దాపులో ఉంది.
వరసలో ముందే ఉంది;
దారిలో వెనకబడింది;
మరి చెప్పుకోండి చూద్దాం, నేనెవరినో.... కష్టంగా ఉందా?

పోనీ, నేనే చెబుతాను — మీ గోదావరిని. మీకు తెలుసు, నా పేరు. నన్ను గురించిన సమాచారమూ విశేషాలూ పుస్తకాల్లో, పత్రికల్లో మీరు చాలాసార్లు చదివి ఉంటారు; టీ.వీ.లలో, సినిమాలలో చూసే ఉంటారు.

నేను మహారాష్ట్రలోని త్ర్యంబకేశ్వరం సమీపంలోని పడమటి కనుమల్లోని బ్రహ్మగిరి కొండల్లో పుట్టాను. అక్కడినుంచి తూర్పుదిశగా 1465 కి.మీ. ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తాను. మార్గమధ్యంలో మిమ్మల్నందరినీ కలుసుకొనే అవకాశం ఇలా కలిగింది నాకు. వేలాది సంవత్సరాలుగా స్వచ్ఛంగా, పవిత్రంగా సాగుతున్న నా మనుగడకు కాలుష్యం ఒక ప్రమాదంగా తయారైంది, ఇప్పుడు.


పరిశ్రమల వ్యర్థపదార్థాలు, పురుగుల మందులు, రసాయనిక ఎరువులు తదితర పదార్థాలవల్ల నేను మురికిదాన్ని అయిపోతున్నాను. మహారాష్ట్రలోని ఔరంగాబాద్, పైఠణ్ మొదలైన పట్టణాల మురికితోపాటు ఆంధ్రప్రదేశంలోని వందలాది పరిశ్రమల వ్యర్థపదార్థాలు చిన్న చిన్న నదులద్వారా, కాలువల ద్వారా వచ్చి నాలో కలిసిపోతున్నాయి. వివిధ ప్రాంతాలలోని పరిశ్రమల వ్యర్థపదార్థాలు, రసాయనాలూ, పట్టణాల, పంటపొలాల మురుగునీరూ నాలో చేరడంవల్ల నేను నిలువెల్లా కలుషితమై పోతున్నాను. పంటలకోసం వినియోగించే పురుగుమందుల, రసాయనిక ఎరువుల అవశేషాలు కూడా నాలోనే కలుస్తున్నాయి. హైదరాబాదు, సికింద్రాబాదు, పటన్‌చెరువు పారిశ్రామిక వాడల్లో వందకు పైగా పరిశ్రమల వ్యర్థపదార్థాలు నక్కవాగులో కలుస్తున్నాయి. నక్కవాగు మంజీరానదిలో కలుస్తుంది.

మంజీర నాలో కలవడంవల్ల నేను తీవ్రంగా కలుషితమవుతున్నాను. ఈ కారణాలవల్ల నా స్వచ్ఛతకూ, పవిత్రతకూ భంగం కలుగుతూంది. నా నీళ్ళు తాగడంవల్ల పశువులు, మనుషులూ అనారోగ్యం పాలవుతారని నేను కలత చెందుతున్నాను. నా నీటిలో పెరిగిన గడ్డి తిన్న పశువుల పాలుకూడా కలుషితం అవుతున్నందుకు నాకు దుఃఖం కలుగుతూంది. నా జలాలలో స్నానంచేయడం పవిత్రంగా భావించే భక్తులు కూడా ఈ కాలుష్యం బారిన పడుతున్నారు. ఎంతో పేరుపొందిన 'పొలస' చేపలకూ ఈ కాలుష్యం బెడద సోకింది. ప్రతి ఏటా శ్రావణమాసంలో సముద్రంనుంచి నా ప్రవాహంలోకి ఎదురు ఈదుతూ వచ్చి ధవళేశ్వరం ఆనకట్ట దిగువకు చేరుకొనే 'పొలస' చేపలను మాంసాహారప్రియులు అధిక ధర చెల్లించి కొంటారు. అలాంటి పొలస చేపలకూ కాలుష్యం సోకడంతో వాటి సంఖ్య తగ్గుతూందని పాపం జాలరులు ఆందోళన చెందుతున్నారు. ఒక పొలస చేపలే కాదు, అనేక జలచరాలకు కూడా ఈ బాధ తప్పడం లేదు. కొందరు పర్యటకులు తాము వినియోగించిన ప్లాస్టిక్ సీసాలూ గ్లాసులూ కవర్లూ నాలోకి విసిరేస్తూ ఉండటంవల్ల కూడా నేను మరింత మురికిగా అవుతున్నాను. జంతువుల కళేబరాలను నాలో పడేయడం, మనుషులు కాలకృత్యాలు తీర్చుకోడం లాంటి కారణాలు మీకు తెలిసినవే!

పిల్లలూ...! ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో బాధలున్నాయి. ఆ బాధల్ని అలా కాసేపు మరిచిపోయి నాగురించి మీరు తెలుసుకోవాల్సిన విశేషాలూ వివరాలూ కూడా చెబుతాను వినండి.


శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్

**'త్ర్యంబకేశ్వరం'**లో పుట్టిన నేను నాసిక్, ఔరంగాబాద్, పైఠణ్, నాందేడ్ పట్టణాల ప్రజలను పలకరిస్తూ నిజామాబాద్ జిల్లాలోని **'కందకుర్తి'** అనే గ్రామందగ్గర ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించాను. నా ప్రయాణంలో ఆంధ్రప్రదేశ్‌లోని మంచిర్యాల, గోదావరిఖని, మణుగూరు, కొవ్వూరు, రాజమండ్రి పట్టణాలున్నాయి. బాసర, ధర్మపురి, మంథని, కాళేశ్వరం, భద్రాచలం వంటి పుణ్యక్షేత్రాలు నా ఒడ్డున వెలిశాయి. మహారాష్ట్రలోని జయక్‌వాడి, బాబ్లి, ప్రాజెక్టులతో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీరాంసాగర్, ధవళేశ్వరం సాగునీటి ప్రాజెక్టుల ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నాను. సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడు ధవళేశ్వరందగ్గర నాకు ఆనకట్ట కట్టాడు; ఆంధ్రప్రదేశ్‌ను అన్నపూర్ణగా మార్చాడు. ధవళేశ్వరంలో నా ఒడ్డున కాటన్ మ్యూజియం ఉంది. నేను వెళ్ళే దారిలో పాపికొండలు, పట్టిసీమ, కోనసీమ ప్రాంతాలు పర్యటకులను అలరిస్తున్నాయి. గోదావరీ నదిలో పడవప్రయాణాన్ని ప్రయాణికులెప్పుడూ మరిచిపోలేరు. నాగురించి కవులూ రచయితలూ ఎన్నో కావ్యాలూ నవలలూ కథలూ రాశారు. నా పేరుతో సినిమాలు కూడా వచ్చాయి. సినిమా షూటింగులకు కూడా నన్ను వినియోగించుకుంటూ ఉంటారు. అందరికీ అన్ని వేళలా ఉపయోగపడుతూ ఉండాలనేది నా ఆకాంక్ష!


సర్ ఆర్థర్ కాటన్ మ్యూజియమ్, ధవళేశ్వరం

నన్ను కాపాడుకోడం భావిపౌరులుగా మీ బాధ్యత అని మరిచిపోకండి! ఉంటాను.... పిల్లలూ... బై.. బై...

© SCERT not to be republished


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



## ఇవి చేయండి



### I వినండి - ఆలోచించి చెప్పండి



(అ) గోదావరి నది గురించి సొంతమాటల్లో చెప్పండి.

(ఆ) మీ ప్రాంతంలో ప్రవహించే వాగులను, నదులను గురించి చెప్పండి. నదులలోకి నీరు ఎక్కడినుంచి వస్తుంది?

(ఇ) నది తనను గురించి చెప్పింది కదా! మీరు మీగురించి చెప్పండి.

(ఈ) నది తన బాధల గురించి ఏమేమి చెప్పింది? దానికి కారణమెవరు?

### II చదవండి - అర్థంచేసుకొని చెప్పండి - రాయండి



(అ) కింది పాట చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

ఉప్పొంగి పోయింది గోదావరి తాను
తెప్పున్న ఎగసింది గోదావరి
కొండల్లా ఉరికింది కోనల్లు నిండింది
ఆకాశగంగతో హస్తాలు కలిపింది ॥ఉప్పొంగి॥

అడవి చెట్లన్నిటిని జడలోన తురిమింది
ఊళ్ళు దండలు గుచ్చి మెళ్ళోన తాల్చింది ॥ఉప్పొంగి॥

వడులతో, సుడులతో, గరువాల నడలతో
పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తు వచ్చింది ॥ఉప్పొంగి॥

1. గోదావరి ఎలా ఉరికింది?
2. గోదావరి నడకలు ఎలా ఉన్నాయి?
3. గోదావరి ఎవరితో చేతులు కలిపింది?
4. గోదావరి మెడలో ఏం వేసుకుంది?

(ఆ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. పాఠం ప్రారంభంలోని వాక్యాలు చదవండి. "గోదావరి" గురించిన పొడుపు కథలో అది ఎక్కడ ఉందో గుర్తించండి.
2. గోదావరినది పుట్టుపూర్వోత్తరాలను తెలపండి.
3. గోదావరినది ఎందుకు బాధపడింది? ఏమని బాధపడింది?

©SCERT not to be republished

## III రాయండి




(అ) నదిలో రకరకాల జీవరాశులు ఉంటాయి. వాటిమీద ఆధారపడి ఎంతోమంది బతుకుతున్నారు. నదులమీద ఆధారపడి ఎవరెవరు బతుకుతున్నారో ఆలోచించి రాయండి.

(ఆ) గోదావరీనదిని గురించి మీ సొంతమాటల్లో రాయండి.

(ఇ) నదులలోని నీటివల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఈ నీరు కాలుష్యానికి గురౌతున్నది. ఇలా జరగకుండా ఉండాలంటే మనం ఏంచేయాలో ఆలోచించి రాయండి.

## IV పదజాలం



(అ) కింది పదాలను ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.

కాలుష్యం : ..........................................................................................

విషాదం : ..........................................................................................

వ్యర్థపదార్థాలు : ..........................................................................................

నదులు : ..........................................................................................

(ఆ) కింది గళ్ళలోని నదులను గుర్తించండి, రాయండి.

| | | | | |
|---|---|---|---|---|
| న్నా | త్ర | పు | హ్మ | బ్ర |
| పె | గో | దా | వ | రి |
| కృ | న | ము | య | తుం |
| ష్ణ | మూ | సీ | కా | గ |
| న | ధు | సిం | వే | భ |
| ది | గం | గ | రి | ద్ర |

.......................................
.......................................
.......................................
.......................................
.......................................
.......................................

## V సృజనాత్మకత




అ) నది తనగురించి తాను చెప్పుకున్నది కదా! ఇలా చెప్పుకోడాన్ని ఆత్మకథ అంటారు. అలా మీరు మీ ఊరిలో ఉన్న నది లేదా కాలువ లేదా బావి లేదా ఏదైనా ఒకదాని ఆత్మకథను రాయండి.

ఆ) నదిలో నిండుగా నీళ్ళు కనిపించి కళకళలాడుతూ ఉంటే మీకెలా అనిపిస్తుందో వర్ణించి రాయండి.

© SCERT not to be republished

## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు



**(అ) నదికి సంబంధించిన పాటలు, పద్యాలు, కథలు మొదలయినవి సేకరించండి. వాటిని రాసి ప్రదర్శించండి. చదివి వినిపించండి.**

## VII భాషను గురించి తెలుసుకుందాం



**(అ) కింది వాక్యాలు చదవండి. గీత గీసిన అక్షరాలను గమనించండి.**

వనజ తన పుస్తకం ఇమ్మని రజనిని అడిగింది.

పాట బాగా పాడావని రంగడిని అందరూ మెచ్చుకున్నారు.

ఆనంద్, రాజును ఆడుకోడానికి పిలిచాడు.

పై వాక్యాలలో పదంచివరి అక్షరానికి (ి) వచ్చినప్పుడు 'ని' అనే విభక్తి ప్రత్యయం వచ్చింది. అట్లాగే అక్షరానికి చివర ( ు ) వచ్చినప్పుడు 'ను' అనే విభక్తి ప్రత్యయం వచ్చింది.

**కింది వాక్యాలలో 'ని', 'ను'లను సరైన చోట ఉంచండి.**

1. జాన్సన్, గోపీ ..... పెన్ను కావాలని అడిగాడు.
2. సినిమాకి వెళ్దామని మామయ్య సీత ..... పిలిచాడు.
3. అర్థంకాని విషయాల గురించి ఉపాధ్యాయురాలి .... అడిగి తెలుసుకోవాలి.
4. ఈ అడ్రసు గురించి ఎవరి .... అడిగి తెలుసుకోవాలి?

**(ఆ) కింది ఖాళీలను సరైన విభక్తులతో పూరించండి.**

1. తోట ...... అందమైన చెట్లు ఉన్నాయి.
2. కృష్ణానది మన రాష్ట్రాని ...... సంబంధించిన నది.
3. సుహాసిని ...... లక్ష్మి విశాఖపట్నం వెళ్ళింది.
4. బషీర్ ...... తాతయ్య జూకు తీసుకెళ్ళాడు.
5. ఆగష్టు 15వ తేదీన గాంధీజీ ...... ఫాతిమా ఉపన్యసించింది.



### నేనివి చేయగలనా ?



| | | |
|---|---|---|
| 1. | పాఠంలో నది ఆత్మకథను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను/కాదు |
| 2. | గోదావరి ఆత్మకథను ధారాళంగా చదవగలను. | ఔను/కాదు |
| 3. | గోదావరిని గురించి సొంతమాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. | కాలువ / బావి గురించి ఆత్మకథ రాయగలను. | ఔను/కాదు |

© SCERT not to be republished

యూనిట్ 4

# 14. చెట్టు సాక్ష్యం

**చిత్రం చూడండి - ఆలోచించండి - మాట్లాడండి**



★ చిత్రం చూడండి. చిత్రంలో ఏం జరుగుతూ ఉందో చెప్పండి.

★ ఇలాంటి సన్నివేశం ఎక్కడ జరుగుతుంది? ఎందుకోసం జరుగుతుంది?

**పిల్లలకు సూచనలు :**

★ పాఠంలోని చిత్రాలను చూడండి. చిత్రాలను గురించి మాట్లాడండి.

★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.

★ గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడిగి లేదా పదాలు - అర్థాలు అన్న పట్టికలో చూసి తెలుసుకోండి.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



అవంతీపురంలో ధనగుప్తుడు, నందిగుప్తుడు అనే వర్తకులు ఉండేవాళ్ళు. వాళ్ళు పొరుగుదేశాలకు వెళ్ళి వ్యాపారంచేసేవాళ్ళు. వాళ్ళ వ్యాపారం మూడు పువ్వులూ ఆరు కాయలుగా అభివృద్ధి చెందింది. బాగా డబ్బు సంపాదించారు. తమ నగరానికి తిరిగి వచ్చారు. వ్యాపారం వాళ్ళకు వెన్నతో పెట్టిన విద్య. ఇద్దరూ మరో వ్యాపారం చేయాలనుకున్నారు. అంత వరకు సొమ్ము దాచాలి. "ధనానికి దాపరికం, సేద్యానికి వెల్లడి" అన్నారు కదా! సొమ్ము ఎక్కడ దాచాలాని ఆలోచించారు. చివరికి ఊరిబయట చెట్టుకింద దాచాలనుకున్నారు. ఇద్దరూ కలిసి వెళ్ళారు. చెట్టుకింద గొయ్యి తవ్వారు, డబ్బు దాచారు.

"డబ్బుకు లోకం దాసోహం" అని ధనగుప్తుడి నమ్మకం. అతనికి దురాశ పుట్టింది. మొత్తంసొమ్ము తానే కాజేయాలనుకున్నాడు. ఒకనాటి రాత్రి చెట్టుదగ్గరికి వెళ్ళి ధనమంతా తెచ్చుకున్నాడు. ఇంట్లో దాచాడు. 'ఉలుకూ పలుకూ లేకుండా' ఊరుకున్నాడు.

కొద్దిరోజుల తరవాత స్నేహితులిద్దరూ డబ్బు తెచ్చుకోవాలనుకున్నారు. కలిసి చెట్టు దగ్గరికి వెళ్ళారు. ధనగుప్తుడు మాత్రం "తేలుకుట్టిన దొంగ" లా చూస్తూ నిలుచున్నాడు. నందిగుప్తుడే గోతిని తవ్వాడు. అందులో సొమ్ము లేదు. ఆశ్చర్యపోయాడు. స్నేహితుడివైపు తిరిగాడు. అన్నీ తెలిసిన ధనగుప్తుడు కోపం నటించాడు. "నోరుంటే పొరు గెలుస్తుంద"ని నందిగుప్తుడిమీద విరుచుకుపడ్డాడు. "నువ్వే ద్రోహబుద్ధితో మొత్తం సొమ్ము కాజేశావు. ఇప్పుడు 'నక్కవినయాలు నటిస్తున్నావు' " అన్నాడు. ధనగుప్తుడి మాటలకు నందిగుప్తుడికి కూడా కోపం వచ్చింది. 'ధర్మానికి పోతే కర్మం చుట్టుకున్నది' అన్నట్లుంది వరస. నన్నే దొంగ అంటావా!" ఇలా ఇద్దరు పోట్లాడుకున్నారు. తగువు తెగలేదు. తీర్పు కోసం రాజు దగ్గరికి వెళ్ళారు.

ధనగుప్తుడు, నందిగుప్తుడు ఇద్దరూ విషయాన్ని రాజుకు వివరించారు. నందిగుప్తుడే ధనం దొంగిలించాడనటానికి ఆధారమేమిటని అన్నాడు రాజు. "దొంగకు ధైర్య మెక్కువ" అన్నట్లు ధనగుప్తుడు, 'జంకు, కొంకు' లేకుండా నిలబడ్డాడు. ఇందుకు చెట్టే సాక్ష్యం చెప్తుంది. కావాలంటే పరీక్షించుకోండి. 'నిజం నిలకడమీద తెలుస్తుంది' " అన్నాడు. మరునాటి ఉదయం చెట్టుదగ్గరికి వెళ్ళి పరీక్షించాలని నిర్ణయించుకున్నారు.

ధనగుప్తుడు ఇంటికి వచ్చాడు. జరిగిందంతా తన తండ్రికి చెప్పాడు. "చెట్టుకు తొర్ర ఉంది. అందులో దాక్కొని, రాజు అడిగినప్పుడు సాక్ష్యం చెప్పు"మని అతను తన తండ్రిని కోరాడు. "నమ్మిన మిత్రునికి ద్రోహం చేయగూడదు" అని తండ్రి ధనగుప్తుడికి బుద్ధి చెప్పాడు. కానీ ధనగుప్తుడు తండ్రిమాటలను పెడచెవిన పెట్టాడు. పోగాలం దాపురించినవారికి పెద్దల మాటలు చెవికెక్కవు కదా! తండ్రి ఏమీ చేయలేకపోయాడు. దైవంమీద భారంవేసి, ఉదయమే వెళ్ళి చెట్టుతొర్రలో దాక్కొన్నాడు.

మరునాడు రాజుగారు తన పరివారంతో చెట్టుదగ్గరికి వెళ్ళాడు. రాజు చెట్టును చూసి "ఓ వృక్షరాజమా! వీళ్ళిద్దరూ నీదగ్గర దాచిన సొమ్ము ఏమైంది? చెప్పు" అని అడిగాడు. అప్పుడు చెట్టుతొర్రలోనుంచి "మహారాజా! నందిగుప్తుడే ఆ సొమ్ము కాజేసి తీసుకువెళ్ళాడు. ధనగుప్తుడు ఏ పాపమూ ఎరగడు," అనే మాటలు వినిపించాయి. రాజు ఆశ్చర్యపోయాడు. ఒక్కక్షణం ఆలోచించాడు. భటులను పిలిచి చెట్టు తొర్రలో గడ్డివేసి పొగపెట్టమన్నాడు. ఆ పొగకు ఊపిరి సలపక ధనగుప్తుడి తండ్రి వెలుపలికి వచ్చాడు. జరిగిందంతా 'పూసగుచ్చినట్లు' చెప్పాడు. " 'కడుపుతీపి' తో 'బుద్ధిగడ్డితిని' నా కుమారుడి మాట విన్నాను. నన్ను క్షమించండి," అని కోరాడు. రాజు ధనగుప్తుడికి శిక్ష విధించాడు. నందిగుప్తుడికి రావలసిన సొమ్మును ఇప్పించాడు. ధనగుప్తుడి తండ్రిని మన్నించి వదిలివేశాడు.



© SCERT not to be republished



# ఇవి చేయండి



## I వినండి - ఆలోచించి చెప్పండి



(అ) కథను సొంతమాటల్లో చెప్పండి.

(ఆ) కథకు ఎందుకా పేరు పెట్టి ఉంటారో చెప్పండి.

(ఇ) మీకు తెలిసిన సామెతలు చెప్పండి. వాటి అర్థం వివరించండి.

(ఈ) "ధనానికి దాపరికం - సేద్యానికి వెల్లడి" ఇది ఒక సామెత. "కడుపుతీపి", "బుద్ధి గడ్డితిని" వీటిని జాతీయాలు అంటారు. సామెతలకు, జాతీయాలకు మధ్య తేడా ఏమిటో చెప్పండి.

## II చదవండి - అర్థం చేసుకొని చెప్పండి - రాయండి



(అ) కింది పేరాలో కొన్ని జాతీయాలు, సామెతలు ఉండవలసిన చోట లేవు. పాఠాన్ని చదివి సరిచేసి రాయండి.

అవంతీపురంలో ధనగుప్తుడు, నందిగుప్తుడనే వర్తకులుండేవాళ్ళు. వాళ్ళు పొరుగుదేశాలకు వెళ్ళి వ్యాపారం చేసేవాళ్ళు. వాళ్ళ వ్యాపారం **'ఉలుకు పలుకు'**గా అభివృద్ధి చెందింది. వ్యాపారం వాళ్ళకు **'వెన్నతో పెట్టిన విద్య'**. ఇద్దరూ వేరొక వ్యాపారం చేయాలనుకున్నారు. అంతవరకు సొమ్ము దాచాలి. **'డబ్బుకు లోకం దాసోహం'** అని ఇద్దరూ కలిసి వెళ్ళారు. చెట్టుకింద గొయ్యి తవ్వి డబ్బు దాచారు.

**'ధనానికి దాపరికం - సేద్యానికి వెల్లడి'** అని ధనగుప్తుడి నమ్మకం. అతనికి దురాశ పుట్టింది. ఒకనాటి రాత్రి చెట్టు దగ్గరికి వెళ్ళి ధనమంతా తెచ్చుకున్నాడు. **'మూడు పువ్వులు ఆరుకాయలు'**గా లేకుండా ఊరుకున్నాడు.

(ఆ) పాఠం చదవండి. ధనగుప్తుడికి వర్తించే సామెతలు, జాతీయాలు ఏమి ఉన్నాయో వాటిని గుర్తించండి.

(ఇ) కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. రాజు చెట్టుకు ఎందుకు పొగపెట్టాలనుకున్నాడు?
2. చెట్టు సాక్ష్యం చెప్పిందా? ఎలా తెలుసుకోవచ్చు?
3. ధనగుప్తుడు ఎటువంటివాడు?
4. కథలో ఎవరు మోసగాడు? ఎందుకు?

(ఈ) కథలోని సామెతలకు, 'O' చుట్టండి. జాతీయాలకింద గీతగీయండి.

© SCERT not to be republished

## III రాయండి




(అ) కథను సొంతమాటల్లో రాయండి.

(ఆ) రాజు ధనగుప్తుడి తండ్రిని మన్నించి ఎందుకు వదిలేశాడు?


(ఇ) కథ ఆధారంగా నందిగుప్తుడి స్వభావాన్ని గురించి రాయండి.

(ఈ) "నమ్మిన మిత్రునికి ద్రోహం చేయకూడదు." అనే వాక్యాన్ని బట్టి మీరేం గ్రహించారు?

## IV పదజాలం



(అ) ఆధారాలతో గడులు నింపండి.





**ఆధారాలు**

1. గాలినిచ్చే కర్ర
2. తెలివిలేనివాడు
3. బహుమతికి మరో పదం
4. సంతోషానికి మరో పదం
5. చలికి కప్పుకొనేది
6. వెలుగునిచ్చేవాడు

(ఆ) కింది జాతీయాలు, పదాలను ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి. బుద్ధి గడ్డి తిని, ఉలుకు పలుకు, కడుపు తీపి, జంకూ గొంకూ, నక్కవినయం, సాక్ష్యం, దాపరికం, పరివారం.

## V సృజనాత్మకత



(అ) చెట్టు సాక్ష్యం కథను సంభాషణ రూపంలో రాయండి. నాటకీకరణ చేయండి.


(ఆ) కింది జాతీయాలు ఉండేలా కొత్త కథను / సంఘటనను రాయండి.

కథలు చెప్పడం, నాటకాలు ఆడడం, శఠగోపం పెట్టడం, మాటలు నేర్వడం, చుక్కలు చూపించాడు, కడిగేయడం, హారతి కర్పూరం, మంగళం పాడడం, కడుపు మంట, కళ్లు తెరిచాడు.

(ఇ) చెట్టు సాక్ష్యం కథను పొడిగించి రాయండి.

© SCERT not to be republished

## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు



**(అ) కొన్ని సామెతలను సేకరించండి. రాసి చదివి వినిపించండి.**

**(ఆ) కొన్ని జాతీయాలను సేకరించండి. రాసి చదివి వినిపించండి.**

**(ఇ) సామెతలు, జాతీయాలకు సంబంధించిన కథలు సేకరించండి. అడిగి తెలుసుకోండి. వాటిని మీ మీ భాషల్లో చెప్పండి.**

## VII భాషను గురించి తెలుసుకుందాం



**(అ) కింది వాక్యాలను చదవండి.**

1) వర్షాలు బాగా కురిశాయి. పంటలు బాగా పండాయి.

2) వర్షాలు బాగా కురిశాయి కాబట్టి పంటలు బాగా పండాయి.

ఒక వాక్యంలో ఒకే సమాపక క్రియ ఉంటే ఆ వాక్యాన్ని **సరళవాక్యం** అంటారు.

ఒక వాక్యంలో రెండు సమాపక క్రియలు ఉంటే ఆ వాక్యాన్ని **సంయుక్త వాక్యం** అంటారు.

రెండు సరళ వాక్యాలను సంయుక్త వాక్యాలుగా రాసేటప్పుడు 'కానీ', 'అందువల్ల' లేదా 'కాబట్టి', 'ఐనా' ఇలాంటి పదాలు రెండు వాక్యాలను కలపడానికి ఉపయోగిస్తారు.

**(ఆ) కింది ఉదాహరణలు గమనించండి.**

1) రైలు వచ్చింది. చుట్టాలు రాలేదు. (సరళ వాక్యాలు)

2) రైలు వచ్చింది కానీ చుట్టాలు రాలేదు. (సంయుక్త వాక్యం)

1) రమ సంగీతం నేర్చుకుంది. నృత్యం నేర్చుకుంది. (సరళ వాక్యాలు)

2) రమ సంగీతమూ నృత్యమూ నేర్చుకుంది. (సంయుక్త వాక్యం)

**(ఇ) కింది సరళ వాక్యాలను సంయుక్త వాక్యాలుగా మార్చి రాయండి.**

1. లక్ష్మి ఐస్‌క్రీం తెచ్చింది. లక్ష్మి ఐస్‌క్రీం తినలేదు.
2. ఈ సంవత్సరం డబ్బులు బాగా వచ్చాయి. ఇల్లు కొన్నాను.
3. హసన్ బంతి తెచ్చాడు. జంగు బాట్ తెచ్చాడు.
4. సల్మా, రోజీ ఇంటికి వెళ్ళింది. సల్మా గీత ఇంటికి వెళ్ళింది.



### నేనివి చేయగలనా ?



| | |
|---|---|
| 1. చెట్టు సాక్ష్యం కథను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను/కాదు |
| 2. పాఠాన్ని ధారాళంగా చదవగలను. సామెతలనూ, జాతీయాలనూ గుర్తించగలను. | ఔను/కాదు |
| 3. కథను సొంతమాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. కథను సంభాషణలోకి మార్చి రాయగలను. | ఔను/కాదు |

©SCERT not to be republished

# యూనిట్ 4 15. మేటి బాలిక

**ఉన్ముఖీకరణ : చిత్రం చూడండి - ఆలోచించండి - మాట్లాడండి**



★ చిత్రం చూడండి. ఏం జరుగుతూ ఉందో చెప్పండి. ఇది ఏ సందర్భంలో జరుగుతూంది?

★ ఇలాంటి కార్యక్రమాలను మీ పాఠశాలలో నిర్వహించారా? ఎందుకోసం నిర్వహించారు?

★ నువ్వు ఇలాంటివాటిలో పాల్గొన్నావా?

**పిల్లలకు సూచనలు :**

★ పాఠంలోని చిత్రాలను చూడండి. చిత్రాలను గురించి మాట్లాడండి.

★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.

★ గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడిగి లేదా పదాలు - అర్థాలు అన్న పట్టికలో చూసి తెలుసుకోండి.

| | | |
|---|---|---|
| వీణ | : | సిరీ! ఏమిటి! అందరూ తమ పేర్లు రాయించుకుంటున్నారు? ఎందుకోసం? |
| సిరి | : | రేపు ఆటలపోటీలు మొదలవుతాయి కదా! ఇందుకోసం వాళ్ళు పేర్లను నమోదు చేయించుకోడానికి వెళ్తున్నారు. వీణా! నీ పేరు కూడా నేను రాసిచ్చాను. |
| వీణ | : | నేను ఆడలేను కదా! |
| సిరి | : | కాలు లేదని బాధపడకు. నువ్వు కూడా ఆడగలవు. |
| **టీచర్** | : | రేపే పోటీలు మొదలవుతాయి. |
| | | (బడిలో పిల్లలంతా వరండాలో సమావేశం అయారు.) |
| ప్రధానోపాధ్యాయిని | : | **ప్రతి ఏటా నవంబరు 14వ తేదీన బాలల దినోత్సవం** జరుపుకొంటాం కదా! ఇది **చాచా నెహ్రూ పుట్టినరోజు.** ఆయనకు పిల్లలంటే ఎంతో ముద్దు. ఆయన మనదేశానికి మొదటి ప్రధానమంత్రి. మీకు కొన్ని కళలు వచ్చు. మీలో కొన్ని శక్తులు ఉన్నాయి. అవి అందరికీ తెలియడానికి మనం పోటీలు పెట్టుకుంటున్నాం. పోటీలో పాల్గొనేవాళ్ళను మనం ప్రోత్సహిస్తున్నాం. |
| | | (అందరూ చప్పట్లు కొట్టారు). |
| **టీచర్** | : | ఒక్కొక్కరి పేరు పిలుస్తాను.... శైలజా! |
| | | (శైలజ వచ్చి పాడుతుంది.) |



| | | |
|---|---|---|
| వీణ | : | అందరికీ నమస్కారం. 'మౌనంగానే ఎదగమని మొక్కనీకు చెబుతుంది. ఎదిగినకొద్దీ ఒదగమని .....' పాట పాడింది. |
| | | (అందరూ చప్పట్లు కొట్టారు) |
| సిరి | : | వీణా! నువ్వు పాడిన పాట చాలా బాగుంది. పాడిన తీరుకూడా బాగుంది. ఇలా ధైర్యంగా ముందుకు వస్తే అన్ని పోటీల్లోనూ నిన్ను మెచ్చుకుంటారు. పద, చదరంగపు ఆటపోటీలు మొదలయ్యాయి. అక్కడికి వెళదాం. నాకు రహత్‌తో చదరంగం పోటీ ఉంది. |
| వీణ | : | సిరీ! చాలా బాగా ఆడుతున్నావు. రహత్! నువ్వుకూడా! |
| సిరి | : | రహత్! చాలా బాగా ఆడావు. నామీద గెలిచినందుకు నీకు అభినందనలు. |

**రహత్** : థాంక్యూ సిరీ! నువ్వు కూడా బాగానే ఆడావు.

**సిరి** : టీచర్, ఎప్పుడూ దిగులుగా కూర్చొనే వీణ ఈసారి పోటీల్లో పాల్గొంటున్నందుకు నాకు చాల సంతోషంగా ఉంది.

**వీణ** : ఔను సిరీ! ఇదంతా నీ ప్రోత్సాహమే.

(రహత్, వీణ చదరంగం ఆడటం మొదలుపెట్టారు. అందరూ ఉత్సాహంగా చూస్తున్నారు. వీణ 'రాజు'ను రహత్ కట్టివేయడానికి ఎత్తువేసింది. వీణ గమనించింది. నాన్న దగ్గర, చదరంగంలో తెలుసుకున్న మెలకువలు గుర్తుతెచ్చుకుంది. తెలివిగా పావులను కదిపి రహత్‌మీద గెలిచింది)

**సిరి** : వీణ చాలా బాగా ఆడి రహత్‌పై గెలిచావు. నీకు తప్పకుండా బహుమతి వస్తుంది.

**వేదా టీచర్** : రేపు ఆటల పోటీలు ఉన్నాయి. అందరూ 9 గంటలలోపలే బడికి రావాలి (అని ప్రకటించింది).

**పిల్లలు** : సరే టీచర్! (సంతోషంగా ఇండ్లకు వెళ్ళారు).

**దృశ్యం - 2**

(ఆరోజు నవంబరు పద్నాలుగో తేదీ. బడి వరండాలో సభ ప్రారంభమయింది. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయిని, పిల్లలు, వాళ్ళ తల్లిదండ్రులు, మండల విద్యాధికారి వేదిక మీద ఉన్నారు. ప్రధానోపాధ్యాయిని బాలల దినోత్సవాన్ని గురించి కొన్ని విషయాలు చెప్పారు. గడచిన మూడు రోజులుగా జరిగిన పోటీల్లో గెలిచిన వాళ్ళకు బహుమతులు ఇచ్చే కార్యక్రమం జరుగుతున్నది.)



**వేదా టీచర్** : ఎన్నో పోటీల్లో ఎంతోమంది పిల్లలు పాల్గొన్నారు. గెలిచినవాళ్ళు బహుమతులు పొందారు. కాని ఈసారి పోటీల్లో ఒక విశేషం ఉంది. మన వీణ తను పాల్గొన్న అన్ని పోటీల్లోనూ ప్రథమ బహుమతి పొందింది.

చదువులోనే కాదు, ఆటల పోటీల్లో కూడా మేటి అనిపించుకుంది. వీణలోని ఆత్మస్థైర్యమే ఆమెను గెలిపించేలా చేసింది. గొప్పవాళ్ళు కావాలనే పట్టుదల ఉంటే ఏ అంగవైకల్యమూ అడ్డు రాదు. మన వీణను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలి. వీణలాంటి విద్యార్థిని మన పాఠశాలలో ఉండడం మనకు గర్వకారణం. వీణా! మేమందరం నిన్ను అభినందిస్తున్నాం (చప్పట్లు మారుమోగుతాయి).

**వీణ** : నేను గెలవడానికి మీ అందరి ప్రోత్సాహమే కారణం. నాకు ఈరోజు చాలా సంతోషంగా ఉంది. నా తల్లిదండ్రులు, నా స్నేహితులు ఎక్కడా నాకు అంగవైకల్యం ఉందనే భావనను రానివ్వలేదు. మా ఉపాధ్యాయులు, ఈ పాఠశాల నాకు ప్రతి క్షణం అండగా నిలిచారు. దీన్ని నేనెప్పటికీ మరవలేను. మీకందరికీ నా కృతజ్ఞతలు. (అందరూ చప్పట్లు కొట్టారు)

©SCERT not to be republished



# ఇవి చేయండి



## I వినండి - ఆలోచించి చెప్పండి



(అ) ఈ నాటికలోని పాత్రలపేర్లు చెప్పండి.

(ఆ) ఈ పాఠంలో 'మేటిబాలిక' ఎవరు? ఆమె ఎందుకు 'మేటిబాలిక' అయింది?

(ఇ) 'వీణ' లాంటి పిల్లలు మీకు ఎవరైనా తెలుసా? వాళ్ళను గురించి చెప్పండి. వాళ్ళకు ఎలాంటి సహాయం చేస్తారు?

## II చదవండి - అర్థంచేసుకొని చెప్పండి - రాయండి



(అ) కింది వాక్యాలలోని పదాలు తారుమారయాయి. పాఠం చదివి వాటిని సరిచేసి తిరిగి రాయండి.

1. దిగులు లేదు, ఉన్నంత, బలహీనంగా, మాత్రాన

   ..........................................................................................

2. మొదలయ్యాయి, పోటీలు, ఆడిటోరియంలో చదరంగం.

   ..........................................................................................

3. గురించి, ప్రధానోపాధ్యాయిని, బాలలదినోత్సవం, మాట్లాడారు.

   ..........................................................................................

4. ఆమెను, వీణ లోని, ఆత్మస్థైర్యమే, చేసింది, గెలిపించేలా

   ..........................................................................................

(ఆ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. 'మేటిబాలిక' గా వీణ ఎందుకు ప్రశంస పొందిందో రాయండి.
2. వీణ పోటీల్లో పాల్గొనలేనని ఎందుకు అనుకుంది?
3. సిరి, వీణను ఎలా ప్రోత్సహించింది?
4. 'మేటిబాలిక' అని వీణను ఎందుకు పిలవవచ్చునని వేదాటీచర్ చెప్పారు? వివరించండి.
5. వీణకు ఎవరెవరు ప్రోత్సాహం ఇచ్చారో తెల్పండి?

## III రాయండి



(అ) 'శారీరక వైకల్యం ప్రతిభకు అడ్డంకాదు' — ఎలాగో మీమాటల్లో రాయండి.

(ఆ) వీణ చదివే బడిలో బాలల దినోత్సవం సందర్భంగా బడిలో ఏయే పోటీలు జరిగాయో రాయండి. మీ బడిలో ఏయే పోటీలు జరుగుతాయో తెలపండి.


(ఇ) వీణలాంటి స్నేహితురాలు మీకు ఉంటే మీరు ఆమెను ఎలా ప్రోత్సహిస్తారో రాయండి.

(ఈ) వీణ గురించి మీ సొంతమాటల్లో రాయండి.

(ఉ) 'ఎవరైనా కష్టపడి దేనినైనా సాధించగలరు' దీన్ని సమర్థిస్తూ పది వాక్యాలు రాయండి.

© SCERT not to be republished


## IV పదజాలం



**(అ) కింది పదాలకు అర్థాలను రాయండి. వాటిని ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.**

| | | |
|---|---|---|
| బలహీనత | వక్తృత్వం | ప్రతిభ |
| సమావేశం | సామర్థ్యం | బహుమతి |
| అభినందించు | ప్రోత్సాహం | సందర్భం |

## V సృజనాత్మకత



**(అ) 'మేటిబాలిక' నాటికలోని పాత్రలను గమనించండి. మీ స్నేహితులతో చర్చించండి. ఆ పాత్రలను మీలో ఎవరెవరు చేస్తారో నిర్ణయించుకోండి. నాటకాన్ని మీరు వేయండి.**

**(ఆ) 'మేటిబాలిక' నాటికను మీమాటల్లో ఒక వ్యాసంగా రాయండి.**

## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు



**(అ) వీణలాంటి పిల్లల విజయాలను సేకరించండి. వాటిని గురించి తరగతిలో చర్చించండి.**

## VII భాషను గురించి తెలుసుకుందాం



**(అ) కింది పేరాను చదవండి. కి, కు, ని, ను, లో విభక్తి ప్రత్యయాలను సరైన చోట రాయండి.**

ఆటల పోటీ జరుగుతుంది. రాజీవ్, జానీ, సురేష్, రఘు పోటీ ..... పాల్గొన్నారు. జానీ .... మొదటి బహుమతి, రఘు .... రెండో బహుమతి వచ్చాయి. అందరూ జానీ ..... , రఘు ..... మెచ్చుకున్నారు. జానీ ..... చాలా ఆనందం కలిగింది. తన బహుమతి ..... వాళ్ల అన్న ..... చెల్లి ..... చూపించాడు.

© SCERT not to be republished



### నేనివి చేయగలనా ?



| | | |
|---|---|---|
| 1. | మేటిబాలికను గురించి మాట్లాడగలను. | ఔను/కాదు |
| 2. | పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయగలను. | ఔను/కాదు |
| 3. | మేటిబాలికలాంటివాళ్ళను గురించి సొంతంగా రాయగలను. | ఔను/కాదు |
| 4. | మేటిబాలిక నాటకీకరణ చేయగలను. | ఔను/కాదు |



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

**యూనిట్ 4**


# మచీ మచీ మచీ
# షినిమ షినిమ షినిమ

**చదువు - ఆనందించు**



ఆరేళ్ల బాలు ఒకరోజున ఒక పెద్దచీమల బారును చూశాడు. అది అతని ఇంటిపక్కన ఉన్న పెరడులోకి వెళ్లి అక్కడ ఒక పుట్టలోకి ప్రవేశిస్తుంది. ఎంతో ఉత్సాహంగా ఆ పుట్టదగ్గరకు వచ్చిన బాలు, "ఆహా! ఈ పుట్టలో ఏమి ఉంటుందో కదా! నేను కనుక చీమంత చిన్నగా అయితే చూడగలిగేవాణ్ణి. అయితే నాకా అదృష్టం లేదు!" అని విచారపడ్డాడు. ఇంతలో ఒక గండుచీమ అతనితో, "నువ్వు చాలా మంచి బాబులాగున్నావు. నీ కోరిక నేను తీరుస్తాను. నువ్వు నా పుట్టలోకి రావాలనుకుంటే చీమ అనే పదాన్ని తిరగేసి మూడుసార్లు పలుకు!" అని అంది. వెంటనే బాలు 'మచీ, మచీ, మచీ' అన్నాడు. అంతే అతను చీమంత చిన్నవాడు అయిపోయాడు. ఇక అతని ఆనందానికి పట్టపగ్గాలు లేవు. చీమతోపాటు అతను పుట్టలోకి ప్రవేశించాడు.

అక్కడ గదులు చాలా విచిత్రంగా ఉన్నాయి. ఎండకు, వానకు చెక్కుచెదరని విధంగా ఉన్నాయి. ఒక పెద్ద గదిలో బియ్యం, పంచదార, పప్పులు ఇలా ఎన్నోరకాల ఆహారపదార్థాలు నిలవచేసి ఉన్నాయి. చీమలపెద్ద అతనితో, "చూడు బాబూ! మాకు సోమరితనం అంటే పడదు. ఇక్కడ ఉండేవాళ్ళందరూ కష్టపడాలి. మేము విశ్రాంతి తీసుకోము. ఎప్పుడూ పనిచేస్తూనే ఉంటాము," అంది. బాలు కూడా వాటితో కలిసిపోయాడు. ఎన్నో పనులు చేశాడు. కొంతకాలానికి తన ఇల్లు తండ్రి, తల్లి, చెల్లి గుర్తుకువచ్చారు. అయితే చీమలా చిన్నజీవి అయిపోయిన అతను పాపం, ఏం చేయగలడు? విచారంగా ఉన్న అతన్ని చూసిన గండుచీమ అతన్ని బయటికి తీసుకువచ్చింది. "చూడు బాబూ! నువ్వు వెళ్ళవచ్చు. అయితే 'మనిషి' అనే మాటను తిరగేసి మూడుసార్లు పలుకు! అంది. వెంటనే బాలు "షినిమ, షినిమ, షినిమ" అన్నాడు. అంతే, ఒక్కసారిగా బాలుకు అనలురూపం వచ్చేసింది. సంతోషంగా ఇంటికి తిరిగి వెళ్ళాడు.



©SCERT not to be republished

# యూనిట్ 4 16. ఆణిముత్యాలు

1. కూరిమిగల దినములలో
నేరములెన్నడును కలుగనేరవు మరి యా
కూరిమి విరసంబైనను
నేరములే తోచుచుండు నిక్కము సుమతీ!




**భావం** : ఒకరితో ఒకరు స్నేహంగా ఉన్న రోజుల్లో తప్పులనేవి కనిపించవు. ఆ స్నేహం చెడిపోగానే అన్నీ తప్పులుగానే కనబడుతూ ఉంటాయి.

2. అక్కరకురాని చుట్టము
మ్రొక్కిన వరమీని వేల్పు మోహరమునఁ దా
నెక్కిన పాఱని గుఱ్ఱము
గ్రక్కున విడువంగ వలయుగదరా సుమతీ!




**భావం** : అవసరం వచ్చినప్పుడు సహాయపడని బంధువును, నమస్కరించి వేడుకున్నా కోరిక నెరవేర్చని దేవుణ్ణి, యుద్ధం జరుగుతున్నప్పుడు కదలని గుర్రాన్నీ వెంటనే విడిచిపెట్టాలి.

3. గంగిగోవుపాలు గరిటెడైనను చాలు
కడవెడైన నేమి ఖరము పాలు
భక్తిగలుగు కూడు పట్టెడైనను చాలు
విశ్వదాభిరామ వినుర వేమ!



**భావం** : కుండెడు గాడిదపాలకంటె గరిటెడు ఆవుపాలు మేలు. అలాగే ప్రేమతో పెట్టే భోజనం పిడికెడైనా ఎంతో మంచిది.

4. అనువుగాని చోట అధికులమనరాదు
కొంచెముండుటెల్ల కొదువ గాదు
కొండ అద్దమందు కొంచెమై యుండదా
విశ్వదాభిరామ వినుర వేమ!



**భావం** : అనుకూలత లేనిచోట మనం గొప్పవాళ్ళమని చెప్పగూడదు. అణకువగా ఉండటం తప్పు కాదు. కొండ పెద్దదైనా అద్దంలో చిన్నగానే కనబడుతుంది కదా!

5. వంపుకఱ్ఱ కాల్చి వంపు తీర్చగవచ్చు
కొండలన్ని పిండికొట్టవచ్చు
కఠినచిత్తు మనసు కరిగింపగా రాదు
విశ్వదాభిరామ వినుర వేమ!



**భావం** : కఱ్ఱకు ఉన్న వంకరను, దాన్ని కొద్దిగా కాల్చి సరిచేయవచ్చు. కొండలను పొడిపొడిగా చేయవచ్చు. కాని దయలేనివాడి మనస్సును కరిగించలేము.

© SCERT not to be republished

6. పరులకొరకె నదులు ప్రవహించు, గోవులు
పాలనిచ్చు చెట్లు పూలు పూచు
పరహితమ్ముకంటె పరమార్థమున్నదా
లలిత సుగుణజాల తెలుగుబాల!



**భావం :** నదులు ప్రవహించడంవల్ల జనానికి నీళ్ళు దొరుకుతున్నాయి. ఆవులు పాలు ఇవ్వడంవల్ల పాలు దొరుకుతున్నాయి. చెట్లు పూసే పూలను కూడా జనం కోసుకొని వాడుకుంటున్నారు. వీటన్నిటివల్ల జనానికి లాభం కలుగుతూంది. అవన్నీ, వాటిని తమకోసం ఉపయోగించుకోవు. అవి మనకు ఉపయోగపడతాయి.

7. జన్మభూమికంటె స్వర్గంబు వేరేది
మాతృభాషకంటె మధురమేది
కన్నతల్లికంటె ఘనదైవ మింకేది
తెలియుమయ్య నీవు తెలుగుబిడ్డ!



**భావం :** పుట్టిన ఊరికంటె సుఖమైన ప్రదేశం లేదు. పుట్టినప్పటినుంచి నేర్చిన భాషకంటె ఇంపయిన భాష లేదు. కన్నతల్లిని మించిన దైవం లేదు.

8. గడిచిపోయినట్టి క్షణము తిరిగి రాదు
కాల మూరకెపుడు గడుపబోకు
దీపమున్నయపుడె దిద్దుకోవలె నిల్లు
విలువ తెలిసి చదువు తెలుగుబిడ్డ



**భావం :** గడిచిపోయిన కాలం తిరిగి రాదు. అనవసరంగా కాలాన్ని వృథా చేయవద్దు. దీపం వెలుతురున్నప్పుడే ఇంటిని చక్కదిద్దుకోవాలి. కాలం విలువ తెలుసుకొని చదవాలి.

© SCERT not to be republished



## ఇవి చేయండి



### I వినండి - ఆలోచించి చెప్పండి




(అ) పై పద్యాలను భావం సరిగా తెలిసేలా చదవండి.

(ఆ) మీ మిత్రునితో కలిసి కూర్చోవాలి. ఒకరు పద్యం చదవాలి, ఇంకొకరు భావం చెప్పాలి.

(ఇ) మీరు పద్యాల పోటీలో పాల్గొంటే ఏ పద్యాలు చెబుతారు?

### II చదవండి - అర్థంచేసుకొని చెప్పండి - రాయండి



(అ) కింది వాక్యాల భావాలకు సరైన పద్యపాదాలు రాయండి.

1. స్నేహం చెడగానే అన్నీ తప్పులుగానే కనబడతాయి.

.................................................................................................

2. ప్రేమతో పెట్టే భోజనం పిడికెడైనా ఎంతో మంచిది.

.............................................................................................

3. అనుకూలతలేని చోట మనం గొప్పవాళ్ళమని చెప్పగూడదు.

.............................................................................................

4. కర్రకు ఉన్న వంకరను కాల్చి సరిచేయవచ్చు.

.............................................................................................

5. పరులకు మేలుచేయడంకంటే పరమార్థం లేదు.

.............................................................................................

**(ఆ) కింది పద్యపాదాలను సరిచేసి రాయండి.**

కొంచెముండుటెల్ల కొదువ గాదు
విశ్వదాభిరామ వినురవేమ
అనువుగానిచోట అధికులమనరాదు
కొండ అద్దమందు కొంచెమై యుండదా.

..............................................................

..............................................................

..............................................................

..............................................................

**(ఇ) కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. తప్పులు ఎప్పుడు కనబడతాయి?
2. ఏయేవాటిని విడిచిపెట్టాలి?
3. అనుకూలతలేని చోట ఎలా ఉండాలి?
4. పరులకు మేలుచేసే కొన్ని పనులు తెలపండి.
5. కాలంవిలువను గురించి రాయండి.

## III రాయండి



**(అ) పద్యాలకు భావాలను సొంతమాటల్లో రాయండి.**

**(ఆ) కాలం విలువైనది అన్నారు. ఎందుకు?**

**(ఇ) "గడిచిపోయిన క్షణం తిరిగిరాదు" అంటే ఏమిటో వివరించండి.**


**(ఈ) "కన్నతల్లికంటే ఘనదైవం లేదు" అని వాక్యంలో చదివారు కదా! దీని మీద మీ అభిప్రాయం రాయండి?**

**(ఉ) నదులు, ఆవులు, చెట్లు మొదలైనవన్నీ ఇతరులకు మేలు చేస్తున్నాయి కదా! మరి మీరు ఇతరులకు ఎలాంటి మేలు చేస్తారు?**

© SCERT not to be republished

 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

## IV పదజాలం



(అ) కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు అదే అర్థంకలిగిన పదాలు పద్యాలలో ఉన్నాయి. వాటిని గుర్తించండి. అర్థాలను తెలుసుకొని వాక్యాలు తిరిగి రాయండి.

ఉదా: అందరితో స్నేహంగా మెలగాలి.

అందరితో కూరిమితో మెలగాలి.

1. నువ్వు వెంటనే తిరిగి రావాలి.
2. రోజూ పిడికెడు బియ్యాన్ని పొదుపుచేయాలి.
3. ఇతరులకు మేలుచేయడం మరవవద్దు.
4. మాతృభాషకంటె తియ్యటిది ఏది?

## V సృజనాత్మకత



(అ) పైపద్యాలలోని భావాలతో గేయాలు రాయండి.

(ఆ) పైపద్యంలోని భావాలు వచ్చే కథలు రాయండి.

(ఇ) పాఠంలోని పద్యాలలో మీకు నచ్చిన పద్యానికి చిత్రం గీయండి. రంగులు వేయండి.

## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు



(అ) వేమన శతకం, సుమతీ శతక పద్యాలను సేకరించండి. వాటి భావాలు రాసి చదివి వినిపించండి.

## VII భాషను గురించి తెలుసుకొందాం



(అ) ఇప్పటి వరకు చదివిన పాఠాలు ఆధారంగా ఒక్కొక్కదానికి రెండు రెండు వాక్యాలు రాయండి.

సరళ వాక్యాలు : 1. ..............................................................................
2. ..............................................................................

సంశ్లిష్ట వాక్యాలు: 1. ..............................................................................
2. ..............................................................................

సంయుక్త వాక్యాలు:1. ..............................................................................
2. ..............................................................................



### నేనివి చేయగలనా?



| | |
|---|---|
| 1. పద్యాలను రాగంతో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. పద్యాలను, భావాలను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 3. పద్యభావాల్ని సొంతంగా తప్పులు లేకుండా రాయగలను. | ఔను / కాదు |
| 4. పద్యభావాలకు తగిన కథ రాయగలను. | ఔను / కాదు |

© SCERT not to be republished

# యూనిట్ 4 వేపకాయంత వెర్రి

చదువు - ఆనందించు



చీపురుపల్లి అనే గ్రామంలో సీతయ్య ఉండేవాడు. సీతయ్య అదోరకం మనిషి. ఒకసారి తన బంధువుల ఇంటికి పొరుగూరు — మర్రిపాలెం — వెళ్ళవలసి వచ్చింది. "ఆ ఊరికి ఎలా వెళ్ళాలి?" అని తన భార్యను అడిగాడు. ఆమె "ముక్కుసూటిగా వెళ్ళండి," అంది. "ఓహో! ముక్కుసూటిగా వెళ్ళాలి అంతే కదా!" అనుకుంటూ బయలుదేరాడు. ముక్కుసూటిగా పోతుండగా, ఒక మర్రిచెట్టు అడ్డం వచ్చింది.

సీతయ్య చెట్టు ఎక్కాడు! కాని దిగడం ఎలాగో తెలియలేదు. ఎవరైనా వచ్చి సాయం చెయ్యకపోతారా అని చూడసాగాడు. దూరంనుంచి ఒక ఎడ్లబండి వస్తుండడం గమనించాడు. ఆ బండి రామయ్యది. బండిలో ఉన్నతన్ని సీతయ్య గుర్తుపట్టి బిగ్గరగా అరచాడు. ఆ కేకలకు రామయ్య బండి ఆపి, "సీతయ్యా! ఏమైంది! ఆ చెట్టు ఎందుకు ఎక్కావు?" అని అడిగాడు. మర్రిచెట్టు తన మార్గంలో ఎలా అడ్డంవచ్చిందో చెప్పి, దాటి వెళ్ళేందుకు చెట్టు ఎక్కానని సీతయ్య తెలిపాడు. "మరి నీకు చెట్టు దిగడం రాదా?" అని రామయ్య అడిగితే, "లేదు, అందుకే ఇక్కడే ఉండి ఎవరైనా వస్తారేమో! అని చూస్తున్నాను," అని చెప్పాడు సీతయ్య. నువ్వేమీ గాబరాపడకు, మెల్లగా ఊడలు పట్టుకొని జారు, నేను బండిమీదినుంచి నిన్ను అందుకొని దింపుతాను," అన్నాడు.

రామయ్య బండిపైన నిలబడి సీతయ్యను మెల్లగా దింపుతూండగా, సీతయ్య, "ఎయ్యేయ్యే! మెల్లగా, మెల్లగా" అనడం మొదలుపెట్టాడు. దానితో ఎడ్లు ముందుకు కదిలాయి. ఇద్దరూ ఢామ్మని కిందపడ్డారు.

రామయ్య, సీతయ్య ఒకరిమీద ఒకరు పడ్డారు. రామయ్య కాలు బెణికింది. సీతయ్యకు మాత్రం గాయాలు ఏమీ కాలేదు. "అయ్యో! రామయ్యా! దెబ్బలు బాగా తగిలాయా?" అని అడిగాడు. "సీతయ్యా! పుణ్యానికి పోతే పాపం ఎదురైనట్లు, నీకు సహాయం చేద్దామంటే నాకు గాయమైంది. సరే! అంతా నా ప్రారబ్ధం," అన్నాడు. బెణికినచోట నూనె రాస్తే తగ్గుతుంది," అంటూ సీతయ్యకు డబ్బులిచ్చి దుకాణానికి వెళ్ళి నూనె తీసుకొని రమ్మన్నాడు. సరే అని సీతయ్య దుకాణానికి వెళ్ళాడు.

షావుకారు నూనె గిన్నెలో పోసి ఇచ్చాడు. తననందరూ తెలివితక్కువవాడంటారని సీతయ్య జ్ఞాపకం తెచ్చుకొని, ఆ షావుకారిని "నూనె ఇంతేనా? కొసరు ఏమీ పోయవా?" అని అడిగాడు. అప్పుడు షావుకారు గిన్నెనిండుగా నూనె ఉంది. కొసరు పోసేందుకు ఖాళీలేదు కదా!" అన్నాడు. కొసరు పోయడం తప్పించుకోవాలనుకుంటున్నాడని అనుకొని, "చూడు ఈ గిన్నె అడుగుభాగం లొట్టగా ఉంది. ఇక్కడ పొయ్యి" అని సీతయ్య గిన్నెను వంచాడు. అంతే! ఆ గిన్నెలోని నూనె నేలపాలైంది.

"ఇతనికి బుర్రలో వేపకాయంత వెర్రి ఉన్నట్టుందే?" అనుకుంటూ షావుకారు నవ్వుకున్నాడు. "ఏమిటి నవ్వుతున్నావు? నవ్వితే కొసరు అడగననుకున్నావా? పోసి తీరాల్సిందే," అన్నాడు. షావుకారు ఆ గిన్నె అడుగుభాగం లొట్టలో నూనె పోశాడు.

సీతయ్య దాన్ని చాలా జాగ్రత్తగా పట్టుకొని రామయ్య దగ్గరికి వచ్చాడు. "సీతయ్యా, ఏమిటి? గిన్నెను బోర్లించి పట్టుకొస్తున్నావా? నూనె తేలేదా?" అని అడిగాడు, "తేకేం? ఇదుగో చూడు. ఇది కొసరుమాత్రమే! అసలు నూనె గిన్నెలో ఉంది," అని గిన్నెలోని నూనె చూపబోయాడు. అంతే!... తరవాత ఏం జరిగిందో చెప్పండి.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

# పదాలు - అర్థాలు

**అ**

అంగవైకల్యం = అవిటితనం
అంధకారం = చీకటి
అంతఃపురము = రాణివాసం
అక్కర = అవసరం
అజ్ఞానము = తెలివిలేనితనం
అత్యంత = చాలా (ఎక్కువ కాని, తక్కువ కాని)
అతిథులు = ఇంటికి వచ్చిన వారు
అధికులు = గొప్పవారు
అద్భుతము = ఆశ్చర్యం కలిగించేది
అనుగ్రహం = దయ
అనుమానం = సందేహం
అనువు = అనుకూలత, వీలు
అన్యోన్యత = కలిసిమెలిసి ఉండటం
అభినందించు(క్రి.) = మెచ్చుకోడం
అమాయికులు = మోసం తెలియనివాళ్ళు, మాయలేనివాళ్ళు
అమాంతంగా = హఠాత్తుగా; ఒక్కసారిగా
అరుగు (క్రి.) = వెళ్ళడం, పోవడం
అలరించు (క్రి.) = సంతోషపెట్టడం
అవధి = చివర, కొన, అంతం
అవని = భూమి
అవశేషాలు = పోయినవిపోగా మిగిలిన గుర్తులు
అసూయ = ఈర్ష్య
అస్థికలు = ఎముకలు

**ఆ**

ఆకాంక్ష = బలమైన కోరిక
ఆదరాబాదరాగా = తొందర తొందరగా
ఆనందం = సంతోషం
ఆభరణాలు = నగలు
ఆరామం = తోట, గుడి; ఆలయం

**ఇ**

ఇంటిల్లిపాదీ = ఇంట్లోని వారందరూ
ఇంగితజ్ఞుడు = ఇతరుల మనస్సులోని భావాలు తెలిసినవాడు

**ఉ**

ఉత్సాహం = చురుకు; సంతోషం, హుషారు
ఉపదేశించు (క్రి.) = మంత్రం, సలహా మొ॥నవి చెప్పడం; మంచి సూచన చెయ్యడం

**ఊ**

ఊతం = ఆధారం; ఆసరా
ఊపిరి = శ్వాస; ప్రాణం

**ఒ**

ఒక్కింత = కొంతసేపు, కొద్దిగా

**ఓ**

ఓరిమి = ఓర్పు; సహనం; ఓపిక
ఓషధి = మందుల తయారీకి ఉపయోగించే మొక్క

**ఔ**

ఔదార్యం = దయాగుణం; ఉదారతాగుణం
ఔషధం = మందు

**క్ష**

క్షమించు = మన్నించు
క్షేమం = కుశలం, కులాసా

**క**

కచ్చితంగా = తప్పనిసరిగా, సరిగ్గా
కట్టుదిట్టంగా = గట్టిగా; క్రమమైన పద్ధతిలో
కఠినచిత్తుడు = దయలేనివాడు
కడమ = తక్కిన; మిగిలిన
కడవ = కుండ
కడలి = సముద్రం
కడు = చాలా
కయ్యం = పోట్లాట
కర్మం = పని, పాపం
కలతచెందు (క్రి.) = విచారించు, బాధపడు
కలుషితం = మురికి అయిన, మాలిన్యం చేరిన
కల్పించుకొని = కలగజేసుకొని
కళ్ళం = ధాన్యం నూర్చే చోటు
కళేబరం = చనిపోయిన జంతుశరీరం
కాకము = కాకి, వాయసము
కానుక = బహుమతి
కుమారుడు = కొడుకు
కుచేలుడు = సుదాముడు, (ఐతే చిరిగిన వస్త్రాలు ధరించడం వల్ల అతనికి కుచేలుడని పేరు వచ్చింది)
కూరిమి = ప్రేమ
కెరటం = అల
కొదువ = తక్కువ, లోటు
కొలువైన = నిలయమైన
కొలువు(వై) = సభ, సభతీర్చి
కొల్లలు = లెక్కలేనన్ని

**ఖ**

ఖరము = గాడిద

**గ**

గండం = ఆపద
గంగిగోవు = మంచి ఆవు
గట్టు = ఒడ్డు, తీరం
గడచిన = జరిగిపోయిన
గ్రక్కున = వెంటనే
గ్రామస్థులు = గ్రామంలోనివారు
గాలితరగలు = అలలుగా వీచే గాలులు
గుప్పెడు = పిడికెడు
గొడవ = అల్లరి, కలకలం
గౌరవం = అభిమానం, ప్రతిష్ఠ

**ఘ**

ఘనులు = గొప్పవాళ్ళు

**చ**

చందనం = గంధం
చను (క్రి) = వెళ్ళడం

© SCERT not to be republished

చింతించు (క్రి.) = బాధపడటం; దుఃఖపడటం, విచారించు
చివర = కొన
చుట్టం = బంధువు
చెలిమి = స్నేహం

**జ**

జంకు (క్రి) = వెనుకకు అడుగు వేయడం
జగతి = ప్రపంచం
జగము = ప్రపంచము, భూమి
జన్మభూమి = పుట్టిన ఊరు, దేశం
జలచరాలు = నీటిలో జీవించే ప్రాణులు
జాగిలం = వేటకుక్క
జాబిలి = చందమామ
జాలరి = చేపలుపట్టేవాడు
జ్ఞాపకం = గుర్తుంచుకోడం, జ్ఞప్తి, నెనవు
జీవం = ప్రాణం

**త**

తమాషా = అద్భుతం, ట్రిక్కు
తరగలు = అలలు
తరుగు (క్రి.) = తగ్గిపోవడం
తలపోయు (క్రి.) = అనుకోడం; తలచడం
తీవ్రంగా = ఎక్కువగా
తుదకు = చివరికి
తోచు (క్రి.) = కనబడటం

**ద**

దంపతులు = భార్యాభర్తలు
దర్జాగా = గొప్పగా
దాపురించు (క్రి) = దగ్గరకావడం, సమీపించడం
దాసోహం = కాళ్ళబేరానికి రావడం
దిద్దుకోడం = సరిచేసుకోడం
దివ్యమైన = గొప్ప
దురాశ = చెడ్డ ఆశ
దుర్గం = కోట
దుర్గమము = పోవడానికి కష్టమయినది
దుఃఖము = ఏడుపు, విచారం
ద్రోహం = నమ్మించి మోసగించడం
ధాన్యము = పంట

**న**

నక్షత్రం = చుక్క, రిక్క
నమ్మకద్రోహం = మోసం చేయడం
నమ్రత = అణకువ, వినయం
నింగి = ఆకాశం
నిక్కం = నిజం
నిజనామం = తనపేరు
నిట్టూర్పు = దిగాలుపడి ఊపిరితీయడం
నిత్యం = ప్రతి రోజూ
నిర్ఘాంతపోవు(క్రి.) = తెల్లబోవడం; ఆశ్చర్యపోవడం
నిర్మాణం = కట్టడం
నిర్మితము = కట్టినది
నిరుత్సాహంగా = దిగులుగా
నిరూపించు(క్రి.) = చూపించడం, తెలియజేయడం
నిలువెల్లా = శరీరమంతా
నింగి = ఆకాశం
నూకలు = విరిగిన బియ్యం, గింజలు, ముక్కలు, బియ్యం, ధాన్యం
నేత = నాయకుడు
నేరము = తప్పుపని

**ప**

పచార్లుచేయు (క్రి.) = ఏదయినా ఆలోచించడానికి కాని, కాలక్షేపానికి కాని అటూ ఇటూ నడుస్తూ ఉండడం
పట్టణము = నగరం, పురం, పెద్దఊరు
పట్టెడైన = పిడికెడైనా
పట్టెడు = చేరెడు, చేతిలో ఇమిడినంత
పతాకం = జెండా
పరమాన్నం = పాయసం
పరమార్థం = ప్రయోజనం, గొప్ప ఉద్దేశం
పర్ణశాల = ఆకులతో పైకప్పు వేసిన ఇల్లు
పర్వదినం = పండుగ రోజు, పవిత్రమయిన దినం
పర్యాటకులు = యాత్రికులు
పరివారం = బంధుమిత్రులు
పరిష్కారం = చిక్కు విడదీయడానికి, తగిన ఆలోచన లేదా చిక్కు విడదీయడానికి చేసే పని
పరులు = ఇతరులు
పస్తు = అభోజనం ఉండడం; అన్నం తినకపోవడం
ప్రభువు = రాజు
పాటుపడు (క్రి) = కష్టపడటం, పనిచేయడం
పాదరక్ష = కాలిచెప్పు
పాదుషా = రాజు, చక్రవర్తి
పారని = పరుగెత్తని; కదలని
పున్నమి = పూర్ణిమ
ప్రతిబింబించు(క్రి.) = తెలియజేయడం
ప్రతీక = గుర్తు; చిహ్నం; సంకేతం
ప్రమిద = మట్టిదొన్నె, దీపాలు వెలిగించెదొన్నె
ప్రసిద్ధిచెందిన = పేరుపొందిన
ప్రాధాన్యం = ప్రధానత, ప్రాముఖ్యం
ప్రాధేయపడు (క్రి.) = బతిమాలడం
ప్రారంభించు (క్రి.) = మొదలు పెట్టడం
ప్రార్థించు = వేడుకొను
ప్రాలుమాలు (క్రి.) = బద్ధకించడం; సోమరితనం చూపడం
ప్రియంగా = ఇష్టంగా
పూరిల్లు = గడ్డి గుడిసె
పూసగ్రుచ్చినట్లు = ఉన్నది ఉన్నట్లుగా, వివరణగా
పెడచెవినబెట్టు (క్రి) = వినకపోవడం
పేటెంట్ = ఒక వ్యక్తి తాను కనిపెట్టి తయారు చేసిన వస్తువును అమ్ముకోడానికి వాడుకోడానికి ప్రభుత్వంనుంచి పొందే అనుమతి, అటువంటి అనుమతి తెలిపే పత్రం
పైడి = బంగారం
పొంచిఉండు (క్రి.) = దాక్కొని ఉండటం
పొద = గుబురుగా ఉన్న మొక్క
పొదుపు = వృథాకాకుండా దాచడం, అలాదాచిన సొమ్ము జాగ్రత్త చేయడం
పొరుగువారు = ఇంటిపక్కలవారు
పోగాలం = చనిపోయే సమయం
పోరు = యుద్ధం, జగడం

© SCERT not to be republished

**బ**

బంధం = కట్టుబాటు, కట్టడి
బహూకరించు(క్రి.) = కానుకగా ఇవ్వడం
బారు = వరస
బాల్యమిత్రుడు = చిన్ననాటి స్నేహితుడు
బావురుమను(క్రి.) = భయంతో బిగ్గరగా ఏడవడం
బ్యారేజి = ఆనకట్ట
బుడతలు = చిన్న పిల్లలు
బెడద = ఆపద, చిక్కు
బొంకు = అబద్ధం

**భ**

భటులు = సైనికులు
బోగీ = రైలుపెట్టె / డబ్బా

**మ**

మడిమాన్యాలు = కానుకగా ఇచ్చిన భూములు, పొలాలు
మది = మనస్సు
మధురమైన = తియ్యనైన
మన్నించు (క్రి.) = గౌరవించడం, క్షమించడం
మనుగడ = ఉనికి, ఉండటం, బతకడం
మహర్షి = ఋషి, ముని
మహాప్రభూ = మహారాజా
మార్గదర్శి = దారి చూపేవాడు
మాలిన్యం = మలినం, కల్మషం
మాసం = నెల
మిత్రుడు = స్నేహితుడు
మితిమీరు(క్రి.) = హద్దులు దాటడం, ఎల్లలు దాటడం
మీనం = చేప
మురిసిపోవు(క్రి.) = సంతోషించడం
మెరుపు = తళుకు, చటుక్కున వచ్చిన వెలుగు
మృగం = జంతువు

**వ**

వచించు (క్రి.) = చెప్పడం
వధించు (క్రి.) = చంపడం
వరహా = పాతకాలంనాటి ఒక నాణెం
వ్యవధి = గడువు ఉన్న సమయం
వాదోపవాదాలు = మాటపై మాటలు చర్చలు
వాపోవు (క్రి.) = బాధ చెప్పుకోడం
వాయసం = కాకి
వాలకం = వైఖరి; ధోరణి; పద్ధతి
వ్యాపారం = వర్తకం
వ్యాపారి = సరుకులు అమ్మేవాడు; వర్తకం చేసేవాడు
విగ్రహం = మూర్తి, రూపం
విద్దె = విద్య
వినియోగించు (క్రి.) = ఉపయోగించడం; వాడటం
విముక్తి = నిర్బంధంలోనుంచి బయటపడటం
వియ్యం = పెళ్ళిద్వారా వధూవరుల తల్లిదండ్రులకు ఒకరితో ఒకరికి ఏర్పడ్డ చుట్టరికం
విరసంబైన = చెడిపోయిన
విరుచుకుపడు(క్రి.) = తీవ్రంగా కోపపడుతూ అరవడం
వివేకము = తెలివితేటలు, మంచి చెడులను తెలుసుకొనే జ్ఞానం
విశిష్టత = గొప్పతనం
వింజామర = విసనగర్ర
వెన్నతోపెట్టిన విద్య = బాగా తెలిసిన విషయం
వెర్రిబాగులవాళ్ళు = మూర్ఖులు, ఏమీ తెలియనివారు
వేల్పు = దేవుడు, దేవత
వేకువ = ఉదయం కన్నా ముందే
వేచియుండు (క్రి.) = ఎదురుచూడటం, కాచుకొని ఉండటం
వేడుక = పండుగ వంటి లేదా సంతోషించే సందర్భం

**ల**

లక్ష్యం = గురి
లేమి = పేదరికం, లేకపోవడం

**స**

సంతృప్తి = చాలాతృప్తి, పూర్తితృప్తి
సంతోషం = ఆనందం
సందేహం = శంక; అనుమానం
సంవత్సరం = ఏడాది
సమకూర్చు(క్రి.) = ఒకచోటకి చేర్చడం, కలిగించడం, ఏర్పాటుచేయడం
సమావేశం = ఒకచోట చేరడం, సభచేయడం, సభ
సమీపం = దగ్గర
సమూహం = గుంపు
సరుకు = వస్తువు, సామగ్రి
స్పందించు (క్రి.) = కదలడం, ముందుకు రావడం, జవాబివ్వడం
స్వచ్ఛత = నిర్మలత్వం; మలినత లేకుండా లేదా సహజంగా ఉండటం
సాదరంగా = గౌరవంగా
సారాంశం = తాత్పర్యం, ముఖ్యవిషయం
స్వాగతం = ఆహ్వానం, పిలుపు
స్వామి = ప్రభువు, యజమాని
సింహాసనం = రాజులు కూర్చొనేగద్దె
సిరిసంపదలు = ధనరాశులు
సీమ = ప్రాంతం
సుడిగాలి = సుడితిరుగుతూ వీచే గాలి
సుమతి = మంచిబుద్ధి (గలవాడు)
స్ఫూర్తి = స్ఫురణ; తోచడం; ప్రేరణ
స్తూపం = బౌద్ధస్మృతి చిహ్నం, స్తంభాకారమున్నది
సోమరి = బద్ధకస్తుడు

**శ**

శ్మశానము = కాడు, చనిపోయిన మనుషుల శవాలను పూడ్చే లేదా కాల్చే చోటు
శ్రద్ధ = ఏకాగ్రత
శిల్పం = రాతిపైన చెక్కిన బొమ్మ

**హ**

హఠాత్తుగా = ఒకేసారి, అనుకోకుండా
హత్తుకొనుట = కౌగిలించుకోవడం, గుండెదగ్గరికి చేర్చుకోడం
హితం = మేలు; మంచి; శుభం

© SCERT not to be republished